# మూసీ

# MUSI

◆ Samputi : 26 ◆ Sanchika : 10 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ August 2023

UGC Care List
Approved Journal

- మృణ్మయ రాగం
- కాకునూరి అప్పకవి అప్పకవీయాన్ని ఎప్పుడు రాశాడు ?
- జాయిజాదు
- మధుర బంజారాల నృత్య సౌందర్యం
- బంజారాల భాగ్యవిధాత "శ్రీ వసంతరావ్ నాయక్"
- ముదిగొండ వీరభద్రయ్య కథలు - మరిపిస్తున్న జీవిత సత్యాలు
- కూచించి తిమ్మకవి శతక సాహిత్యం - సమకాలీనత
- మాజిరెడ్డి సులోచన నవలల్లో 'హైదరాబాద్'





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

సంపుటి : 26 సంచిక : 10
ఆగస్టు - 2023
'శోభకృత్' అధిక శ్రావణ మాసం

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

మృణ్మయ రాగం ... ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు 7
కాకునూరి అప్పకవి అప్పకవీయాన్ని ఎప్పుడు రాశాడు? ...ఆచార్య వెలుదండ నిత్యానందరావు 11
జాయిజాదు (బందారం కథలు -20) ... డా. నందిని సిధారెడ్డి 13
మధుర బంజారాల నృత్య సౌందర్యం ... డా. మంత్రి శ్రీనివాస్ 17
భారతీయీకరణ14 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 21
శుక్లపక్షము (గ్రంథాంతరంగం-26) ... ఘట్టమరాజు 25
పద్యమనోహరం- 44... గన్నవరం గిరిజామనోహర్ బాబు 32
డా. అయాచితం నటేశ్వర శర్మగారితో మూసీ ముచ్చట ... డా. అట్టెం దత్తయ్య 33
'పోతన చరిత్రము' మహాకావ్యము - తెలంగాణ స్పృహ ... డా. ఎం.వి. పట్వర్ధన్ 37
బంజారాల భాగ్యవిధాత "శ్రీ వసంతరావ్ నాయక్" ... దేపావత్ శిల్ప 41
ముదిగొండ వీరభద్రయ్య కథలు - మురిపిస్తున్న జీవిత సత్యాలు ...
ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు 43
కూచిమంచి తిమ్మకవి శతక సాహిత్యం - సమకాలీనత ... డా. మల్లిపూడి రవిచంద్ర 49 .
మాదిరెడ్డి సులోచన నవలల్లో 'హైదరాబాద్' ... స్వప్న భువకర్ 54

### కవితలు

దాశరథి కవితా శరధి ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 5; చస్తూ బతకడమే ... ధూళిపాళ అరుణ - 6; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; స్వప్నం ... జంగం స్వయంప్రభ - 10; విలాపగీతం ... జి. గోపి - 40; పాదుపల్లె ... కంచరాన భుజంగరావు - 53; ప్రశ్నగా మారిన చిరునామా ... డా. తండు కృష్ణ కౌండిన్య - 62.

### సమీక్షలు

విరాజిల్లిన తెలంగాణ అవధాన వైభవం ... సాగర్ల సత్తయ్య 59
అరుదైన యాత్రాకథనం ... శ్రీనివాస్ బందా 60
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు**

# సమస్య

నిత్యజీవితంలో మనకు చాలాసార్లు చాలామంది నోళ్ళలో వినిపించేది సమస్య అనే మాట. మూలార్థం ఎలా ఉన్నప్పటికీ భావార్థం వేరుగా వినియోగించబడుతుంది. మనం ఎదిరించలేనిదీ, కష్టమయ్యేది, సాధించలేకపోతున్నదీ అనే అర్థంలో సమస్య శబ్దాన్ని వాడుతున్నాం. ప్రతీదీ సమస్యగానే చూసేవాళ్ళు కొందరైతే, జీవితంలో సమస్యలే లేవు అనేవారు మరికొందరు. లోకంలో సమస్య అంటే తెలియనివాళ్ళుంటే, నిత్యజీవితం నిరంతరం సమస్యలతో నిండిపోయినవారు మరికొందరు. ప్రకృతిలో ఇంతటి వ్యత్యాసం అన్ని విషయాల్లో కనిపిస్తూనే ఉంది.

సమస్యలు లోకంలో ఉంటాయా? మనం భావిస్తామా? అనే ప్రశ్న వేసుకుంటే ఒక సమాధానం సాధించే ప్రయత్నం చేయవచ్చు. ఏదైనా అంశాన్ని సమస్యగా మనం భావిస్తున్నామంటే ఆ అంశ విధానాన్ని బట్టి దానిని మనం అనుభవించలేకపోవడం, పొందలేక పోవడం, కొనుక్కోలేకపోవడం, సాధించలేకపోవడం వంటి కారణాలు కనిపిస్తుంటాయి. ఉదాహరణకు ఏదైనా ఒక వస్తువును కొనడానికి వెళ్తే దాని విలువ పదివేలు అయితే, మన దగ్గర కేవలం ఒక వేయి రూపాయలు మాత్రమే ఉన్నప్పుడు అది సమస్య అవుతుంది. అదే వ్యక్తి తన దగ్గర లక్ష రూపాయలు ఉన్నప్పుడు పదివేల రూపాయల వస్తువు సమస్యారహితమైనదిగా గుర్తిస్తాడు. ఈ నేపథ్యంలో సమస్యలు వస్తువుల్లోనూ, లోకంలోనూ, ప్రకృతిలోనూ ఉండవని స్పష్టం. సమస్యలు కేవలం తమలోనే ఉంటాయి. తమ దగ్గర శక్తి ఉన్నవాడు అన్నింటినీ సమస్యారహితంగా చూడగలడు. శక్తి లేనివాడు అన్నింటినీ సమస్యలుగానే చూస్తున్నాడు. దీనిని బట్టి శక్తిని పెంచుకుంటే లోకంలో మనకు సమస్యలు ఉండవనే విషయం సుస్పష్టం.

వ్యక్తి శక్తిని పెంచుకునే ప్రయత్నం నిరంతరం చేస్తూనే ఉండాలి. తన శక్తిని మించిన పనులు చేయాల్సి వచ్చినప్పుడు అది అవకాశంగా భావించాలి తప్ప సమస్యగా చూడకూడదు. నిరంతరం తనను తాను ఉన్నతునిగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేస్తూనే ఉండాలి. శక్తి చాలా విశేషమైంది. మన శరీరంలో కంటికి చూసే శక్తి, చెవికి వినే శక్తి, తింటే అరిగే శక్తి లాంటి ... శక్తులు ఎలా ఉంటాయో... ఆ యా శక్తులు తగ్గినప్పుడు మనలో సమస్యలు కూడా అలాగే పెరుగుతుంటాయి. అదేవిధంగా శక్తి పెరిగినప్పుడు సమస్యలు తగ్గిపోతాయి. రోగనిరోధక శక్తి పెరిగితే రోగాలు మటుమాయం అయినట్లు సమస్యలు కూడా మాయం అవుతాయి.

ధనం బాగా ఉన్నవానికి ధన సంబంధమైన సమస్యలు ఉండకపోవచ్చు. ఆరోగ్యం బాగా ఉన్నవానికి రోగ సంబంధ సమస్యలు ఉండకపోవచ్చు. విద్య ఉన్నవానికి జ్ఞాన సంబంధ సమస్యలు ఉండకపోవచ్చు. కాని పూర్ణమైన మానసిక శక్తి ఉన్నవానికి మాత్రం ఏ సమస్యలు ఉండవు. లోకంలో మన మానసిక శక్తిని పెంచుకునే ప్రయత్నం నిరంతరం చేస్తూ ఉండాల్సిందే. శక్తిని పెంచుకోవాల్సిన వారు ఎప్పటికీ శక్తిని గూర్చిన ఆలోచనలు చేయాలి కాని, సమస్యలను గూర్చిన ఆలోచనలు చేయకూడదు. ఏది ఆలోచనల్లో ఉంటే దానిలాగే మారుతాం కాబట్టి, సమస్యలను అసలు ఆలోచించకుండా కేవలం శక్తిని గూర్చిన ఆలోచనలు చేయాలని భారతీయ ధర్మం సూచన చేస్తుంది. భూమి కూడా నిరంతరం సూర్యుని చుట్టే పరిభ్రమణం చేస్తూ ఉన్నది... శక్తి కోసమే కదా! మానసిక శక్తి పెరిగితే అదే ఆర్థికశక్తిగా, సామాజిక శక్తిగా, శారీరక శక్తిగా పరిణమిస్తుంది. శక్తి పెరిగినవాడే లోకంలో సమర్థుడు. శక్తి లేనివానికే లోకంలో సమస్యలు. శక్తిని పెంచుకునే ప్రయత్నమే జీవితం. జీవితాన్ని అధిగమించాలన్నా శక్తి పెంచుకోవడమే మార్గం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఆగష్టు : 2023

# దాశరథి కవితా శరధి..!



చల్లని సంద్రమెంతగను జక్కగ దాచిన యగ్ని కీలలన్
వెల్లడి జేసినట్టి ఘన వేదన మానవ జాతికెల్ల నిలన్
జల్లన పాటరీతి హృది సల్పిన బాధల నిక్కమే గనన్
ఉల్లము చేతనంబుగన వుచ్చము విప్లవ దారి జూపగన్!

ఎవ్వడు నీ పథంబునను నెన్నగ సాగెను నాటి పోరుకున్
నెవ్వడు బందిఖానలను నెవ్విధి బాధల కోర్చె జూడగన్
ఎవ్వరు త్యాగభావముల నెంతయు చింతలు జేరి పోరిరిన్
క్రొవ్వన యగ్నిధారగను గూర్చె నిజాముకు డెందమందునన్

జైలుకు వెళ్లినట్టి కదు చేతన గల్గి పుంగవోత్తమా
పాలక గుండెలన్ దడను ప్రాప్తము జేసిన ధీవరుండవే
జాలము లేమి లేకయును జాగృతి ప్రేరణ జాతికివ్వగన్
కాలపు కావ్య గానమున కర్కశ బాణమె నీదు కావ్యముల్!




బొగ్గుయె ఘంటమయ్యెనుగ గోడలపైనను పద్యరాశియై
నిగ్గును దీసె దుష్టులను నిర్భయ రీతిగ నాటి పాలనల్
అగ్గిని రేపునావు కదు నారని మంట నిజాము రాజుకున్
బుగ్గిని జేసి దాశరథి! బూర్జువ పాలనయంత మాయగన్!

వెట్టిగ పీడనాదులను వీడ నిజాముని దుష్టపాలనల్
గట్టిగ విప్లవోద్యముల ఘర్షణ వైఖరి కావ్యసంయుతిన్
చుట్టి రజాకరుల్ కనగ చోద్యము తోడుత పారద్రోలగన్
పట్టిన జైత్రయాత్ర ఫల పావనమే తెలగాణ వైభవోన్నతుల్!!





డా. గన్నోజు శ్రీనివాసాచారి
ఫోన్ : 9490 145 913

# చస్తూ బతకడమే !!



అదేమీ విహారం కోసం
సరదాగా వెళ్లే చోటు కాదు
కావాలని కోరే నివాసమూ కాదు
ఆనందపు నావలు
భగ్నమవుతాయి అక్కడ
భళ్ళున పగిలిన హృదయాలు
దు:ఖ భారాలను ఈడుస్తుంటాయి
భ్రాంతులు ముక్కలై చెదురుతాయి
ఇవేవీ కదిలించవు అతన్ని...



దేహాలు కాలుతున్న వాసనలు సోకవు
కాల్చడమే తన పని కదా!
బూడిదయ్యేదాక చూడాలి..
ఆగని కన్నీటి ఉప్పెనలో
చిత్తడి అయిన నేలకు
వెచ్చటి నెగళ్లను రగిలించాలి
మరో నిర్జీవ శకలం కోసం
జాగను సవరించాలి
మనసు ఎన్నిసార్లు చచ్చి బతికిందో
గొంతులో పూడుకుపోయిన మౌనం,
పెకలాలని ఎంత ప్రయత్నించిందో
మంటలను ప్రతిఫలించే కళ్ళు,
ఎంతటి ఆక్రోశ రుధిరాన్ని నింపుకున్నాయో
చిరునవ్వు ఎరుగని పెదాలు
ఎండిన గాయాలతో
ఎన్నెన్ని పగుళ్లను ముద్రించుకున్నాయో
ఆ కర్మసాక్షికే తెలుసు...



ఏ క్షణం ఏ నాలుగు భుజాలు
భూమిపై ఒక భారాన్ని దింపుకుంటాయో
ఆ సమయం కోసమే ఎదురుచూపు
వృత్తిధర్మం మరి !!


**శ్రీమతి ధూళిపాళ అరుణ**

ఫోన్ : 871 234 2323


# తుకారాం అభంగం

హరిపాదాలు జీవ భవ హరణాలు
హరిపాదాలు ఇవే భయ విముక్తాలు
అంతులేని అవరోధాల నడ్డగించు
మార్గాలు

విడువు భేదభావాల తగవు
విడువు తగ్గ హెచ్చుల బిగువు
పాడు పరవశించి పదాలు
అవే ముక్తికి సోపానాలు

అందరిలో నుండు బింబము
అంతటను నిండే గనుము
అహంకార మదము విడుము
అంతరాత్మ అతడే హరి ఘనము

తుకా పరమాత్మలో నిండి
జగమంతగ వ్యాపించేను
హరిపదములు పాడుకు
మైమరిచి ఇలను తిరిగెను





**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**

ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఆగస్టు : 2023

# మృణ్మయ రాగం

**ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు,** అధ్యక్షులు, తెలుగుశాఖ, కాశీహిందూ విశ్వవిద్యాలయం,
ఫోన్ : 94413 30511

**"చదువు సంధ్య లేదు, పదవులేమియు లేవు**
**కండబలముతోడ గుండె కలదు**
**మేడి చేతబట్టి బీడైన దున్నెద**
**ముందుదారిఁ జూపు గాంధితాత!"** – 'పెత్తందార్లు' సినిమా నుండి.




**'నా దేశం కోసం నడుం బిగించి నాగలి పట్టానోయ్'** అనే యువకుడు కనిపించటం లేదు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కలలుగానే మిగిలిపోయింది. ఊరుమ్మడి బతుకులు లేవు. మడిని నమ్ముకుని బ్రతుకు తెల్లవార్చగలమన్న ధీమా లేదు. ఊరి ఉమ్మడి ప్రయోజనం కోసం ఉమ్మడిగా నిలబడే జనం లేరు. పల్లెలు రాజకీయాల ప్రతిధ్వనులయ్యాయి. పైరుపచ్చలతో రైతు శోభాయ మానంగా బ్రతికే కాలం కాదిది! పురుగుమందులు పురుగులకంటే, పరువు కోసం ఆత్మహత్య చేసుకునే రైతులకే బాగా ఉపకరిస్తున్నాయి. విత్తవలసిన విత్తులు విందుకు ఉపకరిస్తున్నాయి. పొలాలు ప్లాట్లయి పోతున్నాయి. 'రియల్ ఎస్టేట్' ముందు ఏ వ్యాపారమూ దిష్టి తీయటానికి పనికిరావటం లేదు. ఇటువంటి సమాజంలో భూమిని నమ్ముకున్న రైతు స్థితి ఎలా ఉంటుంది! వృద్ధాప్యంలో తీరికగా బాల్యాన్ని నెమరేసుకున్నట్లు, గత వైభవ దీప్తుల్ని తలచుకొని పొగిలే రైతుకు మిగిలేది ఆత్మవేదనే తప్ప ఎటువైపు నుండీ సాంత్వన లభించటంలేదు. ఈ నేపథ్యంలో నాగభైరవ రాసిన 'మట్టిబండి'ని చూడాలి.

'మట్టిబండి' అనగానే మట్టిని మోసే బండి అని, మట్టితో చేసిన బండి అని రెండర్థాలు స్ఫురిస్తాయి. 'మృచ్ఛకటికం'లో 'మట్టిబండి' తోనే సమస్య మొదలవుతుంది. ఈ 'మట్టిబండి' రైతు జీవితానికి ఉపమ.



**"వ్యవసాయం / ప్రధాన వృత్తిగా ఉన్న**
**భారతదేశంలో / స్వర్ణశకటంలాగా**
**పచ్చపచ్చగా ఉండవలసిన / రైతు జీవితం**
**ఎండకు పెట్లిపోయి / వానకు కరిగిపోయే**
**మట్టిబండిలా / మారిపోయినందుకు**
**మథనపడుతూ............**
**........ / పొలాన్ని అమ్మేశాను"**

అని కవి రైతు నోట పలికించిన మాటలే అందుకు సాక్ష్యం. మట్టి లేనిదే మనిషి లేడు, మనిషి మనుగడా లేదు. ఇది ఆత్మాశ్రయంగా సాగిన రైతు ఘోష, కవితో అభేదాన్ని పాటించే కవిత్వ శ్వాస.

ఆధునిక సాహిత్యంలో రైతు కావ్యాలు చాలా ఉన్నాయి. రైతు జీవితాన్ని చిత్రించిన కవులూ ఉన్నారు. అయితే వారిలో కొందరు కర్షక కవులు, మరికొందరు వార్షుకాభ్రముల (సీజనల్ పొయెట్స్) వంటి కవులు. నాగభైరవ ఆదినారాయణ ఈ కావ్యం ద్వారా కెథార్సిస్‌ను సృష్టించి పఠితను తనతో సహానుభూతిని పొందగలిగేలా చేసి కావ్యగత భావాలతో సంవేదన పొందగలిగేలా చేయగలిగారు. ఇది బహుశా జాషువా వద్ద నేర్చుకున్న విద్యయేమో? జాషువా కూడా పాఠకుడికి కరుణ ద్వారా వర్ణ్యవస్తువు మీద సానుభూతిని కలిగించి కెథార్సిస్లాంటి అనుభవాన్ని కలిగిస్తాడు. సహానుభూతి ద్వారా కలిగే ఒక మానసికోద్వేగం, దాని ప్రక్షాళనకు దోహదం చేసే ధోరణి ఆత్మాశ్రయ కవిత్వం కంటే విలక్షణమైన ఆత్మీయ శైలి. వర్ణించే అంశంపై భావశబలతతో పాటు పారవశ్యాన్ని కలిగించటం, విషాద గంభీర భావానికి ప్రాధాన్యతను కలిగించి, పఠితను సహానుభూతికి లోను చేయటం జాషువాలో లాగే ఈ కవి రచనలో మనకు సాక్షాత్కరిస్తుంది. విషాద గంభీర స్వభావం కావ్య కథా సూత్రంలో ప్రతిఫలిస్తూ, పఠిత మనసులో కెథార్సిస్ను సృష్టిస్తుంది. అది ఎలాంటిదంటే ఒక మహాకావ్యాన్ని చదివినప్పుడు కలిగే హృదయ సంవేదనం లాంటిది. ఇది నిర్వేద భావ స్ఫూర్తి కాదు. కారుణ్యభావ దీప్తి. ఇది ఒక గబ్బిలము, పిరదౌసి వంటి కావ్యాలు చదివినప్పుడు కలిగే

అనుభూతిలాంటిది. ఈ అనుభవాన్ని ఖండకావ్యాల ద్వారా, లఘుకావ్యాల ద్వారా పద్యకవిత్వంలో కొందరు కవులు చేశారు. వచన కవిత్వంలో తిలక్ తరువాత మళ్లీ ఆదినారాయణ గారి ఈ కావ్యం నాకు అలాంటి అనుభూతిని కలిగిస్తోంది.

కవితానుదర్శించే ప్రకృతి, సమాజ జడాజడాలు హృదయస్థమై, రూపాంతరం చెంది తిరిగి సమాజంలోకి ఎగిరిపోవటమే సృజన అంటే. అంటే కవితానుదర్శించే బింబాలు, ప్రతిఫలనం చెంది వివిధమైన వర్ణచిత్రాలుగా మారిపోవటమే కవిత్వం. ఈ కావ్యంలో కవి గీసిన భావచిత్రాలు అలాంటివి. తన హృదయస్థమైన రైతు జీవనం లోని దృశ్యాలన్ని అపురూపమైన భావచిత్రాలుగా ఇందులో దర్శనమిస్తాయి. ఈ కావ్యాన్ని నడిపిన తీరు సమర్థుడైన ఒక సినిమా దర్శకుడు రాసుకున్న స్క్రీన్ ప్లేలా, అందుకనుగుణమైన షాట్ డివిజన్స్‌తో కూడి కనిపిస్తుంది. దీన్ని చిత్రించగల మంచి భావుకుడైన దర్శకుడుంటే మంచి చిత్రంగా రూపొందించవచ్చు. దానినలా ఉంచుదాం!

ఈ కావ్యం ప్రారంభమే "మా పొలాన్ని అమ్మేశాను" అనే విషాదంతో ప్రారంభ మవుతుంది. ఆ విషాదానికి విభావానుభావాల్ని వరుసగా ప్రస్తరిస్తూ పోవటమే కావ్యమంతా. కేవలం ఎంచుకున్న అంశమో లేదా విషయమో కవి గీసే గీతలకు పరిపుష్టిని కలిగించదు. కవికి మాత్రమే సొంతమైన పరిశీలనా నైపుణ్యం, నైశిత్యం, గ్రహణశక్తి, అంతర్మథనం సంక్షిప్త సుందరంగా ఉంటూనే సమగ్రమైన అనుభవాన్ని అందించాలి. శక్తిమంతమైన స్వీయానుభూతి, చెప్పే వస్తువుతో సంలీనత చెందాలి. ఈ కావ్యం అలా కుదురుకుంది. కవి చెప్పే అనుభవంగాని, అనుభూతిగాని పాఠక హృదయానికి అనుభూత మవుతుందా? అన్న ప్రశ్నకు నిలబడేదే కావ్య జీవితం. ఆ దృష్ట్యా ఈ కావ్యం పాఠకుల హృదయాలలో స్థిరజీవే.

ఏ కావ్యాన్ని గురించి పరిశీలించే విమర్శకుడైనా కావ్యగత వస్తు విచారం చేయటం సాధారణాంశం. ఆ వస్తువును ఎలా అభివ్యక్తీకరించాడో గమనించి చెప్పటం తరువాతి సోపానం. అభివ్యక్తిలోని అలంకారాల్ని, చోటుచేసుకున్న ఇమేజరీని, ఎలిగొరిని వెదకి చెప్పటం తరువాతి సోపానం. కవి సృష్టించిన ప్రతీకను వివేచించటం చివరి దశ. ఈ కావ్యంలో కుదురుకున్న ఈ నాలుగు సోపానాల్ని గమనిద్దాం!

ఒక భావానికి సంబంధించిన అనేక కోణాలు మేళవించటం దీర్ఘకవితలో కనిపించే తొలి లక్షణం. **"సమాజ జీవితంలో వివిధ రంగాలలో మానవుడు ఎదుర్కొనే సమస్యల వలనగాని, స్వీయమైన ఆంతర జీవితంలో తాను పొందే అనుభూతుల వలనగాని ఏర్పడే మానసిక ప్రవృత్తులను చిత్రించే వైవిధ్యంతో కూడిన భావచిత్రాల సంపుటీకరణ దీర్ఘకవిత"** (జి.వి.యస్. – 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, పుట 592). ఈ 'మట్టిబండి'ని కావ్యమనాలా? కవిత అనాలా? 'Long Poem' అన్నదానికి పర్యాయ పదంగా మనం 'దీర్ఘకవిత' అంటున్నాం. అది కలిగించే అనుభూతి సాంద్రతనుబట్టి కావ్యమనాలా? కవిత అనాలా? అన్నది నిర్ణయించబడుతుంది. రచనా ప్రక్రియను బట్టి ఇది దీర్ఘకవిత. అందించే అనుభవాన్నిబట్టి ఈ 'మట్టిబండి'ని కావ్యంగా పరిగణించాలి.

ఆధునిక కవిత్వం బ్రతుకుతున్నదే ఇమేజరీతో. వస్తుపరంగా భావచిత్రాలను కల్పించి, కావ్యాన్ని ఆత్మకథగా చెప్పటం ఆధునిక కవి చేసే ఒక శిల్ప ధోరణి. ఇక్కడ ఆత్మకథగా అంటే సమాజాన్ని తాను దర్శించి, పొందిన అనుభవాలను అందమైన భావచిత్రాలతో లోకానికి చెప్పటం. భావచిత్రం కవి అనుభవంలోనుండే పురుడు పోసుకొని పాఠకుడిని భావనామయమైన ఉద్వేగావస్థకు గురి చేస్తుంది. ఈ 'మట్టిబండి' ద్వారా ఆదినారాయణ చేసిన పని అదే! వ్యవసాయ కుటుంబంలో రైతు అనుభవం ప్రాతిపదికగా సృష్టించిన ఒక్కొక్క భావచిత్రం ముత్యమై, నిడివిమీద ముత్యాలదండగా ప్రకాశిస్తుంది.

పొలాన్ని అమ్మనెంచిన రైతు, ఆ పొలంతో ముడివేసుకున్న ఎద్లు, ఎద్లబండ్లు, అరక, గడ్డివాము, గాదె, కొష్టం, మెట్టు, ఉబ్బలివాగు, కుంట, వరవమీది జమ్మిచెట్టు, చద్దన్నపు దుత్త, దున్నిన చాలు, బండిచక్రం, కందెనగుడ్డ, మునుంపట్టి కలుపు తీసే కూలీలు, తంపట్లు వేసి వేరుశనగకాయల్ని కాల్చుకుతినటం, లేత జొన్నకంకుల్ని కర్రతో కొట్టి తినటం, చేను గట్టుమీది బంతినారు, గట్లమీది గడ్డిపరకలపై పడ్డ మంచు బిందువులు, చూడిగేదె కోసం పైరజొన్న కోసుకు రావటానికి పోయిన అక్క బీడుపొలం, గొడ్లు కాసే పిల్లల ఆటలు, పాముల భయాలు, గడ్డివాముల చాటు సరసాలు, జడ్డిగం ద్వారా గింజను జారవిడిచే రైతు – ఇవన్నీ కవి అనుభవంలో నుండి జాలువారిన భావచిత్రాలు. ఈ భావచిత్రాలన్నీ మహాకావ్యంలో పాత్రల్లాగా మనల్ని పలకరిస్తాయి. చివరిగా కొడుకుల సంభాషణ, భారతదేశంలో భూములున్న రైతుల జీవన అస్తిత్వ వేదన. ఈ కావ్యంలోని పేరు లేని రైతు భారతీయ కర్షకునికి ప్రతీక. ఇలా భావచిత్రా లతో విషయాన్ని అందంగా అభివ్యక్తీకరిస్తూనే అంతర్లీనంగా కరుణరసాన్ని పొదవి పాఠకుల్ని ఆవర్జించాడు.

ఈ కవి రసాన్ని ఎలా పోషిస్తాడని చెప్పటానికి ఒక ఉదాహరణ చూద్దాం! పొలం అమ్మిన తరువాత, పొలంతోపాటు సాయంగా నిలిచే ఎద్లను, బండిని అమ్మిన సందర్భంలో ఎద్లను గురించి, వాటితో పెనవేసుకున్న బంధాన్ని వర్ణించి చెప్పిన సందర్భం చూడండి. మనసు తడిసిపోతుంది. రైతు కంటిపాపలా, ఇంటి బిడ్డల్లా బాధ్యతల్ని పంచుకున్న ఎద్ల విశిష్టతను, వాటి గుణగణాల్ని, వాటితో తన అనుబంధాన్ని మానవీకరించి చెప్పిన సందర్భంలో రైతుకే కాదు మనకూ కళ్లు చెమరుస్తాయి. ఒక్కరోజు తమ యజమాని కనిపించకపోతే పిల్లలు తల్లిదండ్రుల కోసం దిగులుపడ్డట్లు చొప్ప, గడ్డి ముట్టకపోవటం, కుడితిని సైతం మూచూడకపోవటం, యజమాని కనిపించగానే గారాలు పోయి ముట్టెల్ని భుజాలపై చేర్చి కదలనీయక పోవటం – వంటి వర్ణనలు, కరుణానికి విభావానుభావాల్ని పోషిస్తున్నాయి.



**"అటువంటి బిడ్డల వంటి ఎడ్లను**
**వాత్సల్యంతో పెనవేసుకొని**
**పెంచుకున్న ఎడ్లను**
**మా పట్ల ప్రేమను, విశ్వాసాన్ని**
**ప్రదర్శించే ఎడ్లను**
**నిర్దయగా అమ్మేశాను**
**నిర్దాక్షిణ్యంగా అమ్మేశాను.**
**ఎడ్లను కొన్న ఆసామి**
**కొష్ఠం నుండి వాటిని తోలుకుపోతుంటే**
**చూడలేక తల తిప్పుకున్నాను**
**కాని**
**మనసును అదుపు చేసుకోలేక"**

అనటంలో కరుణ స్థాయి భావాన్ని అందుకుంటున్నది. ఏ కృష్ణశాస్త్రో రాసినట్లు అనిపిస్తోంది.

**"అసలే ఆనదు చూపు, ఆపై ఈ కన్నీరు, తీరా**
**దయచేసిన నీ రూపు తోచదయ్యయ్యో"**

అన్న శబరిలా దుఃఖంతో కళ్లకు కమ్మిన కన్నీటిజీరతో, దూరమవుతున్న ఎడ్లు ముందుగానే కనిపించకపోవటం విషాదంలో మరింత విషాదం!

ఇలా వర్ణించే వస్తువును భావశబలతతో వర్ణించి పాఠకుడిని తన వైపుకు లాగికొని పోవటం ఈ కావ్యంలో ప్రతి భావచిత్ర వర్ణనలోను తారసపడే అంశమే!

ఇక ఈ కావ్యంలోని అలంకారాల్ని గురించి ప్రస్తావించాలి. కవిత్వానికి ప్రాణప్రదమైంది ఆలంకారిక భాష, వస్తువు అలంకారంగా మారిపోవటమే కవిత్వమని శేషేంద్ర అంటారు. అలంకారాలలోని గుణాపమ్యము అంటే రచనలోని గుప్త నిర్మాణమనే తాత్పర్యం.

సహజోక్తులతో అలంకరించిన కవితాపంక్తులు కొన్ని స్టేట్మెంట్లలా కనిపించవచ్చు. మనం కోట్ చేసే వాక్యాల్ని గమనించండి. అవి స్టేట్మెంట్లో, స్టేట్మెంట్లకు దగ్గరగానో కనిపిస్తాయి. ఇలా కోట్ చేయటానికి ఉన్న గుణాన్నే నన్నయ **నానారుచిరార్థసూక్తి నిధిత్వ**మని అన్నాడు. మంచి కవిత్వానికి అది కలికితురాయి. సు+ఉక్తి = సూక్తి గదా!



**"రైతంటే**
**సస్యమనే అశ్వాన్ని అధిరోహించి**
**ఆకలి రాకాసి నుండి**
**లోకాన్ని కాపాడే రౌతు"**
**"సాగు అనే యాగాన్ని**
**ఆచరించే గొప్ప ఋత్విక్కు"**
**"మన్ను నుండి పరబ్రహ్మ**
**స్వరూపాన్ని రూపొందించే విధాత"**
**"హాలికుడు ఏకవచనాన్ని**
**బహువచనంగా మార్చగల మహామాంత్రికుడు"**

వంటి స్టేట్మెంట్ లో అలంకారం కూడా లాస్యమాడుతున్నది.



**నాగభైరవ ఆదినారాయణ**

తన పొలం పోగొట్టుకోవటమనే వియోగ భావశబలతతో తుట్టెను కదిపితే కుట్టే కందిరీగల్లా చుట్టుముట్టిన జ్ఞాపకాల దొంతర ఈ కావ్యం. ఈ కావ్యం నిండా సహజోక్తులతో కూడిన వర్ణనలే. అభేద రూపకాలు, ఉపమాలంకారాలతో సాగే సరళ స్వాదు కావ్యమిది.

**"ఆస్తిలో, ఆదాయంలో**
**వామనత్వమే అయినా**
**రైతు అంతరంగం నిండా బలి తత్త్వమే"**

సంప్రదాయ ప్రసిద్ధమైన 'బలి-వామనుల' కథలో వామనుని త్రివిక్రమత్వాన్ని, బలి త్యాగశీలాన్ని పాజిటివ్ డైమెన్షన్స్ ప్రయోగిస్తుంటాం. అవి భిన్న వ్యక్తులకు కాకుండా ఏక వ్యక్తికే ఆపాదించి త్రివిక్రమత్వపు జోలికి పోకుండా రైతుకున్న ఆస్తిపాస్తు లకు, ఆదాయానికి కేవల వామనత్వాన్ని, రైతు త్యాగశీలతకు బలి తత్త్వాన్ని జోడించి చెప్పిన ఈ వక్రోక్తి అలంకారం సహజోక్తిలా కుదురుతుంది.

ఈ కావ్యంలో కనిపించే మరో గుణమేమంటే సాదాసీదా వచనంలాగా సాగుతూనే మన మనసును మెలిపెట్టే వర్ణనో, అనుభవమో మనతో సంవదిస్తుంటుంది. శబ్దాడంబరం తక్కువ. భారం కాని సహజాలంకారాలు హాయిగా చదివిస్తాయి.



**"వ్యవస్థలపై రోత కలిగి**
**అవస్థలతో నలిగి నలిగి**
**హలాలను విసిరికొట్టి**
**పొలాలను విడిచిపెట్టి**
**హాలికులందరూ**
**తలోదారికి**
**తరలిపోతే**
**రామచంద్రుడు పాలించిన**
**రామరాజ్యంలో**
**రేపు**
**అన్నమో రామచంద్రా అనే అరుపులు వినిపిస్తాయేమో!"**

ఇది ఈ కవియొక్క ఆక్రందనే కాదు! అందరి ఆక్రందన కావాలి. కొద్దిపాటి సవరణ చేస్తే ఈ పై పంక్తులు గేయమవుతాయి. గేయగంధ వచనంలా దీనిని చెప్పవచ్చు.

వస్తుగర్భితం కాని మాటలెన్ని చెప్పినా అవి కేవల సందర్భానికి చెప్పిన మాటలే అవుతాయి. కాకపోతే కొన్ని ఆలంకారికంగా చెప్పిన మాటలవుతాయి కాని కవితోక్తులు కావు. ఈ 'మట్టిబండి'లోని ప్రతి మాటా వస్తుగర్భితమైనదే! ప్రతి అలంకారమూ వస్తువును గురించి ముచ్చటించేదే!

**"ఆదిభిక్షువు ఆకలినైనా**
**తీర్చగల త్రాత"**

అని రైతును గురించి చెప్పిన ఈ పై పంక్తుల్ని చదివినప్పుడు అల్లసాని పెద్దన.

**"అచటి నాలవజాతి హలముఖాత్త విభూతి**
**ఆదిభిక్షువు భైక్షమైన మాన్చు"** అన్న పంక్తులు గుర్తుకు వస్తాయి.

మంచి అభివ్యక్తి గల ఈ కావ్యం సమకాలీన కావ్యాలలో విశిష్ట.

ఒకసారి బుద్ధభగవానుడు అడవిలో ఒంటరిగా పోతున్నాడట! అది మండే ఎండల సమయం. ఒక చెట్టు నీడన కొంచెంసేపు ఆగాడట! ఆ చెట్టు ఎండిన మోడు. దాని అంతశ్చైతన్యం తపించి **"అయ్యో! రాక రాక భగవంతుడు నా పంచకు వస్తే నిలువ నీడనీయటానికి ఒక్క పచ్చని ఆకు కూడా లేని నిరుపేదనైనానే అని దుఃఖించి, స్పందించి అంతశ్చైతన్యాన్నంతా కూడగట్టుకొని చిగిర్చి పుష్పించిందట!"** ఇది నిజమో, సత్యమో నాకు తెలియదు. ఈ కావ్య పఠనం ద్వారా మన హృదయాలలో కూడా రైతుపట్ల, రైతు జీవనంపట్ల అలాంటి సాంద్ర స్పందన కలగాలని కోరుకుంటూ...

---

# స్వప్నం



నిశీధి కోటలో
నిశబ్దాల వేటలో
తడియారని నయనాలకు
ఊతమేమి కాదు
ఊరటంతకన్నా కాదు
ఊపిరాడని పిడికెడు గుండెకు
చప్పుడు చేయని
కనురెప్పల కౌగిలిలో
ముచ్చటేమీ కాదు...
విశ్వమే కనుపాపైన
అర్నిద్ర కన్నులకు
ఉలికిపాటెందుకు
ఊ...కొడుతూ ఉండేందుకు
క్షణక్షణాల (సం)ఘర్షణలో
రాలిపడ్డవో
రగులుతున్నవో
రాజుకున్నవో
రాజీ పడ్డ(ని)వో
రేయింబవళ్లు
రేగు ముళ్ళులా గుచ్చుతున్న
ఉచ్చులకు సంకెళ్లు తెరచి
చీకటిని చీల్చివేసే
ఉజ్వల (సం)కేతనాలు
నిద్రను మేల్కొల్పేవే స్వప్నాలు..!!





**జంగం స్వయంప్రభ**
889 755 2022

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10

హైదరాబాద్ ఆగస్టు : 2023

# కాకునూరి అప్పకవి అప్పకవీయాన్ని ఎప్పుడు రాశాడు?

ఆచార్య వెలుదండ నిత్యానంద రావు, ఫోన్ : 9441 666 881




తెలుగులో తొలి పరిశోధకుడు కాకునూరి అప్పకవి. కాలం 17వ శతాబ్దం. పుస్తకాలు తాళపత్రాలలోనే మూలుగుతూ ఉన్న కాలంలో అప్పకవి 43 పూర్వ లాక్షణిక గ్రంథాలనుండి, 100 కావ్యాల నుండి తనకు కావలసిన 300 పద్యాలకు పైగా సేకరించి, వాటి బాగోగులను చర్చించాడు. మహాభారతంలో తిక్కన శాంతిపర్వంలో ఒకే ఒక్క చోట "జ్ఞా" కు "కా"కు యతి వేసిన దృష్టాంతాన్ని పట్టుకున్నాడు. గుర్తుపెట్టుకున్నాడు. ఉల్లేఖించాడు.

జ్ఞానము కేవల కృప న
జ్ఞానికి నుపదేశ విధి ప్రకాశము సేయం
గా నది సకల ధరిత్రీ
దానంబున కంటె నధికతరఫలద మగున్
(శాంతి పర్వం 4-255.)

24వేల పైచిలుకు మహాభారతం పద్యాల్లో, ఎలాంటి పద్య సూచికలు లేని కాలంలో అదీ తాళపత్రాల్లో ఈ పద్యాన్ని వెతికి పట్టుకోవడం పరిశోధకజగతికి స్ఫూర్తిదాయకం. కోవెల సంపత్కుమారాచార్యుల వారి మాటల్లోనే చెప్పాలంటే **"అప్పకవి అనేక గ్రంథాల నుండి అనేకాంశాలను ఉటంకించాడు. ఉదాహరించాడు. తన అభిప్రాయాలకు ప్రమాణాలు ప్రదర్శించాడు. పూర్వుల అభిప్రాయాలను స్వీకరించాడు. కొన్నింటిని హేతుబద్ధంగా నిరాకరించాడు. విషయాన్ని శాస్త్రీయంగా విశ్లేషించాడు. వివిధ అంశాలను వర్గీకరించాడు. మూలగ్రంథానికి సంబంధించిన మూలాలను తన ఆధారాలతో ప్రదర్శించాడు. చర్చలు నిర్వహించాడు. అయితే ఆయన అభిప్రాయాలు మొదలైన వాటితో అనంతర లాక్షణికులు గానీ, ఈనాడు మనం గానీ అన్ని సందర్భాల్లోనూ ఏకీభవించలేకపోవచ్చు. ఎవరి యుక్తులు వారికి ఉండవచ్చు. అయినా ఆయన పరిశోధక విధానాన్ని కాదనలేం."** (తెలుగు పరిశోధన ఆత్మావలోకనం తెలుగు అకాడమీ తెలుగు ద్విదశాబ్ది ఉత్సవ సంచిక 1988)

తెలంగాణ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ సమీపంలోని కాకునూరు గ్రామవాస్తవ్యుడు అప్పకవి. ఈయన రాసిన గ్రంథం **అంధ్ర శబ్ద చింతామణి** (అవతారికలో, ఆశ్వాసాంత గద్యల్లో "అంధ్ర" అన్నాడే తప్ప "ఆంధ్ర" అనలేదు). ఇది సాహిత్యలోకంలో అప్పకవీయం పేరిట ప్రాచుర్యం పొందింది. అప్పకవి తన అప్పకవీయాన్ని ఎప్పుడు రాయడానికి మొదలు పెట్టాడు అన్న కాలం విషయంలో దొర్లిన చిన్న పొరపాటును సవరించడమే ఈ వ్యాస లక్ష్యం.

అప్పకవి తనకు కలిగిన కలను ఇలా ఒక సీస పద్యంలో పేర్కొన్నాడు.

ధాత రెండవ పరార్ధమున నాది దినంబు
పగటి వరాహకల్పంబునందు
మహిత వైవస్వత మనువేళ దేశంబు
లర్థింపనైన మహాయుగమునను
గలి సమయంబునను దొలి చరణంబున
మానితంబగు చాంద్రమానమునను
శాలివాహన నామ శకమున గజ శైల
శరసుధాకిరణుల సంఖ్యనడువ
అంగజాబ్దంబునను దక్షిణాయనమున
జలధరర్తువు మొదలి మాసంబునందు
బహుళమున దేవకికిఁ చక్రపాణి బుట్టి
నట్టి యష్టమి సనుదేర అధిక భక్తి

అని **అవతారికలోని 33వ పద్యం** కాల నిర్ణయానికి ప్రధాన ఆధారం

**శాలివాహన నామ శకమున గజ శైలశరసుధా కిరణుల సంఖ్య నడుప...** ఈ పాదం కీలకం. శాలివాహన శకం అన్నది విస్పష్టం. గజ = 8; శైల = 7; శర = 5; సుధాకిరణుడు (చంద్రుడు) 1 = 8751. **"అంకానాం వామతో గతిః"** అన్నసూత్రం ప్రకారంగా అంకెలను ఎడమ నుండి లెక్కించాలి. (ఎందుకో తెలియదు!) కనుక శాలివాహన శకం 1578 అవుతుంది. దీనికి

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఆగస్టు : 2023




78 సంవత్సరాలు కలుపుకుంటే క్రీస్తుశకం 1656 అవుతుంది. క్రీస్తుశకం 1656 శ్రావణ బహుళ అష్టమి దానికి సరి అయిన తేదీ 3- 8-1656 అని అందరూ అలవోకగా రాసుకుంటూ వెళ్లిపోయారు. రావూరి దొరస్వామి శర్మ, కోవెల సంపత్కుమార, ఆరుద్ర మొదలైన వారందరూ ఇలాగే పేర్కొన్నారు. వావిళ్ళ రామస్వామి శాస్త్రులు ప్రచురించిన ఏడు ముద్రణలలోను ఇలాగే ఉంది. 1934లో వచ్చిన కొమర్రాజు వెంకటలక్ష్మా రావు **"ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం"** రెండవ సంపుటం, పుటలు 125, 126 లో కూడా ఇలాగే ఉంది.

మా గురువుగారు శ్రీరంగాచార్యుల వారు తెలంగాణ సాహిత్య అకాడమీ తరపున 2019లో ప్రచురించిన అప్పకవీయం కూడా దీనినే అనుసరించింది. అయితే దీనిలో గిడుగు వారి ఉపోద్ఘాతం, కోవెల సంపత్కుమారాచార్య వ్యాసాలతో పాటు డాక్టర్ కండ్లకుంట సింగరాచార్యుల (ఆంధ్రజ్యోతి సంపాదకులు కే.శ్రీనివాస్ గారి తండ్రి) వ్యాసాన్ని అనుబంధంలో చేర్చి శ్రీ రంగాచార్యుల వారు మహోపకారం చేశారు. వెతికే శ్రమను తప్పించారు.

సింగరాచార్యుల వారికి అప్పకవి రచనాకాలం పట్ల సందేహం వచ్చింది. వారి వద్దనున్న పంచాంగాల ఆధారంగా లెక్కకట్టి 1656 మన్మథ సంవత్సరం కాదని, తేల్చారు. అప్పకవి అంగజాబ్దము అంటూ మన్మథనామ సంవత్సరాన్ని స్పష్టంగా చెప్పాడు, కనుక తప్పు చెప్పాడని అనలేం. లేఖకులు రాసినప్పుడు జరిగిన పొరపాటుగా దీన్ని భావించవచ్చు అంటూ శాలివాహన నామ శకమున **గజ శైలశరసుధా కిరణుల సంఖ్య నడువ-కు బదులు ..... గిరిశైల శరసుధాకిరణులు** అని సింగరాచార్యుల వారు సముచితంగా సవరించారు. దీనివల్ల 1577o78౯ 1655 మన్మథ నామ సంవత్సరం అవుతుంది. ఇన్నేళ్ల తర్వాత అప్పకవి పేర్కొన్న మన్మథకు సరియైన ఆంగ్లసంవత్సరాన్ని నిర్ధారించిన కండ్లకుంట అలహ సింగరాచార్యులవారిని అభినందిస్తూ వారు సూచించిన పాఠాంతరాన్ని సగౌరవంగా స్వీకరిద్దాం.

మన్మథకు సరియైన ఆంగ్ల సంవత్సరం1655 అని స్పష్టపడింది. 3 ఆగస్టు, శ్రావణ బహుళ అష్టమి అనే దాని విషయం పట్ల సింగరాచార్యులవారు అనుమానం వ్యక్తం చేస్తూ వారి వద్దనున్న 70 సంవత్సరాల పంచాంగాల్లో ఏనాడు ఆగస్టు 9 కంటె ముందు కృష్ణాష్టమి రాలేదని గమనించారు. కానీ సరియైన తేదీని నిర్ణయించడంలో వారు విఫలురయ్యారు. కనక 1655 మన్మథ కావచ్చు. అంతకుముందు మన్మథ (1595) కానీ, తర్వాతి మన్మథ (1715) కానీ కావచ్చు అన్న సందేహం కూడా తలెత్తుతుంది. దీనికి పరిష్కారం అప్పకవీయం అవతారికలోని 97వ పద్యం లో ఉంది. కృష్ణాష్టమి నాడు కల వచ్చింది. ఆ తరువాత రెండు రోజులకు గ్రంథ రచన మొదలు పెట్టాడు .

దశమీ సుర గురువాసర
శశితారా వజ్రయోగ షష్ఠకరణ యు
క్త శరాసన లగ్నంబున
శిశిర కరాంశమున మొదలు సేసితి కృతికిన్

అని చెప్పుకొన్న పద్యాన్నిబట్టి ఆరోజు దశమి అవుతుంది. సురగురువు- దేవతల గురువు బృహస్పతి. అంటె బేస్త (గురు)వారం అని స్పష్టం. మన్మథ శ్రావణ బహుళ దశమి గురువారం రచన నారంభించాడు. 1655 ఆగస్టు 3 కృష్ణాష్టమి తప్పని తేలింది. దశమి గురువారం అయింది కనుక మంగళవారం అష్టమి కావడం సహజం. కంప్యూటర్ సహాయంతో లెక్కిస్తే మన్మథ శ్రావణ బహుళ అష్టమి మంగళవారం 24-8-1655 అని తెలుతుంది (22- 8 -1715 మన్మథ శ్రావణ బహుళ అష్టమి గురువారం వస్తుంది. 24-8-1595 మన్మథ శ్రావణ బహుళాష్టమి సోమవారం వచ్చింది కనుక ఈ రెండు తప్పు. సరిపోవు)

కనుక కాకునూరు అప్పకవికి స్వప్నసాక్షాత్కారమైన తేదీ 24- 8 -1655 మంగళవారం అనీ, కృతి ప్రారంభమైన తేదీ 26- 8- 1655, గురువారం (ధనుర్లగ్నమన్నాడు కనుక మధ్యాహ్నం 2.15 నుంచి 4.15 మధ్య శ్రీకారం చుట్టాడు.) అనీ ఇక ముందు పుస్తకాల్లో దిద్దుకోవాలని సూచిస్తున్నాను.

బందారం కథలు 20

# జాయిజాదు

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148


డా. నందిని సిధారెడ్డి

"జానమ్మ గోజలొస్తున్నయి. జరుగండ్రి. జరుగండ్రి".

"ఏ పిలగా...చెప్తె ఇనొస్తలేదా... గంగావు పొడుస్తది. జరుగు...."

"ఓయ్... నీకు ఏరే జెప్పాన్నా... జరుగుమంటె మనసున పడ్తలేదా? కైలికోడె మీదికే వొస్తది... పొడిస్తె ఏగులెల్తయి. అసంతవో..."

భుజం మీద అడ్డంగా పెట్టుకున్న కట్టెను తీసి అటూ ఇటూ ఊపుకుంటూ వారిస్తూ ముందుకు నడుస్తున్నాడు చింతల బాలయ్య.

"గోజలు పొయినంక ఆట. మొన్ననే పొట్టియాదిగాన్ని పొడిసింది. గంగావును చూస్తెనే భయమైతది. ఆట గీట తర్వాత. "గోటీలన్నీ జేబులో పోసుకొని పరిగెత్తాడు రాజేశు."

జానమ్మ పెద్ద జీతం, షేరెదారు చింతల బాలయ్య. ఆమెకు నమ్మిన బంటు. చిన్న పటేలున్నప్పటినుంచే ఇవరువయ్యేండ్ల నుంచి అన్ని పనులు చూసుకుంటాడు. నెత్తికి రుమాలు, నడుముకు గోచి, ముతకబట్టతో కుట్టిన బనీను, రెట్టకు రావెండి కడెం. కాళ్లకు తోలు చెప్పులు. సాదాగా కనబడినా కొంచెం దర్పం కూడా ముఖం మీద తారాడుతుంది. చూపు చురుగ్గా ఉంటుంది. మాట కరుగ్గా ఉంటుంది. మనిషికీ, పనికీ వంకలేదు. బిరబిర నడుస్తూ పిల్లల్ని, ఆడవాళ్లనూ మందలిస్తున్నాడు. బాలయ్య ముందు నడుస్తుంటే కొంచెం దూరం నుంచి చంటిదూడను భుజం మీద ఎత్తుకొని వస్తున్నాడు మరో జీతగాడు. ఆ వెనుక అటూ ఇటూ బెదురుచూపులు చూస్తూ దబదబా అడుగేస్తుంది గంగావు. జానమ్మ ఆవునన్న దర్పమో, పెద్దమందకు పెబ్బెనన్న ధీమానో ఆవు నడకలో అగుపడుతున్నది. కొమ్ములు గుండ్రంగా ఒడిదిరిగి పదును దేరి ఉండటం వల్ల చూసేవాళ్లకు భయం కలుగుతుంది. జానమ్మ భూములు, జానమ్మ బాయిలు, జానమ్మ ఎవుసంపొలం, ముప్పయిమంది జీతగాళ్లు, నలబై నాగళ్లు, నూరుగోజలు, ఊర్లె జానమ్మ ఖదర్ వేరు.

గంగావు వెనకాల మరి ఐదు ఆవులు... ఐదారు లేగదూడలు... అంబా అని అరుస్తూ నడుస్తున్నాయి. ఒక లేగ అడ్డం దిగిరి సయ్యాటలాడుతున్నది. అటు వెనుక పది కోడెలు, ముప్పయి ముదురుటెడ్లు, మరికొద్ది దూరం నుంచి పది బర్లు, పది దున్నపోతులు – ఎనపకులం ఒకదానికొకటి రాసుకుంటూ, తోసుకుంటూ వస్తున్నాయి. పశువుల గుంపుకు అటుపక్క ఒకరు, ఇటుపక్క ఒకరు, వెనక నలుగురు అదమాయిస్తూ నడుస్తున్నారు. గిట్టల చప్పుడు లయబద్ధంగా వినబడుతుంటే దుమ్ము ఆకాశంలోకి లేస్తున్నది. గోజలు పొయ్యేదాకా తోవ విడిచి ఎక్కడివాళ్లక్కడ ఆగి చూస్తున్నారు.

గోజలు వెళ్ళిపోగానే కళ్లముందట దుమ్ము చేత్తో తోలుకుంటూ పిల్లలు మళ్లా ఆట మొదలుపెట్టారు. జానమ్మ దొడ్డి చేరుకునేదాకా బాలయ్య తోవలో మందలిస్తూనే ఉన్నాడు. పొరపాటున ఏది ఎవరిని పొడిచినా తనకే వస్తుంది. గనుక జాగ్రత్త తీసుకుంటాడు. పశువుల్ని దొడ్లో తోలి సనగడ పెట్టి, పాలిచ్చే ఆవుల్ని, బర్లను వేరే కట్టేసి జీతగాళ్లు వెళ్ళిపోయారు.

పనులన్నీ సరిచూసుకొని బాలయ్య పెద్దర్వాజలకు రాగానే జానమ్మ మందలించింది. బాయిదగ్గర, దొడ్డిదగ్గర పనుల గురించి వరుసగా వాకబు చేసింది. దర్వాజలో నిలబడే అన్నివైపులా చూసుకున్నది. బాలయ్య మీద నిండైన నమ్మకం. అయినా ఆమె నిగురాని ఆమెది. పటేలమ్మతో మాట్లాడుతూనే లేగలకు సదురుతున్నాడు బాలయ్య. తెల్లవారి పనులు కూడా పురమాయించిందామె. సాదా నేతచీర, సాదా రవికెలో అయినా పెద్దపెయి మనిషి కావటం వల్ల భారీతనం ఉట్టిపడుతుంది.

దిడ్డి దర్వాజలోంచి ఇంటెనుకకు నడిచాడు బాలయ్య. పెద్ద వాకిలి. ఇంటిముందటి వాకిలి కంటే పెద్ద వాకిలి. మూడు దిక్కులా చెట్లు. దానన్నపూలు ఎర్రగాపూసి గుత్తులు గుప్పుమంటున్నాయి. దాటి ఎడమ పక్కకు నడిచాడు. చేదబాయి. గంగాళంలో, గుండీల్లో, గోలెంలో నీళ్లు నింపాడు నిమ్మళంగా కాళ్లు చేతులు కడుక్కున్నాడు.

చెప్పి పోదామని మల్లెశాలలోకి వచ్చాడు బాలయ్య. జానకమ్మ కూర్చునే చేతులకుర్చీ బోసిగా, ఖాళీగా ఉన్నది. పక్కన చిన్న పటేలు ఆరాంకుర్చీ, పటేలు చనిపోయినప్పటినుంచీ ఎప్పుడూ ఆ కుర్చీ ఖాళీగా చిన్నబోయి ఉంటుంది. అట్లా చూస్తూ, చూస్తూ వెళితే బనుకుల్లో కనిపించిందామె. అక్కడో చేతుల కుర్చీలో కూచుని ఉన్నది. అటొకరు, ఇటొకరు పనివాళ్లు నక్కి ఉన్నారు.

"అమ్మా... నేను పోతున్న..."

"అటు... గన్నేరు చెట్టు కాడ కల్లు చింకి ఉన్నది తీసుకో."

"అమ్మ... తమరు..."

"నేను తీసుకున్న... నువ్వు కానీ...."

బాలయ్య దూరంగా జరిగి గ్లాసులోకి కల్లు వంచి ఇవ్వబోయాడు.

"తీసుకున్న అన్న గదా..." కొంచెం గట్టిగా అనగానే గన్నేరు చెట్టు చాటుకు వెళ్ళి గుటగుట తాగాడు. మరో గ్లాసు తాగి రాయిమీద కూచున్నాడు.

"బాలయ్యా.... ఎట్ల చేద్దామంటవు?"

ఏమీ అర్థం కాలేదతనికి. "ఏదమ్మ"

"పోంగ... పోంగ... ఇద్దరు ఆడపిల్లల పెండ్లిలున్నయి. కొంచెం అటూ ఇటుగ కుదిరెటట్టున్నయి. జాగ అమ్మకుంటె నడిసెటట్టు లేదు..."

"అవుసరం మందం అమ్ముదామమ్మ..."

"అమ్ముదామని మనమనుకోంగనే సుత నడిసెటట్టు లేదు. ముగ్గురు అల్లుండ్లు ఒకటయిండ్రు. జాగ అమ్మనియ్యమంటండ్రు".

"అదేంది... మన జాగ...."

"అది నిజమే. జాగ మనదే. వాళ్ల పెండ్లిలప్పుడు కట్నం తక్కువైందట. మొగపిల్లల్లేరు గనుక జాగ మనిషింత వస్తదని వాళ్ల లెక్క. ఇప్పుడు కొత్త అల్లుండ్లెమొ జాగవద్దు అమ్మి పైసల్ ఇయ్యమంటండ్రు. పాతొల్లెమొ అమ్మనియ్యమంటండ్రు. ఎట్ల సముదాయించాన్నో తోస్తలేదు".

జానమ్మ ముఖంలో విచారం చూడక చాలా రోజులయ్యింది. ఎంత కష్ట సమయమైనా నిండుగా ఉండే మనిషి. ధీమాగా ఉండే మనిషి. ఏ చీకట్లనయినా ధైర్యంగా నడిచే మనిషి. ఇగురంతో దిద్దే మనిషి. విచారం చూడలేకపోయాడు బాలయ్య.

'చిన్న పటేలు జమానాల ఎట్ల నడిసిందో జానమ్మ జమాన గూడా అంత జోర్దారు నడిసింది. ఎక్కడ ఎనకకు పోలె. మొగోల్లతోనైనా సై అంటే సై. పాలోల్లు తక్కువ సతయించిండ్రా. పాలోల్లను మించి నడిపిచ్చింది సంసారం. యవారంల నాల్గూళ్లకు పేరెల్లాంది జానమ్మ"

జానమ్మ దిక్కు చూశాడు. నెత్తికి చేతులు పెట్టుకుని ఆలోచిస్తున్నది. 'జానమ్మకు రంధా. ఆ తల్లికి ఇబ్బందా. ఎసోటోల్లకయినా దేవుడు ఇసోంటి రాతెందుకు రాస్తడో. ఇన్ని కష్టాలు గెల్సినామెకు ఈ చిక్కో లెక్కనా..."

"బాలయ్యా. అంటారనుకుంటరు గని – జాయిజాదు జూసిరాలే చిన్నపటేలు జీవితంలకు. కాందాన్ జూసి వొచ్చిన... అయినా నాకేం కాందాన్! బాపు మాటది. మా బాపు జూసింది కాందాన్. చిన్నదాన్ని. నాకేం దెల్సు. మొదటి పెండ్లా... రెండో పెండ్లా... దానికీ దీనికి ఏం పరక్ తెలిసే వయసే గాదు. బాపు మీద నమ్మకం. అన్ని జూసే ఆయనిస్తడని నమ్మకం. రెండు వందలెకురాలా, మూడువందలా? నాకా సోయిలేని వయసు. లెక్కలేసే తెలివున్న కాలం కూడా కాదు. ఈ సంసారంల కొచ్చేసరికి అంత సీకటి. చిమ్మంజీకటి. పెద్దభార్య పోయిన దు:ఖంల పటేలు.... లంకంత ఇల్లు... ఒక్క ఇసిరె ఒక్క తీర్గ లేదు. పాలోల్ల లొల్లి పాలోల్లది. గట్లు జరుపుడు, కాట్లు జరుపుడు, జీతగాళ్లకు నేరుపుడు... వొస్తి.. జూస్తి... మెల్ల మెల్లగ చిన్న పటేలును దారికి తెస్తి. ఎవుసందారికి తెస్తి. పాలోల్లను తొవ్వకు తెస్తి. పాలేర్లను తొవ్వకు దెస్తి. పెద్దభార్య బిడ్డ పెండ్లి జేస్తి... నాకన్న మొగపిల్లలు గావొద్దా... వారసుడు గావాల్నంటె వరుసగ ఆడపిల్లలు. ఐదుగురు ఆడపిల్లలేనాయె. ... పెంచి పెద్దజేసుడు, పెండ్లి జేసుడు... చిన్నపనా... చిన్న కథనా... ఇద్దరిపెండ్లిలు జేసెసరికి చిన్నపటేలు పాయె... పటేలుకెన్ని జేసిన... ఎన్ని దిక్కుల దీస్కపోతి. నాకు దిక్కు లేకుంట జేసి ఆయెనె పాయె... ఆయెనె మానాన ఆయ్నెపాయె". భర్తను గుర్తు జేసుకునేసరికి జానకమ్మకు కండ్లల్లో నీళ్లు దుంకినయి. మాట సాగలేదు. కొంగు అడ్డం బెట్టుకుంది. ఇతరుల ముందు కండ్ల నీళ్లు పెట్టుకునే కాందాన్ కాదాయె. చెప్పుకోవద్దు. ఏడువొద్దు. తుడువొద్దు. పాలొల్ల ముందట నల్లమొఖం కావొద్దు. కింది కులాల లెక్క బజారుకెక్కొద్దు. అయినా బుద్ధులెటువోతయి. పెద్దకులమనం గానే పెద్ద బుద్ధులుంటయా... బాలయ్యా, నీకు తెల్సుగద. చూసినవు గద. యాదికున్నదా. పటేలు పొయ్యి నేను దు:ఖంలుంటి. పాలొల్లు ఊకున్నరా. ఉదారంగున్నరా".

చిన్నపటేలు చావుకు ఊరంతా వచ్చారు. కక్క ఊర్లనుంచీ వచ్చారు. శవం తలాపున దీపం వెలుగుతూనే ఉంది. కొంచెం పక్కన కట్టెలు మండుతున్నాయి. కుండలో అన్నం ఉడుకుతుంది. డప్పులు వచ్చాయి. పాడె తయారవుతున్నది. అప్పుడు మొదలుపెట్టారు అసలు సమస్య అయిదుగురు – పెద్దామెతో ఆరుగురు. ఆరుగురు ఆడవాళ్లేనాయె. కొడుకులు లేరుగదా – నిప్పు ఎవరు పెట్టాలి? బిడ్డలు పెట్టొద్దు. ఊరిపెద్దలు, పాలివాళ్లు మాట్లాకున్నారు. నిర్ణయానికి వచ్చారు. చిన్నపటేలు అన్న పెద్దకొడుకు మాధవరెడ్డి. కుండ పట్టాలి. నిప్పు పెట్టాలి. ప్రతిఫలం సంగతి తర్వాత మాట్లాడుకోవచ్చునని నిర్ణయమైంది. వెళ్ళి జానమ్మకు వివరించారు. దు:ఖంలో జానమ్మ ఏమీ అనలేదు.

దప్పులు మోగాయి. పాడె లేచింది. కాదు చుట్టూ కావలసినవాళు తిరిగారు. జానమ్మ తిరిగింది. కూతుళ్లు తిరిగారు. అన్నకొడుకు నిప్పు పెట్టాడు. రోజులు గడుస్తాయి గదా – దినాలు అయిపోయినాయి.

అసలు పంచాయతి అప్పుడు మొదలయింది. నిప్పు పట్టినందుకు సగపాలు భూమి ఇవ్వాలని వాళ్లు... ఇవ్వనని జానమ్మ, ఆమె

బంధువులు ముదిరి ముదిరి తెగని పంచాయితి ముందు పడింది. అప్పుడు బాలయ్యను విచారించింది. అప్పటినుంచే జీతగాడయినా, షేరెదారయినా బాలయ్య పట్ల జానమ్మకు గురి కుదిరింది.

**"గుర్తున్నదా బాలయ్య, నువ్వు చెప్పినంకనే పెద్ద మనుషులకు ఫిర్యాదయిన. చిన్న పటేలు రెండు వందల ఎకరాలకు పట్టెదారు. నిప్పు పెట్టినందుకు సగపాలంటే వంద ఎకరాలకు పెట్టింగ్రు ఎసరు. ఎంత సతాయించిండ్రు. ఎంత ఏడిపిచ్చింగ్రు. ఇటు జేస్తె ఇజ్జత్ గల్ల కాందాన్, అటు జూస్తె అగాధం ఆశ. జాయిజాదు కాడికొస్తె కాందాన్ లేదు, గీందాన్ లేదు. ఆడదాని మీద అద్దరిమి. అల్కగ సంపాయించాలె. వాళ్లది తక్కువ జాయిజాదా. తక్కువ పాలా. వచ్చింది బోగమోల్లకు పెట్టిరి. తాగిరి, తినిరి. ఆడిరి. అనుభవించిరి. ఇగురంతోని నేను కాపాడితె ఓర్వకపోయిరి. ఏదో... పెద్దమనుషులు మంచోళ్లవుట్ల... తమ్ముడు బాల సిద్ధయ్య గట్టిగ నిలబడుట్ల పదెకురాలతోని ఒడిసిపోయింది. పాలోళ్లంటె పాలోళ్లు. అక్కరల ఆదుకోవాలె గని, ఆడిదాన్నని ఆడుకునిరి...."**

గొంతు జీరవోయింది. మెల్లగా సరాయించుకున్నది. "ఇప్పుడు మల్ల తిప్పలొచ్చె. పాలొల్లతోని వేగుడు వేరు. అల్లుండ్లతోని వేగుడు వేరు. అట్ల కొట్లాడరాదు. ఇట్ల బుదగరియ్యరాదు. నిన్నట్నుంచి మనసున వడుతలేదు. నిద్ర వడుతలేదు..."

"అమ్మా ఏమనుకోనంటె ఓ మాటంట. అప్పుడైనా, ఇప్పుడైనా గదే మాట. ఊర్లె ఎవలకయినా అక్కెరకొచ్చే మనిషి బాలిరెడ్డే. ఆ పటేల్తోని యిశారిస్తె మంచిగుంటది. తొవ్వ దొరుకుతది..."

"మల్ల తమ్ముని మీదనే ఇరగవడ్తామా... కాని తియ్యి". కొద్దిసేపటి తర్వాత బాలయ్య లేచాడు. కట్టె ఆడిస్తూ చీకట్లో నడిచాడు.

చాలారోజుల తర్వాత బాలమ్మ దేవతకు పండుగ చేయటానికి నిశ్చయించింది జానమ్మ. మరుసటి రోజే పుట్టింటినుండి తమ్ముడిని రప్పించింది. పెద్ద వ్యవసాయం గనుక తనకు తోడుగా బందారంలోనే ఉండిపోవటానికి ఒప్పించింది. తన జాయిజాద్, జాగ భూమి పంపకాల సమయంలో తన భాగంలోనుంచి తమ్ముడికి పది ఎకరాల భూమి ఇస్తానని మాట ఇచ్చింది. బాలమ్మ పండుగకు బంధువులకు వర్తమానం పంపింది. కూతుర్లను, అల్లుండ్లను తోలుకరావటానికి ఏర్పాట్లు చేసింది. మొదటి సంబంధం పెద్దకూతురు దగ్గరికి సవారి కచ్చడం తోలించింది. అట్లా మూడూర్లకు కచ్చరం పంపించి ముగ్గురు కూతుర్లను రప్పించింది. ముందురోజు సాయంత్రానికే అల్లుండ్లు చేరుకున్నారు. తాగినంత కల్లు తెప్పించింది. మూడు రోజుల వేడుక. ముందురోజే అల్లుండ్లు ఖుషీ అయినారు. రెండోరోజు బాలమ్మ పండుగ. మబ్బులు చీకటి తెరలు విడువకముందే హడావుడి మొదలైంది. కుమ్మరతను పసుపు బొట్లతో బాలమ్మగూడు పుదించాడు. కూతుళ్లు వరుసగా సాక పోశారు. ఇంటి చాకలి కుటుంబం బంధువులు దవ్వుతుంటే గొర్రెపొట్టేలు జడతిచ్చింది. కత్తిగాటుతో తెగిన మెడనుంచి చిందిన రక్తాన్ని వాకిట్లో గోతిలో పట్టారు. తల, కాళ్లు వేసి కుందెన బోర్లించారు. గంటల్లో మాంసం ముక్కలు కోసి పెట్టారు చాకలి పెద్దా చిన్నా కలిసి. జరుగుతున్న వైభవానికి బాలమ్మ దేవత సంతోషపడింది.

మధ్యాహ్నం పూరీలు, మాంసం, కల్లు. అది బాలమ్మకు జరుగుతున్న వేడుకా, అల్లుండ్లకు జరుగుతున్న వేడుకా తెలియనంత జోరుగా సాగుతున్నది. పనివాళ్లు, జీతగాళ్లు, కల్లు, గుడాలు, మాంసంతో ముచ్చటాడుతున్నారు.

తమ్ముడొక మూలన, బాలయ్య ఒక మూలన అవసరాలు చూస్తున్నారు. మాటల మధ్య మాటలు కలుపుతూ ఇంటి అల్లుండ్లకు కల్లు వంచి ఇస్తున్నారు. నులకమంచాలు, నవారు మంచాలు, పెద్దపీట చిన్న చప్పుడు చేస్తున్నాయి. ఎదురు కుర్చీలో కూర్చున్న జానమ్మ వాళ్ల చర్చలకు అడ్డు వచ్చింది.

"అల్లుండ్లూ, బిడ్డలూ అందరూ వినుండ్రి. ఇంత పెద్ద ఇంటికి పద్దా, జాయిదాదు మీదికి వచ్చినా నేను మురువలే. ఏనాడూ నా పని మరువలే. పాలోల్లు యెంట పడ్డా, పటేలు మంచానపడ్డా యెనుకకుపోలే. ఇల్లు నిలవెట్టాలె. సంసారం నిలవెట్టాలె. జాయిదాద్, కాందాన్ నిలవెట్టాలె. వాటికోసమే తండ్లాడిన. ఇంత సిరి ఉన్నా నచ్చిన నగ వెట్టలే. మెచ్చిన శీర గట్టలే. తాగొచ్చు, తినొచ్చు, యేరే దిక్కు సూడలే. మీరే నా సంతోషమనుకున్న. మీ సుఖమే నా సుఖమనుకున్న. అల్లుండ్లంటె ఎవలు? నా దేవుండ్లనుకున్న. బిడ్డలు నా కడుపుల పుట్టొచ్చుగని, అల్లుండ్లే కొడుకులనుకున్న. పానమయినా, పాయిరమైనా అల్లుండ్లే. బిడ్డలే. మీరే నా బలగం. మీరే నా బలం. కూడవెట్టినా, కాపాడినా ఆస్తి నేనేం జేసుకుంట. మీకే గద. పంచుత. ఇయ్యాల గాకపోతే రేపు. పాడెమీద పెట్టుకోని పోతనా... ఆ యింత ఇద్దరి బిడ్డల పెండ్లిల్లు గానియ్యండ్రి. మీరే దగ్గరుండి చెయ్యిండ్రి. చేతులెత్తి మొక్కుతున్న. దండం పెడత. రెండు పెండ్లిల్లకు పైసలు గావాలె. అమ్మొద్దంటుండ్రు గద. జాగ అమ్మ. మకురం పట్టిందా అమ్మెతెందుకు? జాగ అమ్మ. తలా పదివేలు నలుగురు నాలుగు పదివేలు సదురుండ్రి. గంతే జాగ అమ్మనే అమ్మ. బరువు దించిండ్రని మీకే మొక్కుత...."

గంభీరంగా మాట్లాడి ఆపేసింది. జానమ్మ. వాతావరణం ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది. ఎక్కడివాళ్లక్కడ మౌనంగా ఉండిపోయారు. ఎవరి నోటా మాట రాలేదు. ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటున్నారు. బిడ్డలు భర్తలవైపు తీక్షణంగా చూస్తున్నారు. తోచిన పద్ధతిలో కనుసైగలు చేస్తున్నారు.

జానమ్మ పెద్దల్లుడు నోరు తెరిచాడు. మాట మత్తుగా ఉంది. "అత్తల్లా. ఏ అల్లుడూ పదివేలు మొయ్యడు. మోస్తాన్నా నీ బిడ్డలు

ఊకోరు. మేమెవలము అడ్డం రాము. మేం కొడుకులమైనా జాగ అమ్మి చెయ్యాల్సిందే గద పెండ్లిలు. బాజాప్త అమ్ము. బ్రమ్మాండంగా చెయ్యి. మాకిచ్చేటియి, నీ బిడ్డల కిచ్చేటియి బ్రమ్మాండంగ పెట్టు. ఈ బిడ్డల లెక్క ఆ ఇద్దరు బిడ్డల్ని కనలేదా? ఆడబిడ్డల్ని ఇంటిమీద ఉంచుకుంటరా. నీ అల్లుండ్లు దశమగ్రహాలు కాదు. నువ్వన్నట్టు దేవుండ్లే. ఎవలూ అడ్డు రారు. పెండ్లిలు చెయ్యి అత్తల్ల"

టీచరల్లుడి మాటలకు మిగతా ఇద్దరూ తలలూపక తప్పలేదు. రెండు చేతులు జోడించి లేచింది జానమ్మ. కనుసైగలతోనే భోజనాలు సిద్ధం చేశారు పనివాళ్లు. బాలమ్మ మురిసింది. బంధువులు మురిశారు. ఇల్లు మురిసింది. కొద్దిరోజుల తర్వాత నెల తేడాతో రెండు పెండ్లిండ్లు వైభవంగా జరిగాయి. కొత్త అలంకారాలు, కొత్త సందళ్లు, కొత్త అల్లుండ్లతో ఆ ఇల్లు శోభించింది. నలుగురు అల్లుండ్లకు తోడు ఇద్దరు. ఆరుగురు అల్లుండ్లు.

దసరా తర్వాత దీపావళి. కొత్తా పాతా, ముచ్చట్లు హుషారు, చూస్తుండగానే మూడేండ్లు గడిచి పోయాయి. ముచ్చట్లు పాతబడి పోయాయి. ఇప్పుడు ఆరుగురు అల్లుండ్లు ఒకటయ్యారు. ఆరుగురిదీ ఒకటే మాట 'ఎవరి జాగ వాళ్లకు పాలు ప్రకారం పంచియ్యాల్సిందే'.

అందరికీ సమానంగా పంచిస్తానన్నది జానమ్మ. తనకూ, తన తమ్మునికీ చెరొక పాలు. ఎనిమిది పాళ్లు చేసి పంచుతానంటే ఒప్పుకోలేదు అల్లుండ్లు.

మొదటి సంబంధం అల్లుడికి సగం పాలు రావాలని అతడు, పెళ్ళి చేసేటప్పుడు కట్నం కిందికి జాగ ఇస్తామని ఒప్పించారు గనక అది అదనంగా కలిపి పంచాలని మూడో అల్లుడు, పెళ్ళి సమయానికే జాగ అమ్మారు గనుక ఆ భాగం తీసేసి చిన్నల్లుండ్లకు పంచాలని పెద్దల్లుండ్లు, ఎవరికి తోచినట్టు వాళ్ళు మాట్లాడుతూ తమకనుకూలంగా పంచాయితీ సాగదీశారు. పంపకాలు సాగలేదు.

జానమ్మ అల్లుండ్ల పంచాయతి క్రమక్రమంగా ఊరూరా పేరెల్లింది. ఎవరి న్యాయం వారు బందారం వూళ్లో తలా ఓ పాటా మొదలుపెట్టారు.

జానమ్మ ముఖంలో మళ్లా విచారం గూడు కట్టుకున్నది. మునుపటంత హుందాగా అడుగులు వేయలేకపోతున్నది జానమ్మ. చెప్పులు కాళ్ళకు భారంగా తోస్తున్నాయి. జానమ్మ తలమీద ఎప్పటిలా గొడుగు పట్టలేకపోతున్నాడు బాలయ్య. ఆమె వెనుక నడుస్తూ గొడుగు పడితే బాలయ్య చేతులకు గొడుగు బరువుగా తోస్తున్నాది. ఎండకు మరింత ఆయాసం, చెమట. అయినా అరుగు మెట్లెక్కుతున్నది. ఎప్పుడు విచారం ఎదురైనా ఆమె ఆ మెట్లే ఎక్కింది.

"తమ్మీ.... ఉన్నావాయ్య...." మాటలో ఆయాసం తెలుస్తున్నది. ఎదురొచ్చి పట్టుకొని చేతుల కుర్చీలో కూర్చోబెట్టాడు బాలిరెడ్డి.

"అక్కల్ల.. రమ్మంటె నేను రానా... అవస్త పడుకుంట ఇంత దూరమెందుకు వచ్చుడు..."

"జీవి పొయ్యేదాక తప్పుతదా... ఎట్ల చేతాం, అల్లుండ్ల పంచాయితి" వివరంగా చెప్పింది జానమ్మ. నడుమ నడుమ బాలయ్య చేర్పు.

"ఎవరనేదేమున్నది అక్కల్ల. నీ మాటే సై. నువ్వు నిర్ణయించి పంపకాలు చెయ్యి" జానమ్మ జంకలేదు. పెద్దమనుషుల వంక పెట్టలేదు. పంచాయితీ తీర్పు చెప్పింది. జాగ యజమానురాలు ఆమే. ఆమె మాటే చెల్లు. గొంతెమ్మ కోర్కెలు చెల్లలేదు. 'అల్లుండ్లందరు సమానమే. పంపకాలు సమానమే. ముసలితంలో ఆమెకు ఆధారం ఉండాలె. బిడ్డలు, అల్లుండ్లు, చుట్టాలు, వొచ్చెటోల్లు, పొయ్యేటోల్లు... ఆమె పాలు ఆమెదే".

జాగలు పంచింది. ఇసిరెలు పంచింది. పశువులు పంచింది. గంగావు ఎవరికి? ఆవు జానమ్మను చూసింది. జానమ్మ ఆవును చూసింది. బాలయ్యను చూసింది. ఇద్దర్నీ బాలయ్య చూశాడు. ఆవూ బాలయ్య జానమ్మతోనే. జానమ్మ ఏదనుకున్నదో అదే చేస్తుంది. సాధించాలనుకున్నది సాధిస్తది. పశువులైనా, పాలోల్లయినా అల్లుల్లయినా, జానమ్మ నడిపించుకున్నది. జానమ్మది జాగ లెక్క కాదు. పరువు లెక్క.






# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

ISSN 2457-0796                                                                 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక   సంపుటి -26 : సంచిక - 10   (17)   హైదరాబాద్   ఆగస్టు : 2023

# మధుర బంజారాల నృత్య సౌందర్యం

**డా. మంత్రి శ్రీనివాస్** ఫోన్ : 83283 33720

భరతావని కన్న ఇరవై తొమ్మిది రాష్ట్రాలనబడే బిడ్డల్లో అందరికంటే చిన్నది, విస్తీర్ణంలో చాలా రాష్ట్రాల కంటే పెద్దది, భిన్నమైన సంస్కృతులు కలది తెలంగాణ రాష్ట్రం. ప్రకృతి రమణీయతకు, పచ్చని వనాలకు పెట్టింది పేరుగా నిలుస్తూ, అనేక ఆదిమ, గిరిజన తెగలకు ఆలవాలమైంది తెలంగాణ. గిరిజన తెగల్లో అత్యంత అరుదైనది మధుర బంజారా తెగ. ఆధునికతకు దూరంగా అడవుల్లో మనుగడ సాగిస్తూ తమదైన ఉనికిని నిలుపుకుంటున్నారు మధుర బంజారాలు. వికసించిన పూలవంటి ముఖ వర్చస్సుతో అందమైన వస్త్రాభూషణాలతో తమదైన సాంస్కృతిక వాతావరణాన్ని కలిగి ఉంటారు మధురా లభాన్‌లు. దేశవ్యాప్తంగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలలో వీరు కనిపిస్తారు. వీరు తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలలో, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో తండాలు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు.

రాజస్థాన్ రాష్ట్రం అనేక సంస్కృతులకు పుట్టినిల్లు. రాజపుత్రుల వీరత్వానికి, కట్టడాలకు, నృత్యాలకు పెట్టింది పేరు రాజస్థాన్. రాజపుత్ర రాజుల వీరత్వం, యుద్ధ నిపుణత అక్కడి ప్రజలను దృఢంగా చేసింది. ఎందరో పర రాజులను దేశంలో అడుగు పెట్టనివ్వకుండా చేసింది. దురదృష్టవశాత్తు రాజపుత్ర రాజ్యాల అనైక్యత వల్ల తుదకు పరాయి రాజులు దేశాన్ని భాగాలు భాగాలుగా ఆక్రమించుకోవడానికి ఆస్కారాన్ని కలిగించింది. తురుష్కులు, అరబ్బులు, మొగలులు వీరి ప్రాంతాల్ని ఆక్రమించారు. రాజపుత్ర ప్రజలు తమ ఉనికిని కాపాడే ప్రయత్నంలో దేశవ్యాప్తంగా తరలివెళ్లి పోయారు. దక్షిణ దిశగా వెళ్లి అడవుల్లో తలదాచుకున్న వారు గోర్ బంజారాలు అయితే ఉత్తరదిశగా వెళ్తూ తుదకు బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రాంతాలు, మధురకు దగ్గరగా ఉన్న అడవుల్లో తండాలు ఏర్పాటు చేసుకుని, పశుపోషణ చేసుకుంటూ జీవనం సాగించారు కొంతమంది.

మధుర వైపు వచ్చిన రాజస్థానీ తెగను మధుర బంజారాలుగా పిలుస్తున్నారు. మధుర బంజారాలు తమ జీవనాన్ని కొనసాగించడానికి ఎల్లప్పుడూ ముందు ప్రాంతాలకు తరలి పోతుంటారు. పశువుల మేత కోసం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర దాటి ఆదిలాబాద్ పరిసరాల గుండా సంగారెడ్డి, నిజామాబాద్ ప్రాంతాల వరకు వలస వచ్చి ఇక్కడి ప్రాంతాల్లోనే వీరు తమ తండాలను నిర్మించుకున్నారు.

మధుర బంజారాలు తమ సంస్కృతిని ప్రతిబింబిస్తూ, అనేక పండుగలు చేసుకుంటారు. తొలి ఏకాదశి, నాగుల పంచమి, తీజ్, హోలీ, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలను అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారు. ఆ పండుగల నిర్వహణలో భాగంగా




ఆనందంతో ఆడి పాడుతారు. అలా వీరికంటూ ఒక ప్రత్యేకమైన నృత్యశైలి ఏర్పడింది. తమ దేవతల, తమ నాయకుల వైభవాన్ని పాటల రూపంలో పాడుతుండగా నంగారా శబ్దానికి అనుగుణంగా స్త్రీలు నృత్యం చేస్తారు. పురుషులకు సహితం ప్రత్యేకమైన నృత్యరీతి ఉండడం మధుర బంజారా నృత్య విలక్షణత.

మధుర బంజారాల నృత్యం ఆవిర్భావాన్ని పరిశీలిస్తే రాజస్థాన్ రాష్ట్రంలోని జిప్సి తెగల నృత్యానికి దగ్గరగా వీరు చేసే నృత్యం కనిపిస్తుంది. రాజస్థాన్‌లో చేసే చిర్మి నృత్యంలో మధుర బంజారాల నృత్యపు ఆనవాళ్లు కనిపిస్తాయి. కాల్‌బేలియాల నృత్యంలో గిర్రున తిరిగే సంప్రదాయం, చేతులు పైకెత్తి కాల్‌బేలియాలలో చూస్తాం. కాబట్టి మధుర బంజారాల నృత్య శైలి రాజస్థాన్ సాంప్రదాయ నృత్య రీతుల్లోంచి పుట్టిందిగా చెప్పుకోవచ్చు.

**మధుర బంజారాల నృత్యం, ప్రత్యేకతలు :**

శ్రీకృష్ణుని జన్మస్థానం అయిన మధుర ప్రాంతం నుండి పశువులను మేపుకుంటూ అడవులు, వాగులు, వంకలు దాటి ఆదిలాబాద్ పరిసర ప్రాంతాలకు వచ్చిన మధుర లభాన్‌లు ఇక్కడే ఉండిపోయారు. ఇక్కడి నుండి నిజామాబాద్, సంగారెడ్డి, కర్ణాటక ప్రాంతాలకు తరలి వెళ్లారు. మధుర ప్రాంతాలలో నివాసము ఉన్నారు కనుక అక్కడి వాతావరణానికి, అక్కడి సంస్కృతి సంప్రదాయాలకు అలవాటు పడడమే కాకుండా, అక్కడి నృత్యరీతుల్ని కూడా తమలో కలుపుకున్నారు. మధుర బంజారాల నృత్యం కూడా శ్రీకృష్ణుడు, గోపికలు చేసిన నృత్యం వలెనే ఉంటుంది. శ్రీ కృష్ణుడు గోపికలతో కలిసి పాడేటటువంటి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. కావున ఈ నృత్యాన్ని మధుర నృత్యం లేదా మాధురి నృత్యం అంటారు. వీరి నృత్యానికి వాద్య సహకారాన్ని నంగారాతో అందిస్తారు. వీరి నృత్యంలో పద్దెనిమిది మంది బృందంగా ఉన్న నర్తకులు, ఇద్దరు వాద్యకారులు ఉంటారు.



నాట్యం చేసేటప్పుడు వస్త్రధారణ అత్యంత ప్రముఖమైన పాత్రను పోషిస్తుంది. పురుషులు పంచె, పొడుగాటి చొక్కా, చొక్కాపైన ఊలు దారాలతో అల్లిన కోటులాంటిది వేసుకుంటారు. ఆ కోటుకు ఊలు బంతులు వేలాడదీసి ఉంటాయి. పురుషులు ఒక చేతిలో రుమాలును, మరొక చేతిలో కర్రను ధరించి, గుండ్రంగా తిరుగుతూ నంగారా శబ్దానికి అనుగుణంగా పాదాలు కదుపుతూ నృత్యం చేస్తారు. పద్దెనిమిది మందిని నృత్యం చేయిస్తున్న ప్రధాన కళాకారుడు రెండు చేతుల్లో ఝుంఝుంనాలు అనబడే వాద్యాలు ధరించి ఉంటాడు. ఝుంఝుం నాలు (గజ్జెలు) వాయిస్తూ నృత్య నిర్వహణ బాధ్యతలు చూస్తాడు.

స్త్రీల విషయానికొస్తే నుదుటిపై టికి అనే పాపిట బిళ్ళ, ముక్కుకు నపోలి అనే ముక్కు పుడక, చెవులకు వేలాడే బిట్, కేట్లో అనే గుండ్రటి రింగులు, మెడలో పసుపు పూసల దండల సమాహారాన్ని ఒకేచోట గుండు పూసలతో కలుపుతూ ఉండే నమోలి, అందమైన ఎరుపు, నలుపు రంగుల పూసలతో అల్లిన కపూర్, పావువాలాలను ధరిస్తారు. చేతులకు గోట్‌లనబడే గాజులు, మోచేతి వరకుండే గజరాలనబడే ఉలన్ బంతులను, పెద్ద పెద్ద పూసలు కలిగిన దండ కడియాలు, నడుముకు కాంచులి, కాళ్ళకు చూడా, లాక్‌నలబడే ఇత్తడి, వెండి, వంకీలాంటి కడియాలు, కాలివేళ్ళకు బిచియా, చుట్కి, గుట్టి వంటి ఉంగరాల ఆభరణాలు కలిగి ఉంటారు. స్త్రీలు అందమైన, రంగురంగుల చీరలు ధరించి వెలుగుతున్న చంద్రబింబంలా ఉంటారు. తలపై ప్రత్యేకమైన ఆకర్షణగా చుండై అనే నిలువెత్తు జడ అల్లిక నిలుస్తుంది. రాలిపోయిన వెంట్రుకల్ని జమచేసి ఒక గుత్తిలా నిలువుగా పేర్చి బట్టలో చుట్టి దానిని వెంట్రుకలతో జోడిస్తూ లేదా జడతో అనుసంధానిస్తూ, చుండైను నిర్మిస్తారు. చుండై చుట్టూ వస్త్రాన్ని పై నుంచి కింది వరకు కప్పుతారు. ఈ వస్త్రాన్ని గుండ్రంగా చుట్టుకున్న రాకిడి అనే ఆభరణం చుండైను అందంగా కనిపించేలా చేస్తుంది. ఇలా స్త్రీలు వస్త్రాభూషణాలు ధరించి గోపికల్లా తమను తాము భావిస్తారు.

**మధుర బంజారాల నృత్య రీతి :**

మధుర లబాన్ స్త్రీలు శ్రీకృష్ణునిపై పాటలు పాడుతూ ఒక సమూహంగా ఏర్పడుతారు. ఒకరి ప్రక్కన ఒకరు చేరి గుండ్రటి వలయాకారంగా ఏర్పడి నృత్యం చేస్తారు. ముందుకు వంగుతూ చేతులను ముందుకు ఆడిస్తూ, కాళ్లను ముందుకు వెనుకకు, వెంటనే ముందు వెనకాల మధ్య భాగంలో ఉంచుతూ, ముందుకు కదులుతుంటారు. వెంటనే గిర్రున తిరుగుతూ ముందుకు వంగి రెండు చేతులను ఊపుతారు. లయబద్ధంగా పాటకు అనుగుణంగా అడుగులు వేస్తారు. అచ్చంగా మార్వాడీల వలె చీరకట్టును కలిగి కొంగును ముందుకు ఉంచుతూ, తలపైనున్న చుండైను కప్పుతుంటారు.

పురుషులు తెల్లని ధోవతి, కాళ్ళకు గజ్జెలు, తలపాగాలు కట్టుకొని, నంగారా వాద్యానికి అనుగుణంగా నృత్యం చేస్తారు. కాళ్ళను ఒక దాని తర్వాత ఒకటి పైకి ఎత్తుతూ, రెండు చేతుల్లో ఒక చేతిలో పసుపు లేదా గులాబి రంగు వస్త్రాన్ని కలిగి, రెండవ చేతిలో గజ్జెలు చుట్టబడిన దాండియా (కోల) ను పట్టుకొని వాటిని ఊపుతూ రెండు మూడు అడుగులు ముందుకు కదిలి గిర్రున తిరిగి వెంటనే వెనక్కి కదులుతారు. వెనక్కి కదిలిన తర్వాత కూడా అదే రీతిన నృత్యం చేస్తారు.

గుండ్రటి సమూహం మధ్యలో నృత్య సంధానకర్త నృత్యాన్ని సంచాలనం చేస్తూ నృత్యం చేస్తుంటాడు. అతని సంజ్ఞలు చూస్తూ, వాటిని పాటిస్తూ, నృత్యకారులు నృత్యం చేస్తారు. మధుర బంజారాల ఈ నృత్యాన్ని గమనిస్తే సనాతనంగా ఆది మానవ సమూహాలు ఆనందం పంచుకున్నప్పుడు చేసే నృత్యాల వలె అనిపిస్తుంది. ఎక్కడా అభ్యసనం చేయకుండా ఏ విధమైన శాస్త్రీయ నృత్యాన్ని అనుసరించ కుండా ప్రకృతి సహజంగా తమలోని ఉద్వేగానందాన్ని నృత్య మాధ్యమంగా వ్యక్తం చేస్తారు వీరు. ప్రకృతిలోని మార్పులకు అనుగుణంగా పశుపోషణ చేస్తూ ప్రకృతిలోనే రమిస్తూ ఉంటారు. కావున ప్రకృతి, పంచభూతాల స్వభావానికి అనుగుణంగా చేతనత్వంలో చేసే కదలిక వలె వీరి నృత్యం సహజంగా, రమ్యంగా ఉంటుంది.

**మధుర బంజారాల నృత్య సందర్భాలు :**

రాధాకృష్ణుల ప్రేమను, గోకుల వాసుల అనుబంధాన్ని అహరహం తమలో నింపుకున్న మధుర బంజారాలు తమది బ్రజ్‌భూమి అని తాము మధుర, బృందావన వాసులమని, తమను తాము శ్రీకృష్ణుని సఖులమని పేర్కొంటారు. అటువంటి మధుర బంజారాల జీవనాన్ని నృత్యమయం చేసేవి నాగుల పంచమి, శ్రీకృష్ణాష్టమి, దసరా, తీజ్, జోహర్, కాలు బాబా జయంతి ఉత్సవాలు ముఖ్యమైనవి. అన్నింటి కంటే ప్రముఖమైనది హోళి పండుగ. ఈ పండుగలప్పటి వాతావరణం నంగారా చప్పుళ్ళు, గజ్జెల గలగలలు, బాజాల హోరు, దాండియా, గిల్లల ధ్వనులతో తండాను రంగులమయం చేస్తుంది.

పండుగలలో వచ్చే తొలి పండుగ తొలి ఏకాదశి. తొలి ఏకాదశిని వీరు అకాడి అని పిలుస్తారు. ఈ అకాడి పండుగను అడవిలో జరుపుకుంటారు. ప్రకృతిశక్తి అయిన భవానిని పూజిస్తూ యజ్ఞ కార్యక్రమం నిర్వహించి పంక్తి భోజనం చేస్తారు. అనంతరం అందరూ ఆనందంగా నృత్యం చేస్తారు. ఏరువాక పున్నమి నాడు వ్యవసాయపు

క్షేత్రాల్ని దున్నుటకు సిద్ధమయ్యేటప్పుడు, వ్యవసాయపు పంట ఇంటి చేరినప్పుడు సాతీ భవానీలకు పూజలు నిర్వహిస్తారు. సాతీ భవానీలలో ఒకటైన మేరామా (మారెమ్మ) ను భక్తితో ప్రార్థిస్తారు. ఈ సందర్భంగా కూడా మాధూరి నృత్యాన్ని చేస్తారు.

శ్రీకృష్ణాష్టమి నాడు అత్యంత వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించుకుంటారు. వీరి ఇష్ట దైవంగా భావించే శ్రీకృష్ణునికి ఇష్టమైన వంటలు, పాలు, పెరుగును సిద్ధం చేసుకుంటారు. ఈ సందర్భంగా జోహారాను నిర్వహించుకుంటారు. అడవికి వెళ్లి చీమలు పెట్టిన పుట్ట నుండి మట్టిని తెచ్చి అందులో గోధుమ, శనగ గింజలు పోసి, అవి మొలకెత్తాక మట్టితో శ్రీకృష్ణుని విగ్రహం తయారుచేసి, మొలకెత్తిన గింజలు, ఇతర నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా చేసే నృత్యం కన్నుల పండుగలా అనిపిస్తుంది. శ్రీ కృష్ణుని విగ్రహ రూపాల్ని మధ్యలో ఉంచి, చుట్టూ తిరుగుతూ చప్పట్లు చరుస్తూ, కదలిపోతుం డడం ఈ ఉత్సవం నాటి నృత్యంలో మనం గమనించవచ్చు.

హోలి పండుగను వీరు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. అలనాడు శ్రీకృష్ణుడు గోపికలతో ఫాల్గుణ ఉత్సవం జరుపుకున్న రీతిలోనే వీరు కూడా రంగులు జల్లుకుని నృత్య కార్యక్రమం నిర్వహించుకుంటారు. నంగారా శబ్దానికి అనుగుణంగా పురుషులు, పాటలకు అనుగుణంగా స్త్రీలు నృత్యం చేస్తారు. శ్రావణ మాసపు కృష్ణపక్షం తదియ నాడు తీజ్ ఉత్సవాన్ని కన్నెపిల్లలు అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారు. పుట్టమట్టిలో మొలకెత్తిన గోధుమ, శనగ గింజలను మారెమ్మకు, కన్నయ్యకు సమర్పించుకొని నృత్యం చేయడం, కన్నెపిల్లలు ఉయ్యాలలూగడం వంటివి చేస్తారు.

మధుర మంజారాలు నిర్వహించుకునే అట్టెపండగ నాడు పురుషులందరూ తాళాలు వాయిస్తూ కాలు బాబాను, శ్రీకృష్ణుడిని గూర్చిన పాటలు పాడతారు. హారతిని ఇస్తారు. ఈ సందర్భంగా వాయించే తాళధ్వని లయబద్ధంగా ఉంటుంది. పురుషులు పాటలు పాడుతుంటే, నంగారా మోగుతుంది. దీనికి అనుగుణంగా కోలాట మాడుతూ, హావభావాలను ప్రదర్శిస్తూ నృత్యం సాగుతుంది. ఇక్కడ పురుషులు నృత్యం చేయడం గమనార్హం. మధుర బంజారాలు ప్రతి యేటా తమ ఆరాధ్యదైవమైన పూరి జగన్నాథున్ని దర్శించడానికి 'దిండీ'ల రూపంలో (సమూహాల రూపంలో) వెళుతుంటారు. తమ మాధూరి నృత్యాన్ని పూరీ క్షేత్రంలో జగన్నాథుని ఎదుట చేసి భక్తిగా స్వామికి తమను తాము సమర్పించుకుంటారు. శ్రీకృష్ణుడే తమ సర్వస్వంగా భావించి తిరిగి వస్తారు.

వీరి గురువైన కాలుబాబా జయంతిని వీరు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. కాలుబాబా మధుర ప్రాంతంలో సద్గురువుగా చెప్పబడతారు. నేటి సంగారెడ్డి జిల్లా కంగ్టీ మండలంలో ఈ కాలుబాబాకు గుడి ఉంది. రాష్ట్రంలోని మధుర సమాజమంతా కాలు బాబా జయంతి రోజు ఇక్కడికి చేరుకుంటారు. అంగరంగ వైభవంగా




కాలుబాబా జయంతి ఉత్సవాలను జరుపుకుంటారు. కాలుబాబా గాథలను స్మరించుకుంటూ, ఆయన జ్వాలాముఖి మాతను ప్రసన్నం చేసుకుని చూపించిన మహిమలను గానం చేస్తూ, స్త్రీలు, పురుషులు నృత్యం చేస్తారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం జనసంద్రంగా మారుతుంది. దసరా పండుగ వీరి పండుగలలో ముఖ్యమైనది. దసరా పండుగ రోజు తీపి వంటకాలు చేసుకొని నృత్య కార్యక్రమాలు నిర్వహించుకుంటారు.

మధుర మంజారాలు అన్ని రాష్ట్రాలలో విస్తరించి ఉన్నారు. తెలంగాణలో మాత్రం వీరి జనసంఖ్య చాలా తక్కువ. జమ్మూకాశ్మీర్ నుంచి మొదలుకొని ఉత్తరాది రాష్ట్రాలు, దక్షిణంలో కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలలో విస్తరించి ఉన్నారు. సామాజికంగా వెనుకబాటుకు గురైన వీరు తెలంగాణ ప్రాంతంలో బి.సి.లుగా ఉన్నారు. వీరిని, వీరి అస్తిత్వాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్రం వీరిని, వీరి సొంత జాతి అయిన బంజారాలలో కలిపే ప్రయత్నం చేస్తున్నది.

విద్యావసతులు కల్పించబడి, ఇప్పుడిప్పుడే వీరు చదువుకుంటు న్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని మధురలు మంచి ఆర్థిక స్థితిలో ఉండి అభివృద్ధి చెందారు కానీ కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో విస్తరించిన వీరు ఇంకా అడవులకు దగ్గరగా ఉంటూ, పశుపోషణ, ప్రకృతి సేవలోనే తమ జీవితాన్ని వెల్లబుచ్చుతున్నారు. కావున వీరికి కనీస సౌకర్యాలు మెండుగా కల్పించి, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లయితే మెరుగైన స్థితికి చేరుకుంటారు.

మధుర బంజారాలు కూటికి పేదవారైనా మనసుకు మహా ధనవంతులు. అందుకే తమ సంస్కృతిని, సంప్రదాయాలను ఎంతో పవిత్రంగా కాపాడుకుంటున్నారు. కాలుబాబా, సంత్ సేవాలాల్ మహారాజ్‌ల ఆదర్శాలను పాటిస్తూ, తమ జీవితాల్లో ఆధ్యాత్మిక జీవన సౌరభాన్ని నింపుకుంటున్నారు. వీరిని ఎంత త్వరగా వీరి సొంత జాతుల్లో కలిపి వారి అస్తిత్వాన్ని కాపాడితే వారు అంత త్వరగా అభివృద్ధిలోకి వస్తారు. విద్యా, వైద్యం, గృహ వసతులు వంటివి కల్పించబడితే, మెల్లమెల్లగానైనా నేటి ఆధునిక ప్రపంచానికి దగ్గరవుతారు. ఆధునిక ప్రపంచం కూడా మధుర బంజారాల జీవన మాధుర్యాన్ని గమనించి, వారి సంస్కృతిని కళ్లకు అద్దుకుంటుంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2023

## సాధన పంచకమ్

**ఏకాంతే సుఖమాస్యతాం పరతరే చేత స్సమాధీయతాం**
**పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతామ్।**
**ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలా న్నాప్యుత్తరైః శ్లిష్యతాం**
**ప్రారబ్ధం త్విహ భుజ్యతాం అథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్॥**

**తాత్పర్యం :** 1. ఏకాంతంలో సుఖంగా ఉండవలెను. 2. పరబ్రహ్మమునందు మనస్సును చక్కగా నిలుపవలెను. 3. పూర్ణాత్మను బాగుగా దర్శించవలెను. 4. బ్రహ్మానుభూతిలో ప్రపంచమును మిథ్యగా చూడవలెను. 5. సంచితకర్మలు చక్కగా విలీనం చేయబడవలెను. 6. జ్ఞానశక్తి చేత ఆగామికర్మ నుండి విడిపోవలెను. 7. ఈ లోకంలో ప్రారబ్ద కర్మను పూర్తిగా అనుభవింపవలెను. 8. అటుమీదట పరబ్రహ్మ స్వరూపంగా భాసింపవలెను.

**వివరణ**

**7. ప్రారబ్ధం త్విహ భుజ్యతామ్ –**

ఈ లోకంలో ప్రారబ్ధ పూర్తిగా అనుభవింపవలెను. "జానాగ్ని దగ్ధ కర్మాణి" – జ్ఞానమనెడు అగ్ని సమస్తకర్మలను దగ్ధం చేస్తుందని గీతావచనం. అయితే సంచిత కర్మలను జ్ఞానాగ్ని భస్మం చేస్తుంది. జ్ఞానపూరితంగా కర్మలను అనుసరించుట ద్వారా ఆగామి సిద్ధం కాకుండా రద్దయిపోతుంది. కాని, ప్రారబ్ధం మాత్రం అనుభవింపక తప్పదు. అందుకే "ప్రారబ్ధం తు ఇహ భుజ్యతాం" – అన్నారు శంకరులు. దేహం వచ్చింది కనుక ప్రారబ్ధానుభవం తప్పదు. అయితే దాన్ని నీవు ఏడుస్తూ అనుభవిస్తావో లేక నవ్వుతూ అనుభవిస్తావో అది ఎవరికి వారే తీసుకునే నిర్ణయం మీద, చేసే ప్రయత్నం మీద ఆధారపడి ఉంటుంది. సాధకుడికి భక్తి వలన, శరణాగతి వలన ప్రారబ్ధాన్ని అంగీకరించే శక్తి లభిస్తుంది. అంతేగాక, తాను అనుభవించెడు ప్రారబ్ధాన్ని భగవత్ కృపగా, ప్రసాదంగా భావించిన యెడల అతడు ప్రసన్నంగా అనుభవించగలడు. శ్రీ శంకర భగవత్పాదులు తమ వివేకచూడామణిలో పేర్కొన్నమాట సందర్భోచితంగా ఉండగలదు.

**"ప్రారబ్ధం బలవత్తరం ఖలువిదాం భోగేన తస్య క్షయః**
**సమ్యగ్ జ్ఞానహుతాశనేన విలయః ప్రాక్సంచితాగామినామ్**
**బ్రహ్మాత్మైకమవేక్ష్య తన్మయతయా యే సర్వదా సంస్థితా**
**స్తేషాం తత్త్రితయం న హి క్వచిదపి బ్రహ్మైవ తే నిర్గుణమ్"**
**(వి.చూ. 454)**

## సత్సంగం



**భగవంతుడు**

అశాశ్వతాలైన దేహంలో, మనస్సులో ఈశ్వరుడున్నాడు. అంతేకాక ఆయన సర్వానికీ అతీతమైన చేతనత్వం. స్వేచ్ఛగా లోపలే ఉన్నాడు. సాకారుడైన ఈశ్వరుడు, సృష్టికర్త ఉన్నాడు నిజంగానే! సత్యాన్ని గ్రహింపని వారి దృష్టికే పరిమితమైంది. ఈ సాపేక్ష యథార్థం. అంటే, వ్యక్తిగత ఆత్మలున్నాయని నమ్మేవారికే నన్నమాట. కేవల స్థితిలో రూపరహితమైన ఆత్మని తప్ప వేరే దేని ఉనికినీ ఒప్పుకోదు, ఋషి.

భౌతికమైన దేహంవలె స్థూల రూపంలో కాకపోయినా, ఈశ్వరునికి నామరూపాలున్నాయి. భక్తుడు కల్పించుకున్న రీతిలో దర్శనమిస్తుంది. ప్రతి మతానుసారమూ, భగవంతుని నామరూపాలు మారుతూంటాయి. అవి అసంఖ్యాకం. భగవంతుని అంతరం కూడా మన ఆత్మ వలెనే – ఒకటే, రూపరహితమైనదే. అందువల్ల భగవంతుడు దాల్చే రూపాలన్నీ కేవలం కల్పితాలే. విశ్వంలో, అందరిలో, అన్నిటా అంతర్లీనమై ఉన్నాడు ఈశ్వరుడు. అన్నిటి సమూహమే భగవంతుడు. ఈ విశ్వమంతా ఒక మహత్తర శక్తిలోని ఒక అంశనుండి ఉద్భవించినదే. మిగిలినదంతా అట్లాగే ఉంది. భౌతికంగా అభివ్యక్తమైన శక్తీ ఆ మిగిలినదీ కలిపితే ఈశ్వరుడవుతాడు.



ఈశ్వరుడంటే మనకి కల భావాన్ని బట్టే, ఈశ్వరుని ఉనికి కూడాను! అసలు ఆ భావమెవరిదో గమనిద్దాం. భావమెప్పుడూ భావించేవాని బట్టే ఉంటుంది. నీవెవరివో తెలుసుకో, ఇతర సమస్యలన్నీ తీరిపోతాయి. ఈశ్వరుడు, భగవంతుడు, సృష్టికర్త, సాకారుడైన భగవంతుడు – ఈ మిథ్యారూపాలన్నీ పోతాయి. కేవల ఉనికే, సత్యం. అందువల్ల ప్రపంచం, అహంకారం, సాకారుడైన భగవంతుడూ అన్నీ అసత్తే. ఆ సత్ పదార్థాన్ని కనుగొనాలి. అంతకంటె తక్కువదేమీ కాదు.

వ్యక్తికి రూపముంటే, అప్పుడు ఆత్మకీ దానికి మూలమైన ఈశ్వరునికీ – రూపముంటుంది. కాని వ్యక్తి రూపం లేకపోతే, మిగిలిన వాటి గురించి ఎరుక ఉండదు. కనుక, భగవంతునికి రూపముందని అనలేము కదా! దీర్ఘమైన ధ్యానంలో భక్తుడు ఏ రూపంలో ఊహించుకుంటే, భగవంతుడా రూపంలో కనబడుతాడు. ఎన్ని నామాలు కలిగినా, ఈశ్వరుడు, నిరాకారుడైన చైతన్యం మాత్రమే!

# భారతీయీకరణ - 14

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత - భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

1916 నుండి 1947 దాకా కాంగ్రెస్ నాయకులు చేసిన ఉపన్యాసాలనుగానీ, వ్యాసాలనుగానీ, మతతత్వ సమస్య గూర్చి ఆ కాలంలో వెలువడ్డ పుస్తకాలనుగానీ ఊరికే పై పైన చూచినా గూడా, హిందూ-ముస్లిం సమస్య పూర్తిగా ఆంగ్లేయుల సృష్టి అనీ, వారు నిజమైన శాంతికి విరోధులనీ, వారీ దేశాన్ని విడిచి వెళ్ళితే మతసమస్యగానీ మతకల్లోలాలుగానీ ఉండవు అనే అభిప్రాయం కలుగుతుంది. ఈ అభిప్రాయాన్ని కాంగ్రెసు నాయకత్వం బుద్ధిపూర్వకంగా కలిగించింది. వ్యాప్తిలోకి తెచ్చింది. మతతత్వం నిలబడి ఉండడానికి ఆంగ్లేయులే నిజమయిన కారణం అన్న ఈ సిద్ధాంతం, ముస్లింలీగు యొక్క రాజీపడని మనస్తత్వానికి, మతతత్వానికి పెరిగే దుస్సహాయానికి మూలమయింది. ఇది ఆంగ్లేయులకూ ముస్లింలీగుకు గూడా ఎంతో బాగనిపించింది. ఆంగ్లేయులు ఈ దేశానికి స్వాతంత్రం ప్రసాదించడం కోసం ముందు షరతుగా హిందూ-ముస్లిం ఐక్యత పై వత్తిడి ప్రారంభించింది. అదే సందర్భంలో మాతృదేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెసుతో కలిసి పని చేసేందుకు ముస్లింలీగ్ వెలపెంచడం మొదలు పెట్టింది. చివరకు భారత ముస్లింల కోసం సర్వతంత్ర స్వతంత్ర రాజ్యాన్ని అది భారతదేశ శరీరంనుంచి పాకిస్తాన్ పేరిట తనకు కావలసిన మాంసఖండాన్ని పొందింది.

1947 ఆగస్టు 14న పాకిస్తాన్ ఏర్పడింది. ఆ మరుసటిదినాన ఆంగ్లేయులు భారతదేశాన్ని వదలి వెళ్ళిపోయినారు. మాతృభూమి ఆ విధంగా ఖండితమయింది. దేశభక్తులయిన కోట్లకొలది పశ్చిమ పంజాబ్, తూర్పు బెంగాల్, సింధు ప్రజలు ముస్లింల వేర్పాటు ధోరణి, మతతత్వం అనే బలిపీఠం మీద బలిపశువులుగా సమర్పించబడినారు.





అయినా, విభజనచే పరిష్కరించబడుతుందనుకొన్న సమస్య ఎక్కడిదక్కడే ఉండిపోయింది. గడిచిన మూడు సంవత్సరాలలో అది మరింత ప్రమాదకరంగా, హింసాత్మకంగా మారింది.

మతతత్వ సమస్యకు సంబంధించిన నింద అంతా ఆంగ్లేయుల మీదనే మోపుతూ, ఆంగ్లేయ నిర్గమనానికీ, మతతత్వ సమస్యా పరిష్కారానికి 1947లో భారతదేశ విభజనకు అంగీకరించి, నాటి నుంచీ అధికారంలోనే ఉన్న కాంగ్రెసు నాయకులు, 1947 లో విభజన సందర్భంలో ఏర్పడ్డ పరిస్థితులను గుర్తుకు తెచ్చే ఈనాటి పరిస్థితులను గూర్చి, ఆనాటివలనే, ఆధారంలేని, అవాస్తవిక, అతార్కికమయిన సంజాయిషీలు చెపుతున్నారు. 1947లో విభజన జరిగినప్పుడు ఈ దేశంలో ఆగిపోయిన 35 మిలియన్ల ముస్లింలు ఈనాటికి 50 మిలియన్ల దాకా పెరిగినారు. విభజన సందర్భంలో శ్రీ జిన్నా- డాక్టర్ అంబేద్కర్ ప్రతిపాదించిన విధంగా జనాభాను సంపూర్ణంగా మార్పిడి చేసుకొనడంలోనూ, ఈ దేశంలో ఆగిపోయిన ముస్లిం లీగు వారిని భారతీయీకరించడంలోనూ, వారిలోని ద్విజాతి

సిద్ధాంతాన్ని నిర్మూలించడంలోనూ కాంగ్రెసు నాయకత్వం సంపూర్ణంగా విఫలమయిపోయింది. ఆ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకొనడానికిగాను, ప్రస్తుతం మళ్లీ చెలరేగిన ముస్లిం మత తత్వానికీ, తప్పనిసరిగా దానికి ప్రతిస్పందించే జాతీయ భావనకూ క్రొత్త బలిపశువులను వెదుకడానికి కాంగ్రెసు నాయకత్వం మళ్లీ ప్రయత్నిస్తున్నది.

అసలు సమస్యను సరిగా విశ్లేషించి రోగ నిరూపణ జరిగినప్పుడే చికిత్స ప్రభావవంతంగా ఉంటుంది. కానీ అట్లా రోగ నిరూపణ సరిగా చేయడానికి బదులు కాంగ్రెసు పక్షం, కమ్యూనిస్టులూ, వారి కూటమిలోని వారూ అసలు సమస్యను పెడదారి పట్టిస్తూ, దౌర్జన్యాలకు, అల్లర్లకూ,మతకలహాలకూ, సందర్భాన్నిబట్టి, అధిక సంఖ్యాక వర్గాన్నీ లేదా వర్గాలనూ నిందిస్తున్నారు.

**“ఇటీవల సంవత్సరాలలో జరిగిన అల్లర్లన్నీ ముస్లిం లోని తీవ్రవాదుల, పాక్ అనుకూల ముస్లిం వర్గాల ద్వారానే ప్రారంభింప బడినాయన్న సత్యాన్ని వారు గుర్తించలేక, ఎవరు అల్లర్లు ప్రారంభించినారనేది ప్రధానం కాదు”** అని అంటున్నారు. వారి దృష్ట్యా హిందువులే సమాజంలోని అధిక సంఖ్యాక వర్గం కావడం మూలాన అల్లర్ల విషయంలో వారే– హిందువులే– నిందార్హులు. ఎందుకంటే, ఆ అల్లర్లలో ముస్లింలు ఎక్కువగా నష్టపోయినారు.

ప్రధాని, శ్రీమతి ఇందిరా గాంధీ అంతటివారే ఇట్లా వాదిస్తుంటే, ఇక చెప్పవలసిందేముంటుంది? ఇక ఈ వాదననే అనుసరించి నప్పుడు 1965లో జరిగిన భారత– పాకిస్తాన్ యుద్ధం విషయంలో గూడా భారత దేశాన్ని నిందించవలసి ఉంటుంది. ఎందుకంటే, ఆ యుద్ధంలో పాకిస్తానే ఎక్కువగా నష్టపడింది మరి.

అసలు నిజమేమిటంటే, ఈనాడు ఈ దేశంలో ఉన్న ఆ విధంగా ఈ సమస్యను అధికార కాంగ్రెసు పక్షం, ప్రధానంగా– దాని ప్రస్తుత నాయకత్వం సృష్టించింది. 1947 కు ముందు ఆంగ్ల ప్రభుత్వం భారత జాతీయ కాంగ్రెసును నడిపిస్తున్న జాతీయశక్తులకు ఎదురు నడిపించడానికి ముస్లిం మతతత్వ వర్గంపై అభిమానాన్ని పెంచుకున్న విధంగా, ఈనాడు, ఎన్నికలలో ముస్లిం సహకారం కోసం ముస్లిం మతతత్వ వర్గాన్ని ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం అభిమానిస్తున్నది. నిజంగా ఈ నాయకత్వం దేశ విభజన నుండి గుణపాఠం నేర్చుకొని ఉండినట్లయితే, ఈ సమస్యను పరిష్కరించవలెనని గాఢంగా భావించి ఉండినట్లయితే, 1947 నాటి నుంచే ముస్లిం ప్రజానీకాన్ని, టోపీ మార్పుతో ఒకే రాత్రిలో కాంగ్రెసు వ్యక్తులయిపోయిన మతతత్వం పూరిత ముస్లిం లీగు నాయకత్వం గుప్పిలి నుంచి విడిపించడానికి తగిన గట్టి ప్రయత్నాలు చేసి ఉండేది.

చాలాకొద్ది ప్రయత్నంతోనే ఆ నాయకత్వం ముస్లింలలో నిజమయిన దేశాభిమానం గల నాయకత్వాన్ని నిర్మించగలిగి ఉండేది. వారిని భారత జాతీయ జీవన వాహినిలో చేర్చి ఉండేది. కానీ అది సరిగ్గా ఈ రీతికి విరుద్ధంగా ప్రవర్తించింది. ఒక క్రమ పద్ధతిననుసరించి ముస్లింల మనసులలో జనసంఘం వంటి జాతీయ పక్షాల యెడ కాల్పనిక భయాన్ని కలిగిస్తూ, వారు కాంగ్రెసునే పట్టుకు వ్రేలాడేట్లు చేస్తున్నది. దీనికోసం ముస్లింలలో బహుభార్యత్వాన్ని సాగనిస్తూ, పరిధులనతిక్రమించి అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయాన్ని – దాని వెనుకటి మతతత్వాన్నీ, సంఘ వ్యతిరేక స్వరూపాన్నీ ఏమాత్రం తొలగించకుండానే– పునరుద్ధరించడం వంటి కొన్ని సదుపాయాలు కలిగించి ముస్లింలను బుజ్జగిస్తున్నది. ఈ విధంగా చేస్తూ ఇస్లాంను ఆధునీకీకరణ పొందకుండా ఉండేట్లు చేస్తున్నదీ నాయకత్వం. ఇస్లాం యొక్క భారతీయీకరణకు ఈ ఆధునికీకరణ మొదటగా జరగవలసిన అంశం.

**ఆగస్టు**

కాంగ్రెసు, కమ్యూనిస్టు పక్షాలు మొన్నమొన్ననే మతతత్వ వ్యతిరేక పోరాటం ప్రారంభించినాయంటే, ఆ ప్రారంభించడంలోని ప్రాథమికోద్దేశ్యం, ముస్లిం మతతత్వాన్ని బలిష్టం చేసి, దాన్ని తమకనుకూలంగా త్రిప్పుకొనడం మాత్రమే. దీనికి, మతతత్వాన్ని నిర్మూలించడానికీ ఏ విధమయిన సంబంధమూ లేదు. “ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రధాన సంపాదకుడు– మత దృష్ట్యా క్రైస్తవుడు– ఫ్రాంక్ మోరాస్ ఇటీవల– అంటే, 18–5–1970 నాటి ఇండియన్ ఎక్స్ ప్రెస్ లోని వ్యాసంలో వ్రాసినట్లు– దీని ప్రధానోద్దేశ్యం రాజకీయ ప్రయోజనాల కోసం అల్పసంఖ్యాక వర్గాలను దుర్వినియోగపరచు కొనడమే. **“ఈ అల్పసంఖ్యాక– అధికసంఖ్యాక వర్గ భావనను ఎవరు సృష్టించారు? పునఃపటిష్టం చేసినారు? అని ప్రశ్నిస్తూ, దానికి సమాధానంగా ఆయనే– దాపరికం లేకుండా చెప్పుకొనవలెనంటే, భారత ప్రధాని తప్ప మరెవరూ కాదు”** అన్నాడు.

అందువల్ల, ఒక దేశంగా భారతదేశపు మనుగడకే ప్రత్యక్ష ప్రమాదంగా పెరిగిపోతున్న ఈ మతతత్వాన్ని నిర్మూలించడానికి మొట్టమొదట చేయవలసినపని, దానిని పార్టీ రాజకీయాల నుంచి తొలగించడం.ఈ విషయంలో అధికార పక్షమే మొట్టమొదట మార్గదర్శకంగా ముందుకురావలసి ఉన్నది. అన్ని రాజకీయ పక్షాలు గూడా తమపక్ష ప్రయోజనాల కోసం మతతత్వాన్ని ఉపయోగించు కోబోమనీ, పెంపొందించబోమనీ ప్రమాణ పూర్వకంగా ప్రకటించ వలసి ఉంటుంది. ముస్లిం వర్గాల ఓట్లను సంపాదించుకోవడం కోసరంగాను అందరికీ వర్తించే ఏకభార్యాత్వం వంటి పౌర నిబంధనలను ముస్లింలకు వర్తింపచేయడానికి నిరాకరిస్తూ ప్రభుత్వం ముస్లింలను బుజ్జగిస్తున్నదనీ హిందూ– ముస్లింల విషయంలో ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తున్నదనీ ఒక తీవ్ర భావం సర్వత్రా వ్యాపించి ఉన్నది. దీన్ని ప్రభుత్వం తొలగించవలసి ఉన్నది.

ఈ ముస్లిం మతతత్వాన్ని బుజ్జగించే ఇట్లాంటి విధానం, దేశవిభజనకు పూర్వం కాంగ్రెసు అనుసరించిన విధానాన్ని, దాని

వల్ల కలిగిన దుష్ఫలితాలను గుర్తు చేస్తున్నది. అందుకని, ముస్లిం లీగ్, మజ్లిస్- ఇ- ముషావరాత్ నాయకులు తమ వేర్పాటుతత్వం, మతతత్వం ఏ మాత్రమూ పనికిరావని గుర్తించేట్టుగా చేయడం చాలా అవసరం. వారెంతవరకైతే, తమ వేర్పాటుతత్వం, రాజీపడని మతతత్వం తమకు లాభదాయకమయినవిగా భావిస్తుంటారో, అంతవరకు వాటిని వారు వదిలిపెడతారనుకోగూడదు. దురదృష్టవశాత్తు గడచిన యాభయి సంవత్సరాల చరిత్ర ఈ ముస్లిం నాయకత్వంలోనూ, పాకిస్థాన్ పాలకుల లోనూ, హిందువులను గూర్చీ, భారతదేశాన్ని గూర్చి నిరంతరం కలహధోరణిలో వ్యవహరించడమే తెలివయిన విధానం అనే భావాన్ని సృష్టించింది. సామాన్యంగా హిందువులలో కనిపించే మెతకదనాన్నీ, సంకుచిత రాహిత్యాన్నీ పిరికితనంగా బలహీనతగా వారు దుర్ వ్యాఖ్యానం చేస్తున్నారు. వారి గత అనుభవాలు, వారిలో, తాము మళ్లీ ఒకసారి అఖిల భారతదేశానికి ప్రభువులం కాగలమనే విశ్వాసాన్ని కలిగించింది. ఈ విశ్వాసాన్నీ, భావననూ పాకిస్తాన్ లో తరచుగా వినిపించే-

**"హస్కె లీయా హై పాకిస్తాన్**

**లడ్కె లేంగే హిందుస్థాన్"**

- నవ్వులాటగా పాకిస్తాన్ సంపాదించాము, యుద్ధం చేసి హిందుస్థాన్ సాధిస్తాము- అనే నినాదాలు స్పష్టం చేస్తాయి. భారతదేశంలోని ముస్లిం లీగ్ వారి హృదయాలలోనూ వీటికి సహోదరమయిన ప్రతిధ్వనులు వినిపిస్తున్నయి. నిజానికి మజ్లీస్- ఇ- ముషావరాత్, ముస్లింలీగ్, జమాయత్- ఇ- ఇస్లామీ సంస్థలు, వాటి నాయకులు భారత ముస్లింలలో, వారు (ముస్లింలు) ఏదో విధంగా తమ జనాభాను పెంచవలెననీ, ఆ ఒక్క దానివల్లనే ముస్లింలు భారతదేశంపై తిరిగి పాలనాధికారాన్ని సాధించగలరనే భావాన్ని దృఢతరం చేయడానికి ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు సాగిస్తున్నారు. మజ్లీస్- ఇ- ముషావరత్ తన ఈ అభిప్రాయాన్ని ఏనాడు దాచుకోలేదు. వారిదృష్టిలో, భారతదేశంలో ముస్లిం ప్రభుత్వం నెలకొనడం కేవలం భారత ముస్లింల ప్రయోజనాలకే కాక, మొత్తం భారతదేశ ప్రయోజనాలకు కూడా అత్యవసరం. ఇదే అభిప్రాయాన్ని లూమిర్- ఇ- మిల్లాత్ అధ్యక్షుడు ఖలీల్- ఉల్- హుస్సేన్ మరో మాటల్లో వ్యక్తీకరించినాడు. 1962లో భారతసేన చైనా చేతులలో పరాజితమయినప్పుడు, ఈ అంశాన్ని వ్యాఖ్యానిస్తూ తన సంస్థ యొక్క అధికార పత్రిక- అర్షాద్- లో ఈ విధంగా వ్రాసినాడు.

**"ప్రస్తుత పరాజయంవల్ల, ప్రస్తుత భారతదేశ పాలకులు దేశం మొత్తాన్ని పాలించడంలో అసమర్థులని నిరూపితమయింది. ఇప్పుడీ దేశం ముందు ప్రత్యామ్నాయ మార్గం ఒకటే ఉన్నది. అది, ఇంతకు ముందు వేయి సంవత్సరాలుగా దేశాన్ని పాలించిన వారికి ప్రభుత్వం అప్పచెప్పడమే".**




భారత ముస్లింలలో ఈ ప్రమాదకరమయిన అభిప్రాయాలు సజీవంగా ఉండడం లోనే పాకిస్తాన్ కూడా ఆసక్తి చూపిస్తున్నది. భారత ముస్లింలు భారత జీవన ప్రవాహంలో ఇక్కడ కలిసిపోతారో అని పాకిస్తాన్ భయం. ఎందుకంటే, ఇట్లా జరిగితే, ఏ ద్విజాతి సిద్ధాంతం మీద పాకిస్తాన్ ఏర్పడిందో, ఆ సిద్ధాంతం పటాపంచలయి పోతుంది. అందుకని, భారత ముస్లింలు భారతీయతకు భిన్నంగా, విడిగా, తమ ప్రత్యేకతను నిలబెట్టుకునేట్లు చేయడానికి వీలయినన్ని ప్రయత్నాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాకిస్తాన్ సాగిస్తున్నది. ముస్లిం లీగ్, అట్లాంటి ఇంకా ఇతర ముస్లిం సంస్థలు భారతీయీకరణ భావనను ఎందుకు ఇంతగా వ్యతిరేకిస్తున్నాయో, దీనివల్ల స్పష్టమవుతుంది. ఇదిట్లా ఉండగా, భారతీయీకరణ భావనను గూర్చి ప్రధాన మంత్రి ప్రదర్శించే వ్యతిరేకత, పాకిస్తాన్ మరియు భారత దేశంలోని ముస్లిం సంస్థల ఉద్దేశ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తున్నది. ఆమె (ప్రధానమంత్రి) ఉద్దేశ్యం వచ్చే ఎన్నికలలో ముస్లిం ఓట్లను జాగ్రత్త పరిచుకొనడమే. కానీ, ఈ తాత్కాలిక ప్రయోజనం కోసంగాను ఆమె, తనకు తెలియకుండానే, పాకిస్థాన్ మరియు దాని ఏజెంట్లూ అవకాశాన్ని పురస్కరించుకొని అధికారాన్ని పొందేందుకు నాందిగా, మరొకసారి దేశవిభజనకు వేసే మార్గాన్ని బలపరుస్తున్నది.

అందువల్ల, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసంగాను ముస్లిం మతతత్వాన్ని పటిష్ఠంచేసే ఈ ప్రమాదకర విధానంలోని అంతర్గత అపాయాలను దేశాభిమానం గల భారతీయులందరూ- తమతమ పక్షాలతో ప్రమేయం లేకుండా- స్పష్టంగా అర్థం చేసుకోవలసి ఉన్నది.

మతతత్వానికి రాజకీయ సహకారాన్ని ఉపసంహరించు కొనడమేగాక, ఈ భయాన్ని తొలగించుకొనడానికి తగినట్లుగా మరికొన్ని చర్యలు తీసుకొనవలసి ఉన్నది.

ముందుచూపు, వర్గ పరిమితంకాని దేశాభిమానం గల నాయకత్వాన్ని భారత ముస్లింలలో నిర్మించడం తత్క్షణం అత్యవసరంగా తీసుకొనవలసిన మొదటి చర్య. కాలానుగుణ్యం కానట్టి ముల్లాల అధికారాన్ని శాశ్వతంగా ముస్లింలపై సాగనిచ్చేందుకు ఇస్లాం ఒక సాధనం కాకుండా ఉండేవిధంగా, ఇస్లాంను ఆధునికీ కరించడం అవసరమయిన మరొకచర్య, కమాల్ పాషా వంటివాడు లేకపోయి ఉంటే టర్కీలోని ఇస్లాం కూడా, ఈనాటి భారతదేశంలోని ఇస్లాం మాదిరిగానే ఆధునికంగా, తిరోగామి దృక్పథంతోనే ఉండి ఉండేది. అయితే కమల్ పాషా టర్కీలోని ఇస్లాంకు ఆధునికతను, టర్కీయతను కల్పించగలిగినప్పుడు, ఈ దేశంలో ఇస్లాంను ఆధునికీ కరించడానికీ, భారతీయీకరించడానికి అవకాశం లేదనడం వట్టి తలక్రిందువాదం. అయితే, దీనికి, ఆలీఘర్ మేధావి వర్గం యొక్క, ముల్లాల యొక్క ప్రయోజనాలకు విరుద్ధంగా తిరుగుబాటు లేవదీయడానికి సిద్ధంగా ఉండే వ్యక్తులు ఆ ముస్లిం సమాజం నుండే ముందుకు రావడం అవసరం.

ఒక తృప్తికరమయిన అంశం ఏమిటంటే, ముస్లిం యువకుల లోని చిన్న వర్గంలో ఈ విధమైన తీవ్ర చైతన్యం కనిపిస్తున్నది. పూనాకు చెందిన యువకుడు, శక్తిమంతుడు, ఉత్సాహశీలి, సంఘసేవాశీలి అయిన శ్రీ హమీద్ దల్వాయి ఇట్లాంటి యువకులలో ఒకడు. ఆయన వంటి వారే "జనసంఘం" లో గూడా కొంతమంది ఉన్నారు. అయితే, వారు ముల్లాల ప్రాబల్యంలో గల ముస్లిం సమాజాన్ని అంత బాగా ఆకర్షించ లేకపోతున్నారు. వారిలో కొందరు సమాజపు వెలికి- బహిష్కరణ-కు భయపడి బహిరంగంగా మాట్లాడలేకపోతున్నారు. ఒకసారి ఈ సమస్యపై నా ఉపన్యాసాన్ని విని ఢిల్లీ కళాశాలలోని రాజనీతి శాస్త్రోపన్యాసకుడైన పయి వారి వంటి ఒక యువకుడు, తను నాతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాడనీ, కానీ, తన వర్గీయుల పగ సాధింపు చర్యలకు భయపడి ఈ భావాలను తాను వ్యాపింప చేయలేకపోతున్నాడనీ చెప్పినారు.

దురదృష్టవశాత్తు, ప్రస్తుతం అధికారంలో ఉన్న పక్షం ఇట్లాంటి యువకులను ప్రోత్సహించడానికి బదులు రూఢీనిష్ఠులయిన మతతత్వ వాద నాయకత్వానికే తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నది. ఈ అధికార పక్షానికి దేశభక్తి, ఆధునిక దృష్టి గల శ్రీ మహమ్మద్ కరీం భాగ్లా దేనికి ఉపయోగపడదు. కానీ, యూసుఫ్ సలీమ్ వంటి మాజీ రజాకార్లు వీరివల్ల సింహాలవుతున్నారు.

అందువల్ల, ముస్లిం సమాజంలో ఆధునిక దృష్టి గల శక్తులను సర్వవిధాల అభిమానించి, ప్రోత్సహించి, అన్ని రకాలుగా సహకరించడం ఈనాడు అన్ని జాతీయ రాజకీయ పక్షాల ప్రథమ కర్తవ్యం. (సశేషం)


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10 (25)
UGC Care List Approved Journal
హైదరాబాద్ ఆగస్టు : 2023

గ్రంథాంతరంగం 26

# శుక్ల పక్షము

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

ప్రతిభావంతులైన ఒకరిద్దరి కవుల కవితలతో ప్రారంభమై, మరి కొందరు కవికుమారుల రమణీయ రచనలతో సమీకృతమై ఉద్యమరూపం తాల్చిన భావకవిత్వం ఆధునికాంధ్ర కవిత్వ చరిత్రలో ఒక కమనీయ అధ్యాయమే. భావకవిత్వం ఆవిర్భవించి, మొగ్గ తొడిగి, పువ్వుగా వికసించి పరిమళాలు వెదజల్లి, మూడు దశాబ్దాల పాటు (1910–40) మరి కొంత కాలం వరకు భావుకుల మనస్సుల్ని చూరగొన్న సంగతి తెలుగు సాహిత్య చరిత్ర బద్ధమైనదే. భావకవిత్వం పుట్టి, సద్యోయౌవనంగా సహృదయ కంఠాభరణంగా వెలుగొందుచున్న రోజుల్లోనే సంస్కృతాంధ్ర పండిత దిగ్గజమైన అక్కిరాజు ఉమాకాంతం పంతులు గారు భావకవిత్వంపై విరుచుకు పడ్డారు. ముఖ్యంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి 'కృష్ణపక్షం' (1925) భావం, వస్తువు, రచనలపై వజ్రాయుధమే ప్రయోగించారు. (నేటికాలపు కవిత్వము –1928) ఆధునిక సుకుమార, స్వతంత్ర ప్రేమ భావాలను ఆహ్వానించలేని కరుడు గట్టిన సంప్రదాయవాది ఉమాకాంతం గారి దెబ్బలకు తాళలేక పోయింది భావకవిత్వం. ఇక భావకవిత్వ ప్రముఖులెవ్వరు కూడా ఆయన ఆక్షేపణలకు సమాధాన మిచ్చే సాహసం చెయ్యలేక పోయారు. ఈ సందర్భంలో ఓ సంప్రదాయ కవి అనంత పంతుల రామలింగస్వామి 1932లో 'శుక్లపక్షము' అనే కవితా సంపుటిని ప్రచురించి, భావకవిత్వాన్ని అపహాస్యం చేస్తూ, అధిక్షేపిస్తూ సైంధవ భూమికను నిర్వహించారు. భావకవిత్వం కోమల భావ సంపన్నులైన చాలామంది కవికుమారుల్ని సమకూర్చుకొని 'బహుళాంధ్రోక్తి మయ ప్రపంచాన్ని' అలరించి, పులకరింప చేసి ఒక ఉద్యమంగా వేళ్ళూను కొంది. అక్కిరాజు ఉమాకాంతం పంతులు, అనంతపంతుల రామలింగస్వామి గారల ఘాటైన విమర్శలకు తట్టుకొని, భావకవిత్వం అంగదపాదమై నిలదొక్కుకోగలిగింది. భావకవిత్వానికి మేలుబంతి అయిన కవితా సంపుటి 'కృష్ణపక్షము' ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. భావకవిత్వాన్ని అపహాస్యం అవహేళన చేసిన అనంత పంతుల రామలింగస్వామి 'శుక్లపక్షా'నికి కృష్ణపక్షం వాటిల్లింది. కాని వరకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి 'కృష్ణపక్షా' నికి శుక్లపక్షం సిద్ధించింది. సమకాలీన కవులు, విమర్శకులు మరికొందరు అగ్రహోదగ్రులై అగ్నివర్షం కురిపించినా కవి వర్యులైన కృష్ణశాస్త్రిగారు అగ్నిపునీతులై నిలిచారు. ఇక 'కృష్ణపక్షము' కీర్తిచంద్రికలతో విలసిల్లింది. ఈ అభిప్రాయాన్నే ప్రసిద్ధ విమర్శకులైన డా. సి. నారాయణ రెడ్డిగారు తమ సిద్ధాంత గ్రంథం 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు' లో చాలా చక్కగా చెప్పారు. **"వీరు ప్రత్యర్థులచే ఎంతగా దూషింపబడిరో, సహృదయుల చేత అంతగా భూషింపబడిరి. భావకవిత్వమును నలుమూలల ప్రచారము చేసిన వారిలో వీరగ్రేసరులు. భావకవుల కావ్యములను పాథేయముగా మూట గట్టుకొని వీరు చేసిన ప్రయాణము లెవరు చేయలేదేమో? సాహితీ సమితి స్థాపనతో భావకవుల కొక గూడేర్పడినది. నవ్యసాహిత్య పరిషత్తు స్థాపనతో అది అపరంజి మేడగా రూపొందినది. ఎన్ని పాటుపోటులు వచ్చినను అచంచలముగా మూడు నాలుగు దశాబ్దుల పాటు సాగిపోయిన కవిత్వోద్యమ మిది."** (పేజి: 311. ద్వితీయ ముద్రణ–1977)

భావకవిత్వ భావాంబర వీధిలో చుక్కల్లో చంద్రునిలా వెలిగిన కృష్ణశాస్త్రి రమణీయ కావ్యం 'కృష్ణపక్షం' ను గేలి చేసిన మగధీరుడు అనంత పంతుల రామలింగస్వామి (1890) అధిక్షేపకావ్యం 'శుక్లపక్షము' గురించి తెలుసుకుందాం. ఈయన సంస్కృతం, తెలుగు భాషల్లో నిష్ణాతుడైన సంప్రదాయ బద్ధుడైన కవి. 1920–37 కాలావధిలో దేశభక్తి, ప్రకృతి ప్రేమ,



ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

ప్రాచీన కావ్యరీతుల పట్ల భక్తి శ్రద్ధలు ప్రదర్శిస్తూ భారతి, ఆంధ్రసాహిత్య పరిషత్తు పత్రిక, ఆంధ్రపత్రిక ఉగాది సంచికల్లో కవితలు వెలువరించిన ప్రతిభాశాలి. వీటితో పాటు ఈయన 'సరోజిని' అనే ఖండకావ్యాన్ని కూడా రచించారు. ఇది విషాద ప్రేమను కరుణార్ద్రంగా చిత్రించిన కావ్యం.

అనంతపంతుల రామలింగస్వామి గారి కవితాసంపుటి 'శుక్లపక్షము' తొలిసారిగా 1932లో ప్రచురింపబడింది. తొలివిడతలో 500 ప్రతులు అచ్చయిన ఈ కావ్యం మరుసటి ఏడే (1933) 1500 ప్రతులతో ప్రకాశిత మయిందంటే, ఆ సుకృతి పాఠక మహోదయుల మనస్సుల్ని చూరగొన్న మాటే కదా! రాజమహేంద్ర వరంలోని రాజన్ ఎలెక్ట్రిక్ ప్రెస్సు నుంచి వెలువడిన ఈ కావ్యం ముద్దులొలుకుతూ, ముద్రారాక్షసాల బారిన పడకుండా నిరాభరణ సుందరిగా పాఠకుల ముందు నిలిచింది.

'శుక్లపక్షము' లో ఎనిమిది కవిత లున్నాయి. వీటిలో ఆరు కవితలు భారతి, ఆంధ్రసాహిత్య పరిషత్తు పత్రిక, ఆంధ్రపత్రిక (సంవత్సరాది సంచిక)ల్లో వెలువడ్డవే. అవి మొదట పత్రికల్లో గణపతి. కుకవి ప్రబోధము, కవి ప్రబోధము, కృతి స్వీకృతి, కృతినామ కరణము అనే – శీర్షికలతో

ప్రచురింపబడ్డ 1932లో 'శుక్లపక్షము' సంకలింపబడ్డప్పుడు విఘ్నకవి, కుకవి, వికటకవి, కవిరాజు, భావతురంగము అనే నామాంతరాలతో దర్శనమిచ్చాయి. భావకవిత్వము, భావకవి, గణాధిపతి అనే కవితలు మిగతావి. వీటిలో 'వికటకవి' అనే కవిత అనంతపంతుల రామలింగస్వామి తమ్ముడు అనంతపంతుల వేంకటేశ్వర్లు రాసింది. ఇది 'శుక్లపక్షము' లో వరుస క్రమంలో మూడోది. ఒకటవ కవిత 'విఘ్నకవి' (పాతపేరు 'గణపతి') కూడా రామలింగస్వామి తమ్ముడైన వేంకటేశ్వర్లుగారు రాసిందే 'విఘ్నకవి' కవితను తన కోరికపై చనిపోవటానికి వారం ముందు తన తమ్ముడు రాశాడనీ, 'వికటకవి' కవిత తాను రాసిన 'కుకవి' కవితకు సమాధానంగా మరింత వివరణాత్మకంగా, రసాత్మకంగా వుంటుందనీ ఈ 'శుక్లపక్షము'లో చేర్చిన కారణ మదేయని తొలిముద్రణ ప్రతికి ఇంగ్లీషులో రాసిన పీఠికలో చెప్పారు. (పేజి:1)

అనంతపంతుల రామలింగస్వామి గారి 'శుక్లపక్షము' (1932–1933) 1935వ సంవత్సరము ఆంధ్రవిశ్వకళా పరిషత్తు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు, మద్రాసు విశ్వవిద్యాలయం బి.ఏ. విద్యార్థులకు పాఠ్యపుస్తక మయిందంటే ఆనాటి యువతరం ఈ కావ్యాన్ని చదివి, కాస్తో కూస్తో ప్రభావితమై వుంటుందని భావించాలి.

'శుక్లపక్షము' వెలువడ్డ కాలంలో అంతోఇంతో దుమారం లేపి వుంటుందని భావించవచ్చు. భావకవిత్వం విజృంభించి 'శుక్లపక్షము' వెన్నెల కాంతులు మరుగుపడి పోయినట్లు తెలుస్తుంది. అలాంటప్పుడు ఈ కావ్యం గురించి తర్వాతి తరాల పాఠకులకు, పరిశోధకులకు, ఉపన్యాసకులకు, ఆచార్య పుంగవులకు తెలుసుకొనే ఆస్పదం లేకుండా పోవడం చింతించాల్సిన సంగతే మరి.

'శుక్లపక్షము' కావ్యానికి ఇంగ్లీషులో పీఠిక రాసిన విజయనగరం మహారాజా కాలేజి రసాయన శాస్త్ర ఉపన్యాసకులు యం.వి. నరసింహ స్వామి, ఆ ఇంగ్లీషులో అభిప్రాయం తెలిపిన జయంతి రామయ్య పంతులు గార్ల అభిమతాలు గమనించటం అవసరమని తోస్తుంది. అలాగే చెళ్ళపిళ్ళవారు, వజ్ఝల చిన సీతారామస్వామి, పింగళి లక్ష్మీకాంతం మొదలైన విద్వాంసుల అభిప్రాయాల పరిచయం కూడా ఆవశ్యకంగా కనపడుతుంది.

యం.వి. నరసింహస్వామి గారు తమ 12 పేజీల సుదీర్ఘమైన పీఠికలో అనంతపంతుల వారి కవితా ప్రతిభను వేనోళ్ల ప్రస్తుతించారు– "The aim of the author of this quaint collection is not merely to amuse but to help essentially the advent of a more rational, more enjoyable and more sublime poetic tradition, than is attempted by the poets of the present generation Accordingly by, he has drawn largely on the might of ridicule as a curative up for the present literary atrophy of modern Telugu Poetry. In his beautiful and charmingly musical verses he has shown to the world in a manner, which no other could show, that wit and rightness are not incompatible with scholarship. By his new experiment the author has created a new tradition which is taught a new tradition which is traught with the healthy growth of Telugu Poetry" (పేజి:10)

(సంప్రదాయబద్ధమైన ఈ సుందరకవితా సంపుటి కర్త ఆశయం పాఠకుల మనస్సుల్ని రంజిపచేయటానికి మాత్రమే పరిమితం కాలేదు. నేటితరం కవులు ప్రారంభించిన నవ్యసంప్రదాయం కంటే హేతుబద్ధమైన. ఆనందదాయకమైన, ఉదాత్త కావ్య సంప్రదాయాన్ని పటిష్టం చేయడానికి ఉద్దేశించిన సంకల్పం బీ ఆధునికాంధ్ర కవిత్వం అరికట్టడానికి సాధనంగా ఈ అవహేళన లేదా అధిక్షేపశైలిని ఆశ్రయించారు రచయిత. కవి అందమైన, ఆకర్షణీయమైన, శ్రవణానందకరమైన శైలిని పాఠకులకు ప్రసాదించారు. నేటికవులెవ్వరు ప్రదర్శించలేని వ్యంగ్యాన్ని, సులభ వ్యక్తీకరణ విధానాన్ని ఈ రచయిత చూపారు. పైగా వీరి పాండిత్యం కూడా దానికి తోడైంది.

అనంతపంతుల రామలింగస్వామి 'శుక్లపక్షము' రెండవ ముద్రణ (1933) భూమికలో ఈ విధంగా తన అభిప్రాయాన్ని తెలియజేశారు. "Satire comes into play only when there is in any field some thing wich exicites laughter and ridicule, for, none will be so foolish as to laugh at a thing of real beauty. And modern Telugu poetry, the subject of my satire, has obviously same ugly elements in it. It is these ugly elements that i have largely sati rised here in. and if in this work, I have laughed. I wish to assure one and all, that I have laughed only to love but certainly not to hate.) (పేజి:2)

(ఏ క్షేత్రంలో అన్నా కానివ్వండి– హాస్యానికే, అవహేళనకే అవకాశం వున్నప్పుడే అక్కడ అధిక్షేపం కాలు మోపుతుంది. సహజ సుందరంగా వున్న దేన్ని కానీ వివేకవంతులు గేలి చేసేందుకు తలపెట్టరు. ఆధునిక తెలుగు కవిత్వంలో కొన్ని వికారాలు వున్నందు వల్లే నేను ఈ అధిక్షేప కావ్య రచనకు సంకల్పించాను. ఈ వికృత చేష్టల్నే నేను పరిహసించాను, ఎద్దేవా చేశాను. నవ్వాను కూడా. నేను నవ్వుతూనే ఈ కవిత్వాన్ని ప్రేమించాను. కాని ఈ కవిత్వాన్ని నేను పిసరంత కూడా ద్వేషించ లేదంటే మీరు నమ్మండి.")

'శుక్లపక్షము' అధిక్షేప కావ్యకర్త అనంతపంతుల వారి

రచనోద్దేశ్యాన్ని పై మాటలు స్పష్టంగా వెల్లడిస్తాయి. 'శుక్లపక్షము' మొదటి ముద్రణ (1932) చదివిన మహాపండితులు సంప్రదాయ వాదులైన జయంతి రామయ్య పంతులు గారిలా తమ అభిప్రాయం వెలిబుచ్చారు– "Telugu literature is not altogether wanting in the humourous element but in most of such, poems the humor has taken the serious from of Personal Sarcasm and is offensive the humor of the present poems in ''Sukla Paksham '' is mild and is directed not against persons but against certain new models in Telugu woe trey to which the rather in appropriate name ''Bhavakavitvam'' is generally applied. The new Poetry Consists of Fragmentary poems embodying stray ideas and is modelled some what offer english lyrics. and being in many cases the production of amateur genius whose acquaintance with classical Telugu literature and command of Telugu.“

Language are meager, it often fails to express fully what the authors mean to convey.." (కవి 'శుక్ల పక్షము' లోని కవితల్లో వెల్లడించిన హాస్యం సుకుమారమైనది. కవి తన అస్త్రాల్ని, ఏ వ్యక్తి మీదా గురి పెట్టలేదు కాని 'భావకవిత్వం' అని అసముచితంగా పిలువబడే ఆధునికాంధ్ర కవిత్వంలోని కొన్ని విధానాల పట్ల ఎక్కుపెట్టాడు. భావకవుల కొత్త కవిత్వంలో ప్రాచీన సంప్రదాయానికి దూరమైన విడివిడి కవితలు ఇంగ్లీషు లిరిక్ కవితల మూసల్లో పోసినవి వున్నాయి. వీటిలో ప్రాచీన తెలుగు కవిత్వంతో పరిచయం లేని, తెలుగు భాషపై పట్టులేని ఔత్సాహిక కవులు రాసిన కవితలే చాలా వున్నాయి. పైగా భావకవులు తాము చెప్పదలుచుకున్న భావాల్ని వ్యక్తం చేయడంలో విఫలులైనారని చెప్పవలసి వుంటుంది." (అభిప్రాయాలు, పేజి: 1 )

వీళ్లేకాక గిడుగు రామ్మూర్తి పంతులు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, వజల చిన సీతారామ శాస్తి, పింగళి లక్ష్మీకాంతం ప్రభృతులు 'శుక్లపక్షము' ధోరణుల్ని ప్రస్తుతించారు. ఉ దాహరణకు గిడుగు వారన్న మాటలు చూడండి – "మొట్ట మొదటి పద్యము నుండి చిట్టచివరి పద్యము దాకా నాలో నేను ఆనందిస్తూ, కవి యొక్క ఉక్తి విశేషములు మెచ్చుకొంటూ చదివినాను, హాస్యములో మోటు తనము లేదుటీ మిక్కిలి నాజూకుగా ఉన్నది పరిహాసము" (అభిప్రాయాలు : పేజి: 2) ఇక కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారేమంటారో చూద్దాము. "శుక్లపక్ష" మను నీ ఖండకావ్యము నేడు భావకవుల మనుకొని యభావకవిత్వమును జెప్పువారిని బరిహసించును. లోకములో నిందార్హములగు కార్యము లగునప్పు







డిట్టి గ్రంథములు పుట్టుట స్వభావసిద్ధమే. ఆంధ్ర సారస్వతమున వ్యక్తుల నధిక్షేపించు గ్రంథములు లేకపోలేదు గాని యొక కవితా సంస్థను జమత్కారముగా నధిక్షేపించుచు విమర్శించు నీ 'శుక్లపక్షము' వంటి గ్రంథములు లేవని చెప్పవచ్చు. ఇట్టి కావ్య విరచనకు శ్రీ రామలింగస్వామి గారు మార్గదర్శకులని నాయభిప్రాయము." (పేజి: 4) ప్రసిద్ధ వైయాకరణులైన వజల చిన సీతారామశాస్త్రి గారిలా అన్నారు. **"భావకవిత లనబడుచు నేడు బయలు వెడలుచున్న ఖండకావ్యములలో ననేకము లభిప్రాయ వేదక శబ్ద సామగ్రీ పూర్ణములు కాక యర్థ వ్యక్తిగుణ భూషితములు కాకున్నమాట నిజమే. అట్టి వాని జక్కచేయుట కిట్టి విమర్శనము లావశ్యములే. ప్రాచీనాంధ్ర మహాకవులు కుకవి నిందారూపమున నేతాదృశ విమర్శనచ్ఛాయను జూపి యున్నను వాని యందిట్టి మార్దవసారస్య వైశాల్యములు లేమింజేసి మీ శుక్లపక్ష మపూర్వ సద్విమర్శన గ్రంథమని చెప్పుటకు సందేహము లేదు."** (పేజి: 7)

ఆంధ్రవిశ్వకళా పరిషత్తు తెలుగుశాఖలో ప్రప్రథమ ఉపన్యాస కులుగా చేరిన నవకవి. ఉదయోన్ముఖ విమర్శకులైన పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయ మిలా వుంది– "ప్రకృత కావ్యము భావ కవులలో దంభజాతిని గూర్చి ప్రయోగించిన పరిహాసోక్తి. ఆజాతి లక్షణములలో ముఖ్యమైనవి 'పాండిత్యలోపము' 'నియమోల్లంఘనము' 'ప్రాచీన కవి దూషణము' 'అన్యభావ చౌర్యము' 'ఆత్మవంచనము' లోనగునవి. ఈ దుర్లక్షణములు గల కవులను నిదివరకే పండితులు పల్వురు పలువిధముల దెగడుచుండిరి. కాని యా పండితుల విమర్శలు కేవలము తిట్టులబుంగలగుట సరసములు గావు.

ఇక రామలింగస్వామి గారి 'శుక్లపక్షము' కావ్యమర్యాదల పాటించిన విమర్శ గ్రంథము. ఇది వినువారికి వెగటుకొల్పని సరసమైన హేళన కావ్యము. ఇందు లక్ష్యభూతుడగు దంభ భావకవి కూడ దన వర్ణనను జూచి నవ్వవలసిన వాడేగాని, కినియ వలసినవాడు కాడు. దురాచారముల సంస్కరించుటకు నీ ప్రక్రియకు జాలిన, యమోఘాస్త్ర మింకొకటి లేదు." (పేజి: 9)

'శుక్లపక్షము' వెలువడ్డ ఏడాది కల్లా ప్రాచీన సంప్రదాయ్ సాహిత్య వేత్తలు ఈ కృతిని మనసారా ప్రశంసించారు. పాఠకుల ఆదరణ పొంది మరుసటి సంవత్సరమే 'శుక్లపక్షము' మరుజన్మ పొందగలిగింది (1933) అంతేకాదు, మరి రెండేళ్లకే ఈ అధిక్షేప కావ్యం ఆంధ్ర, మద్రాసు విశ్వవిద్యాలయ ఇంటర్ మీడియెట్, బి.ఏ. విద్యార్థులకు పాఠ్యపుస్తకం కావడం అంటే సంప్రదాయ వాద విద్వాంసులదే అకడమిక్ ప్రపంచంలో పై చెయ్యి అయిందన్న మాట. కాని భావకవులు, భావ కవితాభిమానులు మూగనోము వహించినా సమకాలంలో విజయలక్ష్మి భావకవుల్నే వరించిందని ఢంకా జజాయించి చెప్పొచ్చు.

ఇంతకీ మంచికవిత్వం రాయుగలిగిన అనంతపంతుల రామలింగస్వామికి భావకవిత్వంలో కనపడ్డ వికారాలు, వికృతులు ఏవంటారు? స్వాముల వారికి భావకవిత్వంలో భావము, వస్తువు, రచనా శైలుల పట్ల ఏవైనా అభ్యంతరాలున్నాయంటారా? భావకవిత్వానికి పేరు పెంపులు సంపాదించి పెట్టిన కృష్ణశాస్త్రి వ్యక్తిత్వం పట్లా, కవిత్వం పట్లానూ– లోప దోషాలు ఈయనకు నచ్చక పొయ్యాయంటారా? పింగళి లక్ష్మీకాంతం గారు భావించినట్లుగా భావకవుల్లోని దంభజాతిని ఈసడించుకున్నారా అనంతపంతుల వారు? అంతేకాదు, పింగళివారు దర్శించిన పాండిత్యలోపం, నియమోల్లంఘనం, ప్రాచీన కవి దూషణ, అన్యభావ చౌర్యం, ఆత్మవంచన మొదలైన దుర్గుణాలున్న భావకవిత్వాన్ని రామలింగస్వామిగారు **"కావ్యమర్యాదలు పాటించిన విమర్శగ్రంథము"** గా వెలయించారని సంభావిద్దామా? పరిశీలిద్దాం.

అనంతపంతుల రామలింగస్వామి 'శుక్లపక్షము'ను అధిక్షేప కావ్యంగా తీర్చిదిద్దటానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు, ఆయన కవితా సంపుటి 'కృష్ణపక్షం' మూల కారణాలు, భావకవి శేఖరులైన కృష్ణశాస్త్రి వ్యక్తి కేంద్రంగా కాకున్నా, 'కృష్ణపక్షం' మాత్రం ప్రధాన లక్ష్యంగా అనంతపంతుల వారు తమ 'శుక్లపక్షము' ను రూపొందించారు. ఈ కావ్యశీర్షికే రామలింగస్వామి గారికి భావకవిత్వం పట్ల వున్న అసంతృప్తిని, అసమాధానాన్ని, అవహేళనా వైఖరిని తెలయజేస్తుంది.

అనంతపంతుల వారు 'కుకవి' కవితలో తాను కుకవుల్ని పనికట్టుకొని తిట్టుచుండెడి వాడనని చెప్తూ తనకు కలలో ఒక కుకవి దర్శన మిచ్చి, తనతో కోపంగా సంభాషించిన వైనాన్ని రమణీయంగా చిత్రించారు. భావకవులు వర్డ్స్ వర్తు, సామ్యుయెల్, కాల్‌రిడ్జ్, కీట్సు, షెల్లీ మొదలైన ప్రకృతి ఆరాధకులైన గీతకవుల భావాల్ని గ్రహించి కవితలల్లారని ఈ అధిక్షేపకావ్యకర్త అభిశంసన. అనంతపంతుల వారికి స్వప్నంలో కుకవి ప్రత్యక్షమై ఈ విధంగా చెప్తాడు.

"ఒక్కని యర్థ మింకొకరు దుర్విని సంగ్రహణంబు సేయుటే
నిక్కము గానిచో దొలుత నీవు జనించిన నాడులేక నీ
కెక్కడి నుండి వచ్చెనిది యెంచుము, చౌర్యము లోకనైజమౌ
నొక్కడు చెప్పి చేకొను, ని కొక్కడు చెప్పక సంగ్రహించెడున్"
(శుక్లపక్షము. పేజీ: 6)

కొందరు పూర్వ లేదా సమకాలీన కవుల భావాల్ని చెప్పి మరీ వాడు కొంటే, ఇంకొందరు తెలివిగా చెప్పకుండా వాడుకోవడం సాహిత్య ప్రపంచంలో సహజమే అనడం కుకవి లౌక్యానికి పరాకాష్ఠ. భావానుసరణకు, భావ చౌర్యానికి చాలా భేదముందని అధిక్షేప కావ్యకర్త భావిస్తే, భావచౌర్యం లోకనైజమని కుకవి వాదన, నిశ్చితాభిప్రాయమును. అనంతపంతుల రామలింగస్వామి చాలా చాకచక్యంగా భావకవులు ఇంగ్లీషు సెలయేటి కవుల (లేక్ పొయెట్స్) రమణీయ, కమనీయ భావజాలాన్ని తమ కవితల్లో వాడుకున్నారని చెప్పారు. అధిక్షేపకవి తన్ను సేరుగా భావించి, కుకవిని సవాశేరుగా చిత్రించారు కవిత చివర్లో–

"ఇంక నే మన నతడెంచెనేమొ కాని
యంత గాకవు లార్చె గృహాంతికమున,
నిదుర చెదరెను, మేల్కాంచి నేను నాల్గు
దెసలు బరికించి కాననైతిని కుకవిని" (పేజీ: 8)

అధిక్షేప కవి కుకవిని తనకంటే చతురునిగా చిత్రించి తన ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించారిక్కడ. ప్రతిభా సంపన్నులు కాని నానావిధ బిరుదాంకితుల్ని అనంతపంతుల వారి తమ్ములైన వేంకటేశ్వర్లు 'వికటకవి' కవితలో నేరుగానే, దిటవుగానే ఎగతాళి చేశారిలా –

"కవి సింహము, కవినాగము
కవిశార్దూలము, కవికిటి కవిఖడ్గంబున్
కవివాజి మున్నుగా గల
కవిమృగముల నిర్వచింప గవి! నాతరమా?" (పేజీ: 14)

అకాల మరణం పొందిన అనంతపంతుల వేంకటేశ్వర్లు ప్రతిభా హీనులైన కవుల్ని సూటిగా పరిహసించారిలా –

"కవి భావసంపదన్ జెల
గి వచింపగ శక్తి లేక కృతి సేయని యా
కవితా మూకులు 'ముకవులు'
కవుల వెనుక నుత్తములు ముకవులే సుమ్మా !" (పేజీ:19)

వేంకటేశ్వరులు ఈ కవిత తిట్టుకవిత స్థాయికి దిగజారిందే కాని అధిక్షేప కావ్య సుస్థితిని సంతరించు కోలేక పోయింది. రామలింగ స్వామి తమ్ముడు వేంకటేశ్వర్లు రచించిన 'వికటకవి' కవిత 'శుక్ల పక్షము' ఘనతను తగ్గించిందనే చెప్పొచ్చు.

ప్రాచీనాంధ్ర కవుల్ని ఏభావ కవిగాని చిన్నచూపు చూసినట్లు లేదు. అయినా అగ్రజులైన రామలింగ స్వామిగారు అపాదించని అగౌరవాన్ని అనుజులైన అనంతపంతుల వేంకటేశ్వర్లు ప్రాచీన కవులకు అంటగట్టడం క్షంతవ్యమా? పైగా ఈ కళంకాన్ని భావ కవులకు ఆపాదించడం మరీ అన్యాయం.

రామలింగస్వామి గారు 'కవిరాజు' అన్న సుదీర్ఘ కవిత (పేజీలు : 22 నుండి 55 వరకు 33 పేజీల దాకా విస్తరించిన) లో కొండవీటి రెడ్డిరాజు అనవేమారెడ్డిని, కవిరాజు శ్రీనాథుణ్ణి, భావకవిగా అభాసు పాలైన ఓ పేద బ్రాహ్మణుణ్ణి సభాస్థలికి రప్పించి, కవికాని కవిని మహాకవిగా చిత్రింపచేయడంలో అధిక్షేపకవి అపహాస్యాన్ని పండించారు. కాని ఆ అకార్యం భావకవుల ఘనతను తగ్గించలేక పోయింది. అనంతపంతుల వారు కావ్య రచనా ప్రతిభాహీనుడైన ఒక పేద బ్రాహ్మణుణ్ణి అనవేమారెడ్డి సభలో నిలిపి 'భావగీతము' పేరిట ఈ గీతాన్ని అతని నోట వినిపింప చేశారీ విధంగా –

"కొండ మీద విన్న గూగూలు!
కొండక్రింద గన్న వాగూలు!
అప్పన్న చెవి నున్న పోగూలు!
అనవేమారెడ్డి యీగూలు! (పేజీ: 39)

ఈ కవితను విన్న రెడ్డిరాజు అనవేమారెడ్డి, సభాసదులు పగలబడినవ్వారు. పాపం, కవి ముఖం చిన్నబోయింది. అప్పుడు కవిసార్వభౌముడు శ్రీనాథుడు నిలిచి ఆ చిన్ని గోరంత కవితలో కొండంత అర్థం ఇమిడి వుందని ఈ సీసపద్యం వినిపించారు.

"కొండవీడ్రాజ్య సంకుచిత నామము కొండ
యంచు భవత్ర్యజ లాడుచుంట
గువ్వలు మీయావి గూర్చి గూగూలతో
స్వర్గస్థు లాలింప జాడుచుంట
తమ దానధారా జలము వాగులై రసా
తల మేగి మీయావి దెలుపు చుంట
ఆ కందుకూరు సింహాచల వ్యాప్తమై
భవదీయ రాజ్యంబు ప్రబలచుంట
ఎన్న సింహాద్రినాథు డప్పన్న చెవుల
దనరు బంగారు పోగులు తావకీన
భక్తి సంయుక్త వితరణశక్తి జాటు
చుంట యగు దీని భావమో యుర్వ"రేశ" (పేజీ:50) శ్రీనాథ మహాకవి వ్యాఖ్యానం విని రెడ్డిరాజు పేదకవి కవితా ప్రతిభకు మెచ్చి, ఘనంగా సత్కరించి పంపారు. అనంత పంతుల వారు "కొండ మీద విన్న గూగూలు!.........."

పద్యం లాంటి అపహాస్యాత్మక కవితలో మహత్తరమైన అర్థాన్ని చొప్పించి, పాఠకులకు మనోల్లాసం కలిగించారు. భావకవుల్ని పరోక్షంగా ఎత్తిపొడిచిన రామలింగ స్వామిగారు ఇలాంటి నాసిరకం కవితల్ని ఎక్కడైనా రాశారా? ఇటువంటి హీన రచనల్ని భావకవులకు అంటగట్టడం సబబా?

రామలింగస్వామి కవివర్యులు రాసిన 'భావకవిత్వము' అనే కవితలో ఆరు పద్యాలున్నాయి. మొదటి పద్యంలోని వ్యంగ్యం హద్దులు మీరిందే సుమా!

"రెండు కాకులు కూర్చుండె బండ మీద
నొం డెగిరిపోయె నంత నందొండు మిగిలె
రెండవది పోయె బిదప నందొండు లేదు
బండ మాత్రము పాప మందుండి పోయె" (పేజీ: 56)

'రెండుకాకులు' భావకవి చిత్రించిన ప్రేయసీ ప్రియులకు లేదా కవి, అతని భార్యకు ప్రతీకలు. ప్రేయసి లేదా భార్య మరణించిన తర్వాత ప్రియుడు లేదా భర్త అతీగతీ లేకపొయ్యాడని అధిక్షేప కావ్యకర్త కల్పించిన నీచోపమ, 'బండమాత్రము పాప మందుండి పోయె' అన్న కవి వాణి భావకవి జీవితం భార్యా వియోగం వల్ల బండపారి పొయ్యిందని చెప్తుంది. అనకూడదు కాని ఈ మాట ఒక ప్రసిద్ధ భావకవి తన భార్యను కోల్పోయి విరహ గీతాల్ని ఆలపించాడనీ. అతని జీవితంలో ఉగాదులు, ఉషస్సులు లేవని అధిక్షేప కావ్యకర్త ఆశయం. భావకవి నిరాశ నిస్పృహలో మునిగి విరహ గీతాన్ని రచించాడని భంగ్యంతర వాణి. ఈ 'భావకవిత్వము' కవితలోని చివరి పాదాలు చూడండి–

"అస్మదీయాంతరంగా పరాశ విమల
రాగ రేఖావిలాస విభ్రాజితముగ
బొనరు చుండియు దమమున మునిగి
మినుకు లలరునె తాను లేమిని పోయె జగాన? (పేజీ: 57)

భార్యావియోగాన్ని భావకవి రమణీయంగా చిత్రించాడన్న ఆరోపం. చివరి పంక్తిలోని అర్థాంతరన్యాస అలంకారం వాడి అధిక్షేపకవి భావకవిని ఎత్తిపొడవడం మనం ఈ కవితలో చూడగలం. అనంత పంతుల రామలింగస్వామి 'శుక్లపక్షము' రెండవ ముద్రణకు రాసిన పీఠికలో తాను భావకవిత్వంలోని Ugly elements (వికార అంశాల్ని) ఎత్తి పొడిచానే కాని ఎవరి మనస్సు నొప్పించేందుకు రాయలేదనడం భావ్యం కాదు. మొత్తం మీద ఈపద్యం సదభిరుచిని వెల్లడించదని చెప్పొచ్చు.

అధిక్షేపకవి రచించిన 16 పుటల దీర్ఘకవిత 'భావతురంగము'. కవి దీన్లో తనకు ఆరాధ్యమూర్తి, వికటకవిగా వాసికెక్కిన తెనాలి రామలింగని, ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో నిలుపుకొని భావకవిని హేళన చేశారు. 'భావ తురంగము' ప్రారంభ పద్యంలో తన్నుతానే భావకవిగా భావించి, సంభావించి ఇలా పలికారు–

"భావకవిత్వ సంపదల పారముగా గల ఖండ కావ్యముల్
నే విరచించి యన్నిటిని నీటగు పొత్తముగా ఘటించి సం
భావన జేయుచుంటిని విభావరి నాకృతి నామమే మనం
గావలె నంచు గొంతదను కన్‌బీవెనుకన్ గొనినాడ నిద్దురన్."
(పేజీ: 58)

అనంతపంతుల వారు తన్ను భావ కవిత్వాన్ని అపారంగా రాసిన కవిగా పేర్కొనడం భావకవుల్ని లేవిడీ చెయ్యడం తప్ప మరొకటి

కాదు. శ్రీకృష్ణదేవరాయల భువనవిజయానికి విచ్చేసి ఒక చిత్రకారుడు గుఱ్ఱం చిత్రాన్ని ప్రభువులకు అందించాడు. కళాపోషకుడైన రాయలవారు అలాంటి చిత్రపటాన్ని చిత్రించగలవా యని అడిగితే తెనాలి రామలింగకవి– ఈయన మరెవ్వరో కాదు– మన శుక్లపక్ష రచనా ధురంధరులైన అనంతపంతుల వారే – ఆ సభామంటపం గోడమీద ఒక బొమ్మ చిత్రిస్తే, దాని భావమేమిటో వివరించమని అడిగిన మూరురాయరగండనికి ఈ విధంగా సమాధాన మిచ్చారు.

"అడిగిన భావమున్ దెలుప నౌనటు లెందఱి కంట వీలగున్
బుడమిని, సాధ్య మద్ది యగు బో కృతికర్త గతించు వెన్కనే
వడువున నద్ది బోధపడు బాఠకు లెందును స్వీయశక్తి చే
దొడరి గ్రహింపగా వలె గృతుల్ బీ కృతిపాఠక ధర్మ మిద్దయే."
(పేజి: 66)

భావకవిత్వం పాఠకులకు సులభంగా బోధపడదనీ, భావకవి మరణించిన తర్వాత అది వాళ్లకు అర్థం కావొచ్చని అధిక్షేప కవి వ్యంగ్యం! కవితా ప్రియులకు అవగాహన కానంత క్లిష్టత భావకవిత్వంలో వుందంటారా? అనంతపంతుల వారిలా రాయడం సమంజస మంటారా?

శ్రీకృష్ణదేవరాయల వికటకవి తెనాలి రామలింగని కవితా ప్రాగల్భ్యాన్ని ఎరిగిన వాడై, ఇప్పుడు అతని చిత్రకళా ప్రావీణ్యాన్ని ఘనంగా ఇలా ప్రశంసిస్తారు –

"బళిరా! యింతటి దాక నీకు గవితా ప్రావీణ్యమే కల్గుటన్
దలతున్ జిత్రకళాధి దేవతయు నిన్ గామించుటల్ నేడు గా
తెలిసెన్ ............................" (పేజి: 71)

అంతేకాదు, సాహితీ సమరాంగణ సార్వభౌముడైన రాయలు తెనాలి రామలింగని కావ్యానికి నామకరణం చేశారిలా –

"భావతురంగ మంచు బరి పాటిగ నియ్యది పేరుగాంచి యిందే
విలసిల్లుగాక ............" (పేజి: 71)

భావకవుల కవితలు భావతరంగాలుగా ప్రసిద్ధి కెక్కాయి. అయితే మన అధిక్షేప కవిగారి కృతి 'భావతురంగము' వాసికెక్కుతుందని కృష్ణదేవరాయల వారి అనుగ్రహ వాక్యం. రాయల వారు సంతోషంతో పొంగిపోయి ఇలా అన్నారు.

".........................నీ
వీమహి నీదుపొత్తమున కింతట భావతురంగ నామ, మా
నామమె చాటు నీదు రచనాగత భావగభీర తత్వమున్ "
(పేజి: 73)

అనంతపంతుల కవి వతంసులు 'భావతురంగము' దీర్ఘకవితలో తన గురువైన, 'హాస్యవాచా చాతుర్యగుడై'న తెనాలి రామలింగ కవికి కైమోడ్పు చెల్లించాడు కవిత చివర్లో, మరో గమనార్హమైన విషయ మేమంటే ఈ కవితలో తనకు వికటకవి రామలింగని అభేదము కల్పించి తన్నుతానే ఎద్దేవా చేసుకొన్నారు రామలింగ స్వాముల వారు.

24 పేజీల కవిత 'భావకవి' 'శుక్లపక్ష' కావ్యంలోని ముఖ్యమైన భాగం అనంతపంతుల వారు ప్రాచీనాంధ్ర కవిత్వంలో నియమా లెక్కువని, భావకవులు నియమోల్లంఘనం చేసి ఘనులయ్యారని హేళనం చేశారీ కవితలో –

"సంస్కృతాంధ్ర కవిత్వ రచనము నందు
గోటి నియమము లుండుట గోటి కొక్క
డా పనికి బూనుకొను చుండె నాంగమందు
నట్లు గాకుంట హూణులం దధిక కవులు
కైతకును గట్టు బాట్లకు జ్ఞాతివైర
మౌట బ్రాచీన కవన మహ్లాద మిడదు
యతి నిరంకుశ కవుల నేననుగ మింతు" (పేజి: 79)

రామలింగస్వామి గారు భావకవులు కవిత్వ నియమాల్ని పాటించని సర్వతంత్ర స్వతంత్రులనీ, 'అతి నిరంకుశులని' భావించడం సముచితం కాదు.

భావకవుల్లో చాలా మంది– కృష్ణశాస్త్రి, వేదుల, నాయని మొదలైన వాళ్లు ఛందోనియమాల్ని పాటించిన ప్రవీణులే. భావకవులకు సంప్రదాయ విశృంఖలత్వం ఆపాదించుట న్యాయసంగతం కాదు. రామలింగస్వామి కవి వరులకు ఈ సంగతులన్నీ చక్కగా తెలుసు. అందువల్లే ఆ పుణ్యాత్ముడు భావకవుల్లో వున్నాయని తాను భావించిన లోపాల్ని తనకు కూడా వర్తింప చేసుకొని, స్వయంగా పరిహాసా స్పదులయ్యారు. చూడండి తనను తాను అనంతపంతులవారు ఎట్లా విడంబించుకున్నారో –

"వ్రాయగా వ్రాయగా నగు వ్రాత గాడు
పాడగ పాడగా నగు బాటకాడు
కైత జెప్పంగ జెప్పంగ గవియు గాన
గవిగరుత్మంతుడను గానొ కడగితుదకు" (పేజి: 78)

కావ్యశాస్త్ర పరిజ్ఞానం, పాండితీ ప్రకర్ష, కల్పనా చాతుర్యం ఇత్యాది సుగుణాల్లేకనే కవితలల్లి కాలక్రమంలో పేరు పెంపులు పొందవచ్చని అధిక్షేపకవి భావన. అంటే భావకవిగా ప్రఖ్యాతుడవటానికి ఎలాంటి యోగ్యత లవసరం లేదని, ఏవో ఏవేవో గీతాలు రాస్తే చాలని రామలింగ స్వామి గారు భావించినట్లు తోస్తుంది.

భావకవులు ఇంగ్లీషు గీతకవుల రచనల నుంచి భావాల్ని గ్రహించి భావ కవితలు వెలయించారని అనంతపంతుల వారి అభియోగం. ఆ భావం వ్యక్తమైన రీతిని చూడండి.

"మెండుగా భావములు రాక యుండునేని
యుండెగా హూణ కావ్యప్రకాండ మవని
నందుగల భావముల జేర్తు నాత్మకృతుల
దివిరి మద్భావ చౌర్యము దెలియనీక (పేజి: 81)

భావకవుల్లో కొందరు ఇంగ్లీషు రొమాంటిక్ కవుల కొన్ని భావాల్ని స్వీకరించి తెలుగు ప్రాంతాల పరిసరాలకు అనుగుణంగా కవితలు రాశారే కాని ఇంగ్లీషు కావ్యచౌర్యం చేయలేదన్నది వాస్తం.

శుక్లపక్ష కావ్యకర్త గోరంతలు కొండంతలు చేశారని – అవహేళనా దృష్టిలో అయినా సరే– చెప్పక తప్పదు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి ఉద్యోగ సద్యోగాలు లేకుండా, ఇల్లూ వాకిలీ, పెండ్లాం పిల్లల్ని పట్టించుకోకుండా భావకవిత్వ ప్రచారం కోసం బలాదూరై వూరూరు తిరగడాన్ని అనంతపంతుల వారు ఈవిధంగా అపహాస్యం చేశారు.

"తెలు గాడుటను వ్రాయుటను దెలియన్వలె
 నాంగ్లభాషాజ్ఞాన మవసరంబు
దేశాటనోత్కటా వేశ ముండన్వలె
 నుద్యోగమున బుద్ధి యుండరాదు
భావగీతాలను బాడు చుండన్వలె
 బూర్వకవుల దిట్టిపోయ వలయు
స్వేచ్ఛావిహారంబు చేయవలెన్, సభ్యు
 లొకరి నౌకరు మెచ్చుచుండ వలయు
నప్పకవి సెప్పినది యెల్ల దప్పవలయు
నరయ గర్ణద్వయము గప్పియాడు కురుల
చెంచవలె, నూత్న వేషంబు వేయవలయు
మాసమితి సభ్యులకు నియమంబు లివ్వి." (పేజి: 85)

ఈ సీసపద్యంలో రామలింగస్వామి గారు 'కృష్ణపక్షం' కర్త కృష్ణశాస్త్రిగారిని ఎత్తి పొడిచారని చెప్పాల్సిన అవసరం లేదు భావకవులు భావం, వస్తువు, రచనా శైలుల్లో ప్రాచీన సంప్రదాయ కవుల మార్గాన్ని వదలి కొత్తదారులన్వేషించారన్న మాట వాస్తవమే కాని వాళ్లను నిందించలేదు. అయినా అనంతపంతులవారు భావకవులకు ఆ కళంకం ఆపాదించటం న్యాయం కాదు.

అనంతపంతుల వారు భావకవులు నేర్చని అహం భావకవి పంథా అనుసరిస్తూ ఇలా అంటారు.

"పద్యశతమున వారు కావ్యంబు వ్రాయ
పద్యమొంటను నొక కావ్యభావ మడచి
వ్రాసినాడను గావున బద్దెమునకు
నొక్క పొత్తంబు బ్రచురించి యుంటి నేను." (పేజి: 87)

భావకవు లెవ్వరు కావ్యాలు కుప్పలు తిప్పలుగా రాయలేదు. అయినా అధిక్షేప కవి వారికి అదోష మంట గట్టారు. ఐతే దీన్ని భంగ్యంతరంగా భావించి అధిక్షేపకవి స్వోత్కర్షగా, దంబాలుగా స్వీకరిస్తే మేలు.

రామలింగస్వామి కవి ఇంత వరకు భావకవుల్ని ధ్వని గర్భితంగా అవహేళనకు గురి చేసి 'భావకవి' కవిత చివర్లో నేరుగానే వారిపై ఆక్రమణ చేశారిలా –

"కవి సృష్టిం గల యద్భుత ప్రకృతి శృంగారంబు ప్రచ్ఛన్నమై
నివుడం జేయు దమోవితాన మదే! కంటే! మెల్ల మెల్లన్ జవున్
చెవి సోకున్ దొలి కోడికూట యిక భూసీమన్ వసింపంగ రా
దవురౌ రా!మలికోడి కూత వినరా దాత్మీయ లోకాశ్రితుల్"
(పేజి: 97–98)

"దిగిరాను దిగిరాను దివి నుండి భువికి....అన్న కృష్ణశాస్త్రి మాటలపై విమర్శ ఈ పంక్తుల్లో కనపడు తుంది కదా! అంతేకాదు అధిక్షేపకవి భావకవి కొక సవాలు కూడా విసురుతాడిలా –

"....గమనోద్ధతి గ్రమ్మర కృష్ణపక్ష మందు దెరలి వచ్చి యాడెదమ
దూర్జిత పద్య వినూత్న భావసం పదల గ్రమంబుగా.............
(పేజి: 98)

అధిక్షేపకవి భావకవి కంటే గరిమా మయమైన కవితలు రచించగల నన్న ధీమా వ్యక్తం చేయడం మన మీకవితలో చూడొచ్చు.

భావకవిని నిందించడంలో అధిక్షేపకవి హద్దుల్ని అతిక్రమించాడని చెప్పినా తప్పు లేదని ఈ పంక్తులు తెలియచేస్తున్నాయి.

"అల్ల ముక్కాలి పీట సాయమున జేసి
యాంధ్ర పైశాచి భాషలో నతడు వ్రాయు
దేశభాషాహితోక్త సందేశరూప
పంక్తులకు దత్ క్షణమె ఛాయ వ్రాసినాడ" (పేజి: 99)

అనంతపంతుల రామలింగస్వామి భావకవులు డాంబికంగా వ్యవహరించి పాండిత్యలోపం, అన్యభావ్య చౌర్యం, ఆత్మవంచనం ఇత్యాది దుర్లక్షణాలు కలిగిన కవితలల్లారని పింగళి లక్ష్మీకాంతం గారు పేర్కొన్న విధంగా భావ కవితలు లేకున్నా, వాటిలో ఆ లక్షణాలు దర్శించిన విమర్శక కవి.

అనంతపంతుల రామలింగస్వామి 'కృష్ణపక్షం' ను గురి చేసుకొని 'శుక్లపక్షము' ను అధిక్షేప కావ్యంగా తీర్చిదిద్దారే కాని వైఫల్యమే మూటకట్టుకోగలిగారు ఈ కావ్యంలో వ్యక్తమైన భావనాశక్తి, వస్తుచిత్రణా యుక్తి, రచనా శిల్పాను రక్తులు గమనిస్తే, మౌలిక కావ్యాలు రచించి వుంటే ఆయనకు సాఫల్య సిద్ధి లభించి వుండేది.

కృష్ణశాస్త్రి , అనంతపంతుల రామలింగస్వామి ఇద్దరూ ఇద్దరే! దేవులపల్లి వారు 'కృష్ణపక్షం' రాసి శుక్లపక్ష చంద్రునిలా వెలిగారు, మరేమో రామలింగస్వామి గారు 'శుక్లపక్షము' రాసి కృష్ణపక్షంలోని చంద్రునిలా కనుమరుగయ్యారు. **'ఏమి సేయవచ్చు గాలమెవ్వరి నెంత సేసునో'!** అన్న తాళ్ళపాక వారన్న మాటలతోనే మనం పూరట చెందాలి మరి!

# పద్యమనోహరం - 44

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"ప్రేమము లేని కామము, కవిత్వము లేని పదాలు, శిక్షణా ధామము లేని గ్రామము, విధాన సభల్ కనరాని రాజ్యముల్ తామసియౌ గురుండును, మతాల కులాల చరించు జాతి, చింతామయమై నశించు గదా! దాశరథీ! కరుణాపయోనిధీ!"**

తెలుగునాట సుప్రసిద్ధమైన శతకం కంచర్ల గోపన్న రచించిన దాశరథీ శతకం. దాదాపుగా కొన్ని తరాల వరకు ప్రభావితం చేసిన ఆ శతకం యొక్క మకుటం "దాశరథీ కరుణాపయోనిధీ!". ఈ మకుటాన్నే స్వీకరించి సుప్రసిద్ధ ఆధునిక కవి, పోరాట యోధుడు, నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించి, తన కవిత్వంచేత లోకాన్ని చైతన్యవంతం చేసే ప్రయత్నం చేసిన "దాశరథి" గారు రచించిన "అభినవ దాశరథీ" శతకంలోని పద్యాలన్నీ నేటి సమాజానికి, నేటి ప్రజాజీవనానికి అద్దం పడుతూ రచింపబడినవే. అందులోని ఈ పద్యం కూడా ఆ కోవలోనిదే.

**"ప్రేమలేని కామం, కవిత్వం లేని పదాల కూర్పు, విద్యాశిక్షణ నిచ్చే విద్యాలయాలు లేని గ్రామము, విధానసభలు లేని రాజ్యాలు తమోగుణం కలిగిన గురువు, మతాలతో, కులాలతో నిత్యం ఘర్షణ పడే సమాజం – ఇవన్నీ కష్టాలపాలై నశించిపోతాయ"**న్న భావంతో రాసిన యీ పద్యం పూర్వ శతక కారుల ధోరణిలో సాగి, నేటి సామాజిక అవసరాన్ని నొక్కి చెప్పిన పద్యం.

సుసంపన్నమై, కలతలు లేని మానవత్వంతో నిండిన మానవ సమాజం కొరకు తపించిన కవి దాశరథి కృష్ణమాచార్యులు. తన రచనలన్నీ ఆ దిశగానే రచించి తెలుగునాట కీర్తి సంపాదించుకొన్ని మహాకవి. అందుకే మహాకవి దాశరథి మానవజాతికి ఒక గొప్ప సందేశాన్ని ఈ పద్యం ద్వారా ఇచ్చే ప్రయత్నం చేశారు.

మానవుల్లో కామభావన సహజ లక్షణం కావచ్చు. కాని దాని పునాది ప్రేమలో ఉండాలన్నారు. కాని పక్షంలో అది కేవలం పైశాచికమైన తుచ్ఛకామంగానే మిగిలిపోతుంది. ఇది సమాజానికి హానికరం. అదే విధంగా కవిత్వం ఎవరైనా రాయవచ్చు. కాని అది ఏమాత్రం కవిత్వ స్పర్శ లేని పదాల కూర్పుగానే మిగిలిపోతుంది తప్ప ఎవ్వరినీ కదిలించలేదు. విద్య మనిషికి ప్రాథమిక అవసరం. కాబట్టే, ప్రతి గ్రామంలోనూ ఒక విద్యాలయమైనా ఉండి తీరాలి, కాకపోతే భావితరాలను సరియైన దారిలో పెట్టి వారి ఉజ్జ్వల భవిష్యత్తుకు మార్గం వెయ్యాలి. ప్రజలకు మేలు చెయ్యాలన్నీ, ప్రజా






సంక్షేమానికి పాటు పడాలన్నీ పాలకులు నిర్ణయాలు తీసుకోడానికి ఏ రాజ్యానికైనా విధాన నిర్ణయ సభలు విధిగా అవసరమే! విద్యాబోధన చేసే గురుస్థానీయుడైన వ్యక్తిలో తామసగుణం పనికిరాదు. అది విద్యార్థులపై దుష్ప్రభావాన్ని చూపించడమే గాక, సమాజాన్ని వక్రమార్గం పట్టించే అవకాశం ఉంది. కులమతాలన్నవి వ్యక్తిగతమైన అంశాలు. వాటిని అడ్డు పెట్టుకొని మనుషుల మధ్య చీలికలు తెచ్చేవిధంగా పాలకులు గాని, పెద్దలు గాని వ్యవహరింపరాదు. దానికి కారణం సమాజం చీలికలై ఉత్తమ సామాజిక జీవితమే విచ్ఛిన్నమై జాతి యావత్తూ నిర్జీవమైపోతుంది అన్న అనేక ఉత్తమ విషయాలను ప్రవచించి, ఇటువంటి అవలక్షణాలున్న ఏ సమాజమైనా, ఏ జాతియైనా పతనమై, బాధాకరమైన రీతిలో సర్వనాశనమై పోతుందన్న గట్టి హెచ్చరిక కూడా ఈ పద్యం ద్వారా చేసిన మానవతావాది మహాకవి దాశరథి.

శతకాల ప్రయోజనమే మానవ సంక్షేమం. తొలినాటి నుండి నేటివరకు కూడా అత్యధిక శాతం శతక కవులు మానవ సంక్షేమమే లక్ష్యంగా శతక రచన చేశారు. భక్తిమార్గంలో పరిపూర్ణుడై మానవుడు దైవమార్గంలో ప్రయాణించడం ద్వారా సమాజహితమైన ఆలోచనలు చేస్తాడు. నైతిక విలువలు బోధించే శతకాలు మనిషి ఆలోచనలను ప్రభావితంచేసి అతనిని పెడమార్గం నుండి ఉత్తమ మార్గంలో నడిపిస్తాయి. ఆ ప్రయత్నంలో భాగంగానే దాశరథిగారు ఈ అభినవ దాశరథీ శతకం రచించి తమకున్న మానవత్వ హృదయాన్ని ఆవిష్కరించుకున్నారు.



# నా పద్య రచనకు ప్రేరణ దాశరథి పద్యాలే!

## డా. అయాచితం నటేశ్వర శర్మ

"నిండు కుండ తొణకదు, ఖాళీ కుండ శబ్దం చేయకుండా ఉండదు. ఇత్తడి చేసే శబ్దం పుత్తడి చేసే దానికన్నా ఎక్కువ" అన్నట్లుగా ఉంటుంది మన తెలుగు కవుల, రచయితల విధానాలు. వాటిపద్ధతిలోనే అవార్డులు, ఆదరణలు కూడా. అక్షరాలను ఉపాసిస్తూ, కవిత్వం కోసమే జీవిస్తూ ఉన్నవారు అలస్యంగా అయినా అందరికంటే ప్రకాశంగా, చిరకాలం వెలుగొందుతారు. డా.అయాచితం నటేశ్వర శర్మగారు విద్యార్థి దశలో ఎత్తిన కలాన్ని ఎనిమిది దశాబ్దాల వయసులో కూడా ఆపకుండా అక్షరయజ్ఞం చేస్తూనే ఉన్నారు. శ్లోకం, పద్యం, గేయం, వచనం, వ్యాసం ఏ ప్రక్రియను తీసుకున్న వారికి ఒక ప్రత్యేక స్థానాన్ని భద్రపరుచుకున్నారు. యాభైకి పైగా పుస్తకాలు. 120కి పైగా అవధానాలు చేసి తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చినవారు. వీరు సంస్కృత పండితులుగా, మహా అవధానిగా, అధ్యాపకులుగా, ఆధ్యాత్మికవేత్తగా, ప్రాచార్యులుగా, ఓరియంటల్ విభాగాధిపతి (డీన్) గా సేవలందిచిన వారు. ఆలస్యంగా అయినా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతి ఏటా అందిస్తున్న 'దాశరథి కృష్ణమాచార్య పురస్కారం' 2023 సంవత్సరానికి వరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ వారితో ..... మూసీ ముచ్చట.

డా. అట్టెం దత్తయ్య, సహాయాచార్యులు, శ్రీ వేంకటేశ్వర కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం, 949771 5445




**1. 2023 సంవత్సరానికిగాను దాశరథి అవార్డు మిమ్మల్ని వరించినందుకు మీరూ పొందిన ఆనందాన్ని మాతో పంచుకుంటారా?**

**అయా:** తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ ప్రకటించే ప్రతిష్ఠాత్మకమైన దాశరథి పురస్కారం ఈ ఏడాది (2023) నాకు ప్రకటించి, ప్రదానం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఈ అవార్డును నాకు ఇవ్వడంలో మూలకారకులైన మాన్య ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి నా ధన్యవాదాలు. ఈ అవార్డు నాకు ఆల్యంగా వరించినా, అమృత ఫలంగా లభించిన పురస్కారంగా నేను అనుభూతిని పొందాను.

**2. మీ రచనావ్యాసంగం ఎప్పుడు మొదలైంది? ప్రేరణ ఎవరు?**

**అయా:** నా రచనావ్యాసంగం నా 12వ ఏటనే ప్రారంభమైంది. 1967లో నేను తిరుమలలోని శ్రీవేంకటేశ్వర వేదసంస్కృత పాఠశాలలో సంస్కృతం ఎంట్రెన్స్ కోర్సులో చదువుకుంటున్నప్పుడు మా కళాశాల ప్రాచార్యులు శ్రీమాన్ కృష్ణస్వామి అయ్యంగారు ప్రతివారం విద్యార్థులలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు వక్తృత్వాన్నీ, కవితా రచనలను పోటీలుగా నిర్వహించేవారు. 'విద్యాభివర్ధినీ సభ' అనే పేరుతో సాగే ఈ పోటీలలో నేను పాల్గొనే వాణ్ణి. అప్పుడే నాకు సంస్కృత శ్లోకరచనలో ప్రావీణ్యం కలిగింది. అలా నేను రచనా వ్యాసంగంలోకి అడుగుపెట్టాను. నా కవితా రచననకు ప్రేరణ మా గురువులే.

**3. ఇంటిలో పెద్దవారుగా మీరు అనుభవించిన కష్టాలు, సుఖాలు, బాధ్యతలను గూర్చి తెలుపండి!**

**అయా:** మాది మధ్యతరగతి కుటుంబం. నా తండ్రి ఉపాధ్యాయుడు. ఆయనకు నెలకు 120 రూపాయల వేతనం మాత్రమే ఉండేది. నాకు ముగ్గురు తమ్ముళ్ళు, ఒక అక్క, ఒక చెల్లెలు. మాది పెద్ద కుటుంబం. నా తండ్రి చాలీచాలని జీతంతో మమ్మల్ని అందరినీ పోషించేవారు. నా బాల్యంలో మేము అనుభవించిన కష్టాలు ఇంతా అంతా కావు. కానీ మానాన్నగారి దూరదృష్టి, ఆత్మధైర్యం మమ్మల్ని ముందుకు నడిపించింది. ఇంతటి కష్టావస్థలో కూడా మా కుటుంబంలో ఆనందోత్సాహాలకు కొరత ఉండేది కాదు. మమ్మల్ని అదరించే బంధుగణం, శ్రేయోభిలాషులు ఎందరో మా కుటుంబాన్ని కష్టాలలో ఆదుకున్నారు. నేను మా కుటుంబంలో పెద్దకొడుకును కావడం వలన నాకు బాధ్యతలు ఎక్కువగానే ఉండేవి. మా సోదరులు, సోదరి నా అండదండలతో, ప్రోత్సాహంతో చదువులలో రాణించి, ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఇప్పుడు మా కుటుంబంలో ఏ లోటూ లేదు.

**4. మీ పరిశోధన ప్రస్థానాన్ని గురించి కొన్ని మాటలు చెప్పండి!**

**అయా:** నా పరిశోధన ప్రస్థానం 1986లో ప్రారంభమైంది. మొదట నేను ఉస్మానియావిశ్వవిద్యాలయంలోని సంస్కృతశాఖలో పిహెచ్.డి. పరిశోధనకోసం దరఖాస్తు చేసుకొన్నాను. అప్పటి

శాఖాధ్యక్షులు ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు. వారిని కలిసినపుడు వారు నాకు పరిశోధనాంశంగా **'మహాభారతంలో తాత్వికాంశాల పరిశీలన'** అనే విషయాన్ని సూచించారు. కానీ నాకు ఆ సంవత్సరంలో సీట్ల కొరత కారణంగా అవకాశం లభించలేదు. ఆ తరువాత శాఖధ్యక్షులైన ఆచార్య ప్రమోద గణేశలాలే గారి సూచనతో ఎం.ఫిల్.చేయాలని నిర్ణయించుకొన్నాను. సీటు దొరికింది. **'ఆముక్తమాల్యద చంపూకావ్య పరిశీలనము'** అనే అంశంపై ఎం.ఫిల్. కోసం పరిశోధన చేశాను. 1988లో నాకు ఎం.ఫిల్. అవార్డు అయిది. వెంటనే 1989 లాలే గారి ప్రోత్సాహంతో **'సౌందర్యలహరి – ఒక అధ్యయనం'** అనే అంశంపై పిహెచ్.డి. కోసం ప్రయత్నించాను. ఆచార్య కప్పగంతుల కమలగారి పర్యవేక్షణలో 1994లో నాకు డాక్టరేటు పట్టా లభించింది. ఇదీ స్థూలంగా నా పరిశోధన నేపథ్యం. ఆ తరువాత వివిధ సందర్భాలలో, వివిధ పత్రికలలో నా విమర్శ వ్యాసాలు ప్రచురితమయ్యాయి. నిత్యశోధన నా సాహిత్య జీవితంలో ఒక భాగమైపోయింది.

**5. మీ పిహెచ్.డి. పరిశోధనకు బంగారు పతకం వచ్చినట్లు తెలుసు. మీ పరిశోధనను గూర్చి రెండు మాటలు....!**

**అయా:** సౌందర్యలహరిపై నా పరిశోధనకు స్వర్ణపతకం వచ్చింది. ఈ పరిశోధన నాలో అనేక విధాలుగా మార్పును తెచ్చింది. శంకర భగవత్పాదుల అద్భుతశక్తి, స్తోత్రాలలో 'సౌందర్యలహరి' అగ్రగణ్య మైంది. ఈ స్తోత్రానికి పది ప్రసిద్ధవ్యాఖ్యానాలున్నాయి. ఈ స్తోత్రం అంతా తంత్ర, యోగ, సాహిత్య శాస్త్ర వైభవాలకు నిలయం. ఒక్కొక్క శ్లోకంలో గల అద్భుత రచనాశక్తిని అర్థం చేసుకోవడానికి ప్రముఖ విద్వత్కవి దోర్బల విశ్వనాథ శర్మ వంటి వారిని ఆశ్రయించి, అధ్యయనం చేయవలసి వచ్చింది. ఆచార్య కమలగారు నన్ను చక్కని సూచనలతో ముందుకు నడిపించారు. నాలుగు సంవత్సరాలు పట్టుదలతో కృషిచేసి, పిహెచ్.డి. పట్టాతో పాటు స్వర్ణపతకం కూడా సాధించాను.

**6. సంస్కృత పండితులైన మీరు తెలుగు పద్యరచనకు పూనుకొనడానికి ప్రేరణ ఎవరు?**

**అయా:** నేను తిరుపతిలో ప్రాచ్యకళాశాలలో చదువుతున్నప్పుడు తరగతులు లేని విరామ సమయంలో మా కళాశాల గ్రంథాలయానికి వెళ్ళేవాణ్ణి. అక్కడ దాశరథి, సినారెల సాహిత్య గ్రంథాలు లభ్యమయ్యాయి. దాశరథి పద్యాలను చదివినప్పుడు నేను కూడా అలాంటి పద్యాలను రాయాలని తపంచేవాణ్ణి. ఆ తపన నన్ను పద్యకవిత్వంలోకి దారితీయించింది. నిత్యం నిరంతరం పద్యాలు రాయడానికి నేను చేసిన సాధన నన్ను ఈ దశలో నిలబెట్టింది. నా పద్యరచనకు ప్రేరణ దాశరథి పద్యాలే.

**7. మీరు అవధానులు కూడా కదా. దానిని గూర్చి రెండు మాటలు!**

**అయా:** నేను కామారెడ్డి ప్రాచ్యకళాశాలలో సంస్కృతాచార్యునిగా ఉద్యోగం చేస్తున్నప్పుడు నా సహవ్రతులైన డా॥ వాచస్పతిగారితో సాహచర్యం వలన అవధానంపై ఆసక్తి కలిగింది. అవధాని శశాంక, శతావధాని గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ గారు మా కళాశాలలో అవధానం చేసినప్పుడు వారి అవధానంతో ముగ్ధుడనై నేనూ అలా అవధానం చేయాలని సంకల్పించుకున్నాను. డా. వాచస్పతిగారి ప్రోత్సాహంతో ఎన్నో అవధానాలు చేశాను. మొత్తం 120 వరకు అవధానాలు చేశాను. సంస్కృతంలో ఆన్‌లైన్‌లో ఒక శతావధానం కూడా చేశాను.

**8. వాచస్పతిగారితో కలిసి చేసిన జంట అవధానాలలోని కొన్ని జ్ఞాపకాలను పంచుకుంటారా?**

**అయా:** డా॥ అవధానం రంగనాథ వాచస్పతిగారంటే నాకు అమితమైన ప్రేమ. వారి స్నేహంతోనే నేను చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆయన కదిలే పద్యం వంటివారు. ఏ విషయాన్ని అయినా సమగ్రంగా తెలుపగల నడిచే విజ్ఞాన సర్వస్వంగా ఉండేవారు. వారితో గల స్నేహసాహచర్యంతో జంటగా అవధానాలు చేసే అవకాశం లభించింది. పద్యపూరణలలో, ధారణలలో మా ఇద్దరి ప్రదర్శన అతికినట్లు ఉండేది. ఇది ఆశ్చర్యకరం. మాలో సమాన భావాలుండడమే కారణం. అలా మేము అన్ని అవధానా లనూ చేశాం. బీబీపేటలో ఒక రోజు ఇద్దరం కలిసి గంటలో అవధానం చేశాం.

**9. మూడు దశాబ్దాలకుపైగా అధ్యాపకవృత్తిలో ఉన్నమీరు ఎలాంటి అనుభూతులను పొందారు?**

**అయా:** 1977 నుండి 2014 వరకు నేను కామారెడ్డిలోని ప్రాచ్యవిద్యాపరిషత్తు ప్రచ్యకళాశాలలో సంస్కృతాధ్యాపకునిగా పని చేశాను. 37 సంవత్సరాల సుదీర్ఘమైన అధ్యాపకవృత్తి నన్ను అపూర్వానుభూతులను పంచింది. విద్యార్థులకు పాఠ్యబోధనలో నేను ఎంతో సంతృప్తిచెందేవాణ్ణి. పూర్వాధ్యయనం లేకుండా ఏనాడు నేను పాఠం చెప్పలేదు. అదే నా అధ్యాపక నిబద్ధతకు ఉదాహరణ. నా పాఠంతో నా విద్యార్థులు ఎంతో నేర్చుకున్నారని ధైర్యంగా చెప్పగలను.

**10. సాయంప్రాచ్య కళాశాలకు, ప్రాచార్యులుగా, ఓరియంటల్ డీన్‌గా మీ అనుభవం?**

**అయా:** ప్రాచ్యకళాశాలలో నేను ఏడు సంవత్సరాలపాటు ప్రధానాచార్యునిగా పనిచేశాను. నా సహోపన్యాసకులు నాకు సంపూర్ణంగా సహకారాన్ని అందించారు. మేమంతా ఏకకుటుంబ సభ్యులుగానే పనిచేశాం. నా ప్రాచార్యవృత్తిలో కళాశాలకు ఎంత సేవచేయాలో అంతకంటే మిన్నగానే చేశాననే సంతృప్తి నాకు మిగిలింది. ఓరియంటల్ డీన్‌గా నా అనుభూతి అనిర్వచనీయం. తెలుగు, సంస్కృతం, మరాఠీ, హిందీ, ఉర్దూ, అరబిక్ భాషలలో గల ప్రాచ్యకళాశాలలన్నీ నా పర్యవేక్షణలో ఉండేవి. ఇప్పటికీ

వాళ్ళందరూ నన్ను దీవిస్తున్నారంటే నేను డీన్‌గా నా సేవలను నిజాయితీగా అందించాననే సంతృప్తిని పొందుతున్నాను.

**11. మీరు ముద్రించిన తొలి రచనకు సంబంధించిన అనుభూతిని మాతో పంచుకుంటారా?**

**అయా:** నా తొలి ముద్రిత రచన **'వసంతకుమారి'.** ఇది గేయరూపకం. వసంత ఋతువులోని రమణీయ శోభలను వర్ణించిన ఈ రూపకానికి నా అభిమానకవి డా. సి. నారాయణ రెడ్డిగారు కవితాత్మకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇది 1981లో ముద్రితమైంది.

**12. మీ పద్యకావ్యాల ప్రత్యేకతను గూర్చి వివరిస్తారా?**

**అయా:** నేను రచించిన సంపూర్ణ పద్యకావ్యాలు రెండు. మొదటిది శ్రీవేంకటేశ్వర విలాసము. ఇది ఏడు ఆశ్వాసాల ప్రబంధం. ఒక్కొక్క ఆశ్వాసానికి ఒక్కొక్క కొండచొప్పున ఏడు కొండలపేర్లను ఏడు ఆశ్వాసాలుగా రూపకల్పన చేశాను. శ్రీ, శేషశైల, గరుడాచల, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి ఖండాలుగా విభక్తమైన కావ్యం ఇది. రెండవది 'శకుంతల' ఇది మహాకవి కాళిదాస కృతమైన 'అభిజ్ఞాన శాకుంతలమ్' నాటకానికి పద్యరూపానువాదం. ఇది కూడా ఏడు ఆశ్వాసాలతో ఉంది. మూలనాటకంలో ఏడు అంకాలు, నా పద్యకావ్యంలో ఏడు ఆశ్వాసాలుగా రూపొందాయి. ఈ రెండూ నాకు పద్య ప్రబంధకవిగా పేరు తెచ్చిన సృజనలు. ఇవే కాకుండా పద్యశతకాలు, ఖండకావ్యాలు ఎన్నో రాశాను. వాటిలో 'ఋతుగీత', 'సమయవిలాసిని', 'భారతీప్రశస్తి' వంటివి కొన్ని.

**13. మీరు రాసిన తెలంగాణ సుప్రభాతం, కాలభైరవ సుప్రభాతం చాలా ప్రాచుర్యాన్ని పొందాయి కదా. వాటిని గూర్చి రెండు మాటలు చెప్పండి.**

**అయా:** నా కాలభైరవ సుప్రభాతం రామారెడ్డిలోని కాలభైరవుని వైభవాన్ని తెలుపుతూ, అక్కడి అశేషభక్తజనులకు పఠనయోగ్యమై ఆదరణ పొందింది. ఈ సుప్రభాతాన్ని నా గళంతోనే ధ్వనిముద్రణచేసి, ప్రతినిత్యం ఆ క్షేత్రంలో భక్తులకు వినిపిస్తుండడం నాకు సంతోషాన్నిచ్చింది. 'తెలంగాణ సుప్రభాతం'లో తెలంగాణలోని వివిధ చారిత్రక, సాంస్కృతిక, సామాజిక వైభవాలను పరిచయంచేస్తూ, 'తెలంగాణ భూమాతృకే! సుప్రభాతమ్' అనే మకుటంతో తెలంగాణ తల్లికి మేల్కొలుపు చెప్పడం కనబడుతుంది. దీనిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారే మధుర గాయినీగాయకులతో స్వరకల్పన చేయించి, ధ్వనిముద్రితం చేయించారు. నా రచనలలో ఇదొక అపూర్వ ఘట్టం.

**14. దాశరథిగారితో మీకున్న అనుబంధం?**

**అయా:** 1974లో నేను 'విక్రాంతిగీతి' అనే కవితా సంకలనం కోసం దాశరథిగారికి లేఖ రాశాను. అదే నా తొలి అనుబంధం. వారు నా కవితలను చదివి బాగున్నాయని ఆశీర్వదించారు.


































అచ్చుప్రూఫు?లు వచ్చాక పంపిస్తే అభిప్రాయం రాస్తానన్నారు. కానీ నేను దానిని అచ్చువేయలేకపోవడంతో రాతప్రతిరూపంలోనే ఉండి పోయింది. మా కళాశాల రజతోత్సవాల సందర్భంగా 1996లో మా కళాశాలకు దాశరథిగారిని ముఖ్యాతిథిగా ఆహ్వానించడానికి నేను, మా కళాశాల విద్యార్థి సంఘాధ్యక్షుడు సత్యనారాయణతో కలిసి బషీర్‌బాగులో ఉండే మాతృశ్రీ అపార్టుమెంటులో ఉన్న దాశరథి గారిని కలవడానికి వెళ్ళాము. వారు మమ్మల్ని ఆప్యాయంగా పలుకరించి, విషయం అడిగారు. కానీ మేము కోరిన రోజున రాలేననీ, మీరట్ విశ్వవిద్యాలం నుండి గౌరవ డాక్టరేట్ స్వీకరించడానికి వెళ్తున్నాననీ చెప్పడంతో, మా కళాశాల వార్షిక సంచిక కోసం సందేశం రాసివ్వుమని కోరగా, ఆ తరువాత వారు పంపారు. అది 'మనస్విని' అనే మా కళాశాల వార్షిక సంచికలో అచ్చయింది. ఇలా వారితో ఈ రెండు పర్యాయాలే అనుబంధం ఉంది.

**15. సంస్కృత పండితులైన మీరు సాంకేతిక మాధ్యమాలతో కూడా ముందంజలో ఉన్నారు. ఇదెలా సాధ్యం?**

**అయా:** నాకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఎంతో ఆసక్తి. నా సృజనలను, కళలను సాంకేతికంగా అందరితో పంచుకోవాలనే తపనతో కంప్యూటర్‌ను వినియోగించే వాణ్ణి. ఇప్పుడు సెల్‌ఫోన్‌లే కంప్యూటర్లుగా పనిచేస్తున్నందువల్ల, దాని ద్వారా సులభంగా నా సృజనలను ఎప్పటికప్పుడు అందరికీ పంచగలుగుతున్నాను. ఇది నాకెంతో సంతృప్తిని కలిగించింది.

**16. మేడం (అరుణకుమారి) గారు కూడా కవయిత్రి కదా! మీ శిక్షణ ఏమైనా ఉందా?**

**అయా:** నా శ్రీమతి అరుణకుమారి సహజంగానే కవనం, కథారచన, లలిత సంగీతం పట్ల అభినివేశం కలిగిన వ్యక్తిత్వం కలిగి ఉంది. నా శిక్షణ లేకుండానే ఆమె ఎన్నో సృజనలు చేసింది. ఆమె ముద్రితకవితా సంపుటి 'అరుణ కిరణాలు'. పత్రికలలో చాలా కథలు ముద్రితాలయ్యాయి. రేడియోలో కూడా సాహిత్య ప్రసంగాలు చేసిన అనుభవం ఉంది.

**17. సంస్కృతం, తెలుగు సాహిత్యాలతో బాటు కొంత సంగీత పరిజ్ఞానం కూడా ఉంది. దానిని గూర్చి వివరిస్తారా?**

**అయా:** నాకు శాస్త్రీయ సంగీత పరిజ్ఞానం లేదు. లలిత గీతాలను రచిస్తూ, నచ్చిన తీరులో పాడుకోవడం అలవాటైంది. అంతేతప్ప నేను సంగీతంలో ఓనమాలు కూడా నేర్వనివాణ్ణి.

**18. మీ చేతిరాత అంత అందంగా ఉండడం ఎలా సాధ్యమైంది? మీరు ఇచ్చే ముందుమాటలను మీ చేతిరాతతోనే ప్రింటు చేసుకుంటారు చాలామంది.**

**అయా:** నాకు చేతిరాత నా స్వయం సాధనతోనే సాధ్యమైంది. మా నాన్నగారి దస్తూరీ అందంగా ఉండేది. ముత్యాలపేరు వలె ముచ్చటగా ఉండేది. ఆయన నుండి వారసత్వంగా లభించిన ఈ గుణాన్ని నేను సాధనతో వన్నెలు దిద్దుకున్నాను. చేతిరాత అందంగా ఉండాలనీ, నిర్దుష్టంగా ఉండాలనీ మా నాన్నగారు చేసిన ఉపదేశాన్ని నేను పాటిస్తున్నాను. అందువల్లనే నా చేతిరాతకు ఆకర్షితులై యథాతథంగా తమ పుస్తకాలలో అచ్చువేసుకుంటున్నారు.

**19. 'మూసీ' పత్రికతో మీకున్న అనుబంధాన్ని వివరిస్తారా?**

**అయా:** 'మూసీ' నా అభిమానసాహిత్య పత్రిక 'భారతి' తరువాత ఆ స్థాయిలో ఈ పత్రికను నిర్వహిస్తున్న సంపాదకులు ఆచార్య సాగి కమలాకరశర్మగారు అభినంద్యులు. ఎందరినో విద్యుత్కవులుగా తీర్చిదిద్దుతున్న మూసీతో నాకు ఎన్నో ఏళ్ళుగా అనుబంధం ఉంది. నేడు తెలుగు సాహిత్యాన్ని రక్షిస్తూ ప్రచారం చేస్తున్న అపురూప పత్రిక 'మూసీ'.

**సాగి,నవీకల్పనల సాధనజేసెడి పండితాళికిన్**
**దాగిన సాహితీ నిధులు దారతనిచ్చెడి 'మూసి'వాసిలో**
**సాగుచు, నిత్యశోధకుల స్పందనలన్ గొనుటే వరమ్ముగా**
**స్వాగతమొప్పు నిల్చిన విశారద 'మూసి'ని ప్రస్తుతించెదన్!**



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2023

# "పోతన చరిత్రము" మహాకావ్యం – తెలంగాణ స్పృహ

**డా. ఎం.వి. పట్వర్ధన్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల. ఫోన్ : 939 375 1540



**"ధర నుపాధ్యాయు డెదొ యొక తరుణమందు-**
**బ్రాంత పరిమిత జనులకు పాఠ మిడును**
**గాని సత్కవివాణి శిక్షణమొసంగు-**
**సకల కాలమ్ములందు విశ్వప్రజలకు"** అంటారు అభినవ పోతన బిరుదాంకితులు, మహాకవి కీ.శే.వానమామలై వరదాచార్యుల వారు (16-08-1912 నుండి 31-10-1984). కవులు ప్రపంచాని కంతటికీ గురువులే. వారిని ఒక ప్రాంతానికి పరిమితం చేయడం ప్రాథమికంగా సరికానప్పటికీ, ప్రపంచానికంతటికీ చెందిన కవులూ, కళాకారులపై కూడా తత్కాలీన సామాజికస్పృహ, తమ పరిసరాల ప్రభావం, అస్తిత్వ ప్రకటనాకాంక్ష ప్రభావాలు తప్పకుండా ఉంటాయనేది నిర్వివాదాంశం. ఈ దృష్టితో ఆచార్యుల వారి "పోతన చరిత్రము" ఆధునిక తెలంగాణా తొలి మహాకావ్యంలోని తెలంగాణ స్పృహను రేఖామాత్రంగా పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం, ఆంధ్రపురాణం, రాణాప్రతాపసింహ చరిత్ర, సౌందరనందము మొదలైనవి మహాకావ్యాలుగా పేరొందాయి. ఈ కోవలోనే రాశిలోనూ, వాసిలోనూ మేటిగా నిలిచి పన్నెండు ఆశ్వాసాలుగా 3786 గద్యపద్యాల్లో విస్తరించబడిన మహాకావ్యం 'పోతన చరిత్రము'.

**కావ్య నిర్మాణ హేతువు- తెలంగాణ స్పృహ :** చాలాకాలం వరకూ తెలంగాణా ప్రాంతంలో కవులు లేరన్న ఒక అభిప్రాయం ఉండేది. దాన్ని పటాపంచలు చేస్తూ, 354 మంది ఆధునిక కవులతో సురవరం ప్రతాపరెడ్డి గారి సంపాదకత్వంలో వచ్చిన గోలకొండ కవుల ప్రత్యేక సంచిక (1934) కు కొనసాగింపు కృషిగానే వరదాచార్యుల వారు ఈ పోతనచరిత్రమును రచించినట్లు తెలుస్తున్నది.

**"...రాణాప్రతాపసింహ చరిత్రము, ఆంధ్రపురాణము, మొదలగు కృతులు తామీకోవకు జెందివే. వీనిలో కొన్ని సర్కారు జిల్లాలకు, మరికొన్ని రాయలసీమకు చెందిన కవివరులు వ్రాసినవి. కానీ ఈ శతాబ్దిలో తెలంగాణము నుండి మహాకావ్య నిర్మాణము జరగలేదేమో యని నా హృదయము శంకించినది. ఇట్లని నేను విశాలాంధ్ర నుండి తెలంగాణమును వేరుజేయుటలనుకొనరాదు. ఆంధ్రదేశపు ప్రతివిడి భాగము విద్యావివేకముల కాలవాలమై కళాఖండనిర్మాణమునకు సమర్థమైనదిగా నుండవలెననియే. అంగములలో ఏ అంగము బలహీనము కారాదని ఈ వెలితిని పూరించనుద్యమించితిని. కానీ సముచితమైన ఇతివృత్త ముపలభ్యమగుటకై చాలాకాల మన్వేషించ వలసి వచ్చినది."** అని ఆచార్యులవారు తాము పోతన చరిత్రమును వ్రాసిన ప్రధాన కారణాన్నివివరిస్తారు. **"నేను తెలంగాణా కవిసమాజానికి ప్రతినిధిని'** అన్న సంపూర్ణస్పృహతో మాత్రమే వారు పోతన కావ్యాన్ని రచించారు. 1940 సంవత్సరం ఉస్మానియా తెలుగుశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కొందరు కోస్తాంధ్ర కవులు చేసిన **"తెలంగాణప్రాంతం నుండి మహా కావ్యరచన సాధ్యం కాదు"** అనే వ్యాఖ్యలు కూడా ఆచార్యుల వారిని బాధించి, మహాకావ్యరచనకు ప్రేరేపించాయని తెలుస్తున్నది.

ఏదైనా మహాకావ్యాన్ని వ్రాయాలని సంకల్పించాక **"ఏ కథను ఎన్నుకోవాలి?"** అన్న ప్రశ్న ఆచార్యుల వారిని కొన్నేళ్ళు వెంటాడింది. పోతరాజుతో పాటు గోపరాజు, త్యాగరాజులు కూడా ఆచార్యులవారి దృష్టిలో ఉన్నారు. ముగ్గురి చరిత్రలనూ ప్రబంధాలుగా వ్రాయాలని వారు సంకల్పించుకున్నప్పటికీ మునుముందుగా తెలంగాణ మహాకవి పోతనగారి చరిత్రాన్ని వ్రాయాలని ఎంచుకున్నారు.. అంతకు ముందు జాషువాగారి ఫిరదౌసీ మినహా తెలుగుకవుల చరిత్రలు కావ్యాలుగా రాలేదు. ఫిరదౌసీ చదివాక రాజుల దుర్మార్గ ప్రవర్తనకు ఆచార్యుల వారు చలించిపోయారు. అందుకే **"రాజులను ధిక్కరించి, వారి నిరంకుశ చర్యల నసహ్యించుకొని, కవితాకన్యకు కర్షకవృత్తితో నుపజీవికను గల్పించిన యాత్మాభిమానము రక్షించుకొనిన మహాకవిశేఖరుడు పోతనార్యుడు కండ్లగట్టె. ఆశకు లొంగని వానికి, ఈశిత్వము లొంగునని చూపించిన పోతరాజే నిజమైన రాజని తలచితిని"** అంటారు ఆచార్యులవారు.

పోతనగారు తెలంగాణాలోని బమ్మెర గ్రామానికి చెందిన వాడని, కడపలోని ఒంటిమిట్టకు ఎలాంటి సంబంధం లేదనీ, దూపాటి వేంకట రమణాచార్యులు వారు కీలకమైన ఆధారాలతో నిరూపించిన నేపథ్యంలో **"తమ ప్రాంతీయుడైన పోతన పవిత్ర చరిత్రకు మహాకావ్య రూపాన్ని సంకల్పించాలని వరదన్న సంకల్పించారు. ఈ లక్ష్య ఫలమే పోతన**

**చరిత్రము"** అంటారు. డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి గారు.

అయితే పోతనను తెలంగాణాకు చెందిన బమ్మెరవాడిగానే చిత్రించినప్పటికీ ఆచార్యులవారు కొంత సమన్వయ దృక్పథాన్నే పాటించారు. **"ఓరుగల్లు- ఏకశిల' అను పదములయందలి సరైన పోలిక నరసి, పోతన బమ్మెర దగ్గరి యోరుగల్లు వాడేయను చారిత్రిక సిద్ధాంతమును విశ్వసించి, నేను నటులే వ్రాసితిని. కాని యాంధ్ర భాగవత కృతిని గూర్చి యావదాంధ్రుల కభిమాన పాత్రుడగు పోతన మహాకవి తానాంధ్రభూమిలోని యే ప్రాంతమునకు జెందినవాడైనను నాకు సమ్మతమే"**అంటారు. ఇలా అనడమే కాక పోతన తెలంగాణా లోని బమ్మెర గ్రామంలో పుట్టినప్పటికీ కొంతకాలం కడప జిల్లాలోని ఒంటిమిట్టలో నివసించినట్టూ, అక్కడి రాముడికే తన భాగవతాన్ని అంకితమిచ్చినట్టుగా చేసిన కల్పన ఒక పెద్దసర్దుబాటు. ఆనాటి ఆంధ్రావళి మోదానికి ఈ సర్దుబాటు అవసరమైంది.

వానమామలై వరదాచార్యుల వారు తమ ఈ తెలంగాణాస్పృహను కేవలం కావ్యానికి ఇతివృత్తం ఎన్నుకోవడం లోనే కాక కావ్యాంతర్గతం గానూ అవకాశమున్న ప్రతిచోట ప్రతిబింబించి, ప్రదర్శించారు.

**1) తెలంగాణా కవుల స్తుతి :**

తెలంగాణా కవుల గూర్చి ఆచార్యుల వారు తమ కావ్యావతారికలో

**"ఎక్కడనున్న సద్గుణము లేనియు నౌదల దాల్చు టందు వే**
**రొక్కని గాంచి ముందర నహో యని వెన్నల వెక్కిరింపకే**
**మక్కువ భ్రాతృవత్సలత మత్సరమున్ విడనాడి యుంటలో**
**నిక్కపు టొజ్జ బంతులయి నిల్చెద రీ తెలగాణ సత్కవుల్"** అనీ,

"సరళ హృదయు లాత్మస్తుతి- పరాఙ్ముఖులు గర్వ రహిత ప్రతిభాఢ్యులు దం- భ రహితులీ తెలగాణ- న్వెలయు కవులు తొలకనట్టి నిండుఘటమ్ముల్" అని తెలంగాణాకవులకు ప్రయోగించి చెప్పిన ప్రతిసుగుణమూ, ప్రతివిశేషణమూ ఇంకా ఏదో బయటకు చెప్పలేని విషయాన్ని అన్యాపదేశంగా చెపుతూనే ఉన్నది.

ఆచార్యుల వారు తమ పీఠికలో ఎందరో తెలంగాణా కవులను స్తుతించారు. ఆనాటికే గేయసాహిత్యంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరుచుకున్న సి.నా.రె.ను **"కావ్య సురనదీ జలపాత గతుల క్షితిని - నందన మొనర్చు నారాయణుం దలంతు"**(1-40) అని ప్రశంసిస్తారు. అదేవిధంగా **"రుద్రవీణాశృతి స్వరారోహణముల దమి మహాంధ్రోదయ ప్రభాతముల బాడి - యగ్నిధారాశరాహతి నధమ గర్వ- శరధి నింకించు శరధి దాశరథి నెంతు"** (1-41) అని దాశరథినీ ప్రశంసిస్తారు. కాళోజీని గూర్చి చెబుతూ **"వేమన హృదయుని నభినవ- వేమనను, ప్రజాకవీంద్రు వినుతచరిత్రున్ - ధీమహితుని గాళోజీ నామాంకితు వినుతిజేతు నారాయణునిన్"** అని ప్రస్తుతిస్తారు. ఆ తరువాత కాళోజీ రామేశ్వర్ రావు, పొట్లపల్లి రామారావులను, అభ్యుదయకవి స్తుతిలో భాగంగా పేర్కొంటారు.

**'తెలంగాణా పండితకవి స్తుతి'** అన్న ప్రత్యేక శీర్షిక పోతన చరిత్రములో ఉంది. దీనిలో ప్రాచీనులైన లాక్షణికుడు అప్పకవి, కిరీటి వెంకటాచార్యులు, బాలసరస్వతి బుక్కపట్టణం శ్రీనివాసా చార్యులు, మరింగంటి సింగనాచార్యుడు మొదలైన తెలంగాణా కవులను ప్రశంసిస్తారు. ఆ తరువాత కాళిదాసు సాహిత్యానికి వ్యాఖ్యాత గా జగత్ప్రసిద్ధులైన కోలాచల మల్లినాథ సూరిని, మరింగంటి వెంకటేశ్వర, నరసింహాచార్య కవులను, ఆధ్యాత్మ రామాయణం కర్త మొత్కూరి పాండురంగ కవిని, ఆంధ్ర కవితా పితామహుడు మాడపాటి హనుమంత రావును ప్రశంసిస్తారు. తమ పోతనచరిత్రము ముద్రితం కావడానికి తోడ్పడ్డ బూర్గుల రామకృష్ణారావు గారంటే ఆచార్యుల వారికి ఎనలేని అభిమానం. అందుకే **"కృష్ణరాయలె రామకృష్ణరాయలు కాగ బూర్గుల వంశ సంభూతుడయ్యె, నా యింటి దీప రక్షకు డాయెను"** అంటారు. అదేవిధంగా సురవరం ప్రతాపరెడ్డిని గూర్చి **"రుద్రాంశుడు ప్రతాపరుద్రుండె సురవరమ్మున బ్రతాపుడుగాగ మూర్తిజెందె"** అని తమ అభిమానాన్ని చాటుకుంటారు. ఇంద్రద్యుమ్నీయం వ్రాసిన చందా కేశవరావును పేర్కొంటారు.

ఒద్దిరాజు కవులుగా పేరొందిన సీతారామచంద్రరావు, రాఘవ రంగారావులను, ఆంధ్ర బిల్హణ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిని, యాయవరం రామశాస్త్రి, కేశవ పంతుల నరసింహ శాస్త్రిని, గార్లపాటి రాఘవరెడ్డిని, ముసిపట్ల పట్టాభిరామారావు, ఉదయరాజు శేషగిరి రావులను స్మరిస్తారు. తమ సోదరులైన వానమామలై వెంకటా చార్యులు, లక్ష్మణాచార్యులు, జగన్నాథాచార్యులను. భక్తిపూర్వకంగా స్మరించుకుంటారు. కోరుట్ల కృష్ణమాచార్యులు, చిలుకమర్రి రామానుజాచార్యులు, పల్లా దుర్గయ్య, బిరుదరాజు రామరాజులను అభినుతిస్తారు. అదేవిధంగా ఆనాటికి యువసాహిత్యమూర్తులైన కోవెల సుప్రసన్నాచార్యులు, కోవెల సంపత్కుమారాచార్యులు, వేముగంటి నరసింహాచార్యులను కూడా పేర్కొంటారు. గతంలో ఏ కావ్యంలోనూ లేనివిధంగా ఇంత సుదీర్ఘంగా కవుల జాబితాను పేర్కొనడం **"నేను నా తెలంగాణా కవులను సగర్వంగా పరిచయం చేస్తున్నాను"** అన్న పూర్తి ఎరుక మాత్రమే!

**2) ఆచార్యుల వారి తెలంగాణా ప్రాంత, సాంస్కృతిక సంకీర్తనం:**

ఆచార్యుల వారికి తమ నేల మీద విపరీ తమైన అభిమానం. వారు తమ నేలను మనస్ఫూర్తిగా ప్రేమించారు. అందుకే,

"ధర నెలోరా యజంతా గుహాగర్భాల
వరశిల్పబాలకు బురుదు వోసె
క్షోణిపై నొక చిన్న సూర్యుడై ప్రభజిమ్ము
కోహినూర్మణి నెత్తుకొనుచు మురిసె
శ్రీమదేకశిలాపురీ స్తనాగ్రమ్మున
భాగవతము కుగ్గు పాలువోసె

కాకతిసామ్రాజ్య కాంతామతల్లికి
రాతికోటల నంగరక్ష జేసె
లలిత లావణ్య సకల కళాప్రవీణ
ప్రథిత విజయవిలాస సంపత్కృపాణ
ధర్మ సందీప్త రాజ్య తంత్రముల జాణ
మా తెలంగాణ ముక్కోటి మణుల వీణ" (1-58) అని దాశరథిగారి లాగే ఆత్మాభిమానంతో చెప్పగలిగారు. "మా తెలగాణ పోతన సమాన మహాకవి గాంచునంతగా బూతచరిత్ర యయ్యె" (1-59) అని పొంగిపోతారు. ఏకశిలానగర వర్ణన సందర్భంలో తెలంగాణను నిర్వచిస్తూ -

**"శ్రీనిధి కాకతి రాజ్యర- మా నిర్మిత రాజధాని మహితైకశిలా- ఖ్యానగరమ్మా దేశము - దేనియ మాగాణ మెందు దెలగాణ మనన్"** అంటూ తెలగాణను తేనెవంటి మాధుర్యం కలదిగా పేర్కొంటారు.

జాతరలు తెలంగాణా సంస్కృతిలో ఒక అవిభాజ్యమైన భాగం. బమ్మెరకు దగ్గరలోని పాల్కురికి శైవ జాతరను ప్రత్యేకించి వర్ణిస్తారు. **"భూమియె ఈనెనో యిసుక వోసిన రాల దుసిల్ల పుట్టలై- చీమల బారులై జనము చేరగ సాగిరి యంటు ముట్టులన్- నేమము వీడి యాడ మగ నిర్ణయముల్ విడనాడి త్రోపులన్- స్వామిని జేరి దర్శనము సల్పుచు వెనకాల వారి నిల్పుచున్"** అంటూ స్వభావోక్తితో, ఎంత రద్దీగా ఉందో వర్ణిస్తారు. ఆనాటి తెలంగాణా అంగళ్ళు, ఎలా ఉండేవి, ఏమేమి నగలు ధరించేవారు, ఎలాంటి తినుబండారా లుండేవి మొదలైన విస్తారమైన విశేషాలను ఈ సందర్భంలో గమనించవచ్చు. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బసివిరాండ్రు, శివసత్తులను వర్ణిస్తారు.

"జడలతో బూది బొట్లతో స్వకరమంటు
ముమ్మొనల వాలుతో రాగి సొమ్ము తోడ
గక్క వ్రేలెడి జోలతో కరము లెత్తి
దిశల శివసత్తులై తూలు బసివిరాండ్రు "(1-138) .

తెలంగాణా ప్రాంతీయాభిమానంతో సమయ సందర్భాలను కుదిరించుకొని తెలంగాణా గ్రామాలను, పుణ్యక్షేత్రాలను వర్ణించారు ఆచార్యుల వారు. బమ్మెర గ్రామాన్ని గూర్చి వర్ణిస్తూ -

"భాగవత కర్త యుత్తమ భాగవతుండు
సహజపాండితీ ప్రతిభా విశాలయశుడు
బమ్మయే పోతనాఖ్యతో బ్రభవ మందె
ననగ బమ్మెర యన నొప్పు జనపదమ్ము"(1-82) అని వర్ణిస్తారు.

తెలంగాణలో మొదటినుండీ ధార్మికకేంద్రంగా పేరొందిన మంథనిని వర్ణిస్తూ **".... మంత్రకూట మన బొల్పెసలారు ద్విజాగ్రహారమై - ఘనతర వేదశాస్త్రచయ కల్పకమై స్వరసాహితీ కళా - ధనదుల కాస్పదంబు ప్రథితమ్మగు స్కాందపురాణగాథలన్"** (5-187) అంటూ దాని చారిత్రికప్రశస్తిని కూడా వివరిస్తారు. తమ స్వగ్రామమైన మడికొండ (మెట్టు కుధరము)ను **"అంబర చుంబి శైల శిఖరావళి తొండము లెత్తి దిక్కరీం- ద్రంబులు మంద గొన్నటుల ధాత్రిని వెల్గెడి నీ నగేంద్రపృ- ష్ఠంబున మందిరద్వితయ సౌష్ఠవముల్ శివకేశవైకమ- త్యంబును మెట్టుతీర్థ విజయంబును జాటు ననారతంబునున్"** అని దర్శింప జేస్తారు. (9-5), ఆచార్యులవారి జననం, విద్యాభ్యాసం, సరస్వతీ సాక్షాత్కారంకోసం తపస్సు మొదలగు ముఖ్యఘట్టాలన్నిటికీ ఈ మడికొండ గ్రామమే కేంద్రం.




**3. తెలంగాణా ప్రజాకవిగా పోతనకవి పాత్ర చిత్రణ :** ఈ కావ్యంలో ఒక అచ్చమైన ప్రజాకవిగా పోతన పాత్రను తీర్చిదిద్దారు ఆచార్యుల వారు. ఆనాటి నిజాం నిరంకుశత్వాన్ని నిర్భీతిగా ఎదిరించిన దాశరథి, కాళోజీ, వట్టికోట ఆళ్వారుస్వామి మొదలైన ప్రజాసాహిత్యకారుల వీరగాథా స్ఫూర్తి కనబడుతుంది.

"ఒరుల రాజ్యాన మీ ముందు వారము గాము
యేలగా బదములు చాల గలవు
ఒకరి ప్రభుత్వాన నొదిగి యుండము మేము
గురులఘు గణపాలకులము గాన
అన్నవస్త్రాలకై యాచింప మన్నుల
నవరసామృత భోజన మిడగలము
అర్థార్జనమ్ముకై యర్థింప మొరుల స
కల విధార్థాలంకృతు లిడగలము
స్వీయ తాళపత్ర కుటీరసీమలందు
నఖిల భూతకోటికి నమరాశ్రయమిడి
శాశ్వతము బ్రోచు సత్కవీశ్వరుల మేము
దైన్యమున బడియుండ మితర గృహాల" (4-351) అన్న ఈ పద్యం లో ప్రచారపటాటోపానికి దూరంగా, నిరాడంబరుడైన తమ లాంటి సగటు

తెలంగాణ కవి ఎలా ఉంటాడో అక్షరాల చిత్రించారు ఆచార్యుల వారు.

**4) తెలంగాణా పలుకుబళ్ళ ప్రయోగం :** పోతన చరిత్రము ప్రాచీన ఫక్కీలో వ్రాయబడ్డప్పటికీ, ఆచార్యుల వారు భాషావిషయంగా చాలా సాధికారతను సాధించారు. ప్రసక్తానుసారంగా తెలంగాణా పలుకుబళ్ళను ప్రయోగించారు.

**"కుక్కను బిల్వనా యనుచు గోమటి యొక్కడు వచ్చి, తాత సొ- మ్మిక్కడ దాచి బెట్టినటులేమొ పడిపడి బుక్కెదేయి కా- ల్మొక్కెద నవ్వ నంచు నిలు ముంగిట బాతిన యట్టు లుంటి పొ- మ్మెక్కడి కేనటంచు బిగియించుకొనెన్ దలుపుల్ ధధాలునన్"** (5-238), "ఇంటింటి కరుగుచును మీ బంటుకు బానిసను గింతబారెయ్యవ్వా! కుంటోణ్ణి పున్నె ముంటది యంటయు నే తల్లికిన్ దయలు రావయ్యెన్" (5-28) వంటి తెలంగాణ మాండలీక పద్యాలు ఇందుకు ఉదాహరణలు. ఇదేవిధంగా **"దూకులెగురు లందు దొండు మెండుగ బడి".** (1-12)"- తొండుమెండుగ అంటే ముడుచుకొని పెద్దపాటు పడుట అని, ఎటుఁశమల్ బడ నోటి కందు నొక బుక్కెదు. కూడు.... (8-88)- బుక్కెదు అంటే బొక్కెదుకు రూపాంతరం. ఇంకా ఇలాంటివి చాలా ఉదాహరించవచ్చు.

అన్నివిధాల పరిపూర్ణమైన తెలంగాణ స్పృహతో, ఆధునిక కాలంలో తెలంగాణలో నిర్మించబడ్డ తొలి మహాకావ్యం వానమామలై వారి "పోతన చరిత్రము".

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. వానమామలై వరదాచార్యులు, పోతన చరిత్రము మహాకావ్యం, తి.తి.దే ప్రచురణలు, 2011, ప్రథమ ముద్రణ 1969.

2. డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, అభినవపోతన వానమామలై వరదాచార్య జీవితం-సాహిత్యం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, మార్చి 2014

3 డా. అందె వేంకట రాజము, వరదాచార్యుల కృతులు- అనుశీలనము, మహేశ్వరీ గ్రంథమండలి,కోరుట్ల, ఫిబ్రవరి 1986.

# విలాప గీతం

కులం, మతం
రెండు అవిభాజ్య శక్తులై
భారతావని స్తనాలపై
రెండు జెండలుగా విర్రవీగుతూన్నాయి
పైశాచికత్వం పెచ్చుమీరి
వీర మాతను వివస్త్రను చేసి ఊరేగిస్తూ
ఎండిపోతున్న గుండె నుండి
ఎర్రటి నెత్తుటిపాలని పీల్చి పీల్చి పిప్పిచేసి
మానవ మృగం మానభంగం చేస్తుంటే
అవనితల్లి అచేతనావస్థలో
ఎన్ని సార్లు బుక్కబట్టి ఏడ్చి చచ్చిందో
ఏ నరమేధ నాజీలకు తెలుస్తుంది...

అలనాటి భారతంలో
కంటికి కనిపించని ద్రౌపది ఒక్కరే
కానీ...నేటి నా భారతావనిపై
పాచికలాటలో ప్రతి ఒక్క ఆడది
ఒక్కో పాంచాలిగా ఊరేగింపబడుతుంది

ఆరేళ్ల చిన్నారి నుండి
ఆరు పదుల అమ్మమ్మ వరకు.. ఆడదైతే చాలు
క్షణం క్షణం ..అనుక్షణం
రాకాసి మూకల ఆనవాళ్లు
ఆమె అణువణువునా
చెరపలేని గుర్తులుగా చెక్కబడుతున్నాయి
అసలే కంప్యూటర్ కాలం కదా
కనులతో కాన్పులు చేస్తూ
కసాయి నాయకులు తిరుగుతున్న దేశం నాది..
అందుకే నన్ను క్షమించు తల్లీ
ఈ వైరాగ్యాన్ని వేయి కనులతో చూస్తున్నందుకు..!!

ఆమె నెలసరి నెత్తుటి గుడ్డల వాసనతో
మత్తులో మునుగుతున్న మూర్ఖుల్లారా
ఒక్కసారి మీ మనోనేత్రాన్ని తెరచి చూడండి
ఈ సారి బ్రతకడానికి కాదు
చావడానికి బ్రతకాలి
మరొక్కసారి మిమల్ని రక్షించడానికి
ఏ అమ్మవారి గర్భం అండగా లేదు
ఎందుకంటే
ఆవిర్భావం..అంతం..
రెండు ఆమె చేతిలోనే ఇమిడి ఉన్నాయి కనుక..

**జి. గోపి**
905 287 1896

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఆగస్టు : 2023

# బంజారాల భాగ్య విధాత "శ్రీ వసంత్‌రావ్ నాయక్"

**దేపావత్ శిల్ప,** ఫోన్ : 912 158 8396

భారతదేశంలో ఎందరో నాయకులు ప్రజాహితం కోసం పాటుపడ్డారు. స్వాతంత్ర్యోద్యమ ఉదాత్త ఆశయాల సాధనకై అహర్నిశలు శ్రమించారు. హృదయ స్వచ్ఛతతో నిస్వార్థంగా తమ సేవలనందించారు. అటువంటి కోవలో ముందువరుసలో నిలబడ్డవారు మహానాయక్ అని ప్రజల చేత ప్రేమగా పిలవబడ్డ శ్రీ వసంత్ రావ్ నాయక్. సదా సాటి జనులకు మంచి చేయాలనే తలంపుతో తన జీవితాన్ని ప్రజాసేవలోనే గడిపిన మహావ్యక్తి ఆయన.

వసంత్ రావ్ ఫూల్ సింగ్ నాయక్ ఆయన పూర్తిపేరు, మహారాష్ట్ర రాష్ట్రం యవత్మాల్ జిల్లా పుసాద్ తాలుకాలోని గహులిలో జూలై 01, 1913లో ఒక నిరుపేద బంజారా కుటుంబంలో జన్మించారు. బతకడానికే నానా అవస్థలు పడే బంజారాల సమాజంలో పుట్టి తానూ పుట్టిన సమాజం, తన స్వంత సమాజంతో పాటు మనుగడ సాగిస్తున్న సాటి సమాజం కోసం నిరంతరం ఆలోచించేవాడు అతడు. తన బాల్యం, విద్యాభ్యాసం కూడా చాలా ఇబ్బందుల మధ్య కొనసాగింది. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అన్న చందంగా తాను ఎంతోకష్టపడి చదువుకున్నాడు వసంత్ రావ్. విత్తోలి అమరావతిలో మాధ్యమిక విద్యను పూర్తిచేశారు. ప్రజల కష్టాలకు చలించిపోయేవాడు ఆయన. వారి అభ్యున్నతికి ఏదైనా చేయాలనే తపనను చిన్నతనంలోనే తన మనసులో స్థిరపరుచుకున్నాడతడు. 1940లో నాగపూర్లోని మోరీస్ కళాశాల నుండి బి.ఎ. స్నాతకపూర్వ విద్యను పూర్తిచేసి బంజారా సమాజం నుంచి గ్రాడ్యుయేట్ పట్టా పొందినవాడిగా ఖ్యాతికెక్కాడు. అనంతరం లా పట్టాను సాధించాడు. నాడు ఈ విషయం అంతటా చర్చనీయాంశంగా నిలిచింది. నాగపూర్ లో ఉన్నప్పుడు ఘూటే ఇంటిపేరు గల బ్రాహ్మణ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ కుటుంబపు అమ్మాయి అయిన వత్సలాతాయితో 1949లో తనకు ప్రేమ వివాహం జరిగింది. వత్సల ఆయన ఆదర్శాలకు తోడు నిచ్చింది.

వసంత్ రావ్ గారు తన తొలినాళ్ళలో తాను అభిమానించిన నాయకుడు, ప్రజావాది డా. పంజాబ్ రావ్ దేశ్‌ముఖ్ గారి మార్గదర్శనంలో న్యాయవాదిగా తన పోరాట జీవితాన్ని ప్రారంభించారు. పుసాద్, నాగపూర్ లను తన కార్యక్షేత్రంగా మలుచుకొని దీనజనులకు న్యాయం అందించడానికి తనదైన శైలిలో శ్రమించారు. తానూ పుట్టిన బంజారా సమాజాన్ని అభివృద్ధిలోకి తీసుకురావడానికి, వారి పేదరికాన్ని దూరం చేయడానికి గాను తాను పాటుపడుతూనే బంజారా ప్రజలను జ్ఞానాత్మకంగా చైతన్యపరిచేవాడు. ఎప్పుడైతే పేదరికం తొలగిపోయి ప్రజలు







అభివృద్ధికి దగ్గరవుతారో నాడు సమాజ కళ్యాణం సాధ్యమవుతుందని నమ్మేవారయన. అందుకు విద్య ఒక్కటే ఆయుధమని ప్రబోధించేవారు. మొదటినుండి ఇటువంటి కష్టాలుపడి వృద్ధిలోకి వచ్చి సమాజాభివృద్ధి, వికాసం, పీడిత జనుల సముద్ధరణ కోసం పాటుపడిన మహాత్మా జ్యోతిబా పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ లు అందరికి ఆదర్శమని సభావేదికలపై చెప్పి ప్రజల్ని ఆలోచింపజేసేవారు. దేశసంక్షేమం కోసం పాటుపడ్డ మహాత్మాగాంధీ, వికాసిక ఆలోచనలు గల జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి వారి ఆదర్శాలను మనసా వాచా కర్మణా పాటించిన వాడు వసంత్ రావ్.

ఆధునిక మహారాష్ట్ర నిర్మాతగా పేరుపొందిన వసంత్ రావ్ సకల జనుల హితం కోసం రాజకీయాలే ఏకైక మార్గమని తలచారు. తాను పుట్టి పెరిగిన పుసాద్ తాలుకా నుండే తన రాజకీయ అరంగేట్రం చేశారు. ముందుగా తన తండా మరియు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేసి అందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం 1946 లో పుసాద్ నగర పరిషత్ కు జరిగిన ఎన్నికల్లో తన ప్రతివాదులను ఓడించి నగర పాలికా అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. తనదైన పద్ధతుల్లో పుసాద్ నగరాన్ని అభివృద్ధికి చేరువచేశారు. తండా సమాజాల్ని విద్యవైపు, వికాసం వైపు నడిపించాడు. తర్వాత 1952లో అవిభాజ్య మధ్యప్రదేశ్ తత్కాలిన విధానసభ ఎన్నికల్లో అత్యంత ఎక్కువ మెజారిటీతో గెలుపొంది దేశ రాజకీయాలపై తనదైన ముద్రను వేశారు.

1956 నవంబర్ 01 వ తేదిన మధ్యప్రదేశ్ లో ఉన్న నాగపూర్, విదర్భ వంటి ప్రాంతాలను కలిపి ఏర్పడ్డ ద్విభాషిక ముంబై రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన యశ్వంత్ రావ్ చౌహాన్. వారి క్యాబినేట్‌లో సహకార శాఖామాత్యులుగా వసంత్ రావ్ నాయక్ పదవీ ప్రమాణం చేశారు. విభిన్నంగా ఆలోచించే ఈయన పనితనం






మూలంగా సహకార రంగంలో మహారాష్ట్ర ఎంతో అభివృద్ధిని సాధించింది. గ్రామాల్లో సహకార చక్కర కర్మాగారాలు, పాడి పరిశ్రమ వృద్ధికి నిధుల్ని కేటాయించి పాల ఉత్పత్తి కేంద్రాల స్థాపనకు కారకులయ్యారు.

శీఘ్రకాలంలోనే అంటే 1957లో ఆయనకు అత్యంత ఇష్టమైన వ్యవసాయ శాఖకు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఎంతో మనసుపెట్టి ఆ శాఖ కార్యకలాపాలను నిర్వహించారు. కృషి ఉద్యోగిక వికాసానికి అనేక నూతన పథకాలను ప్రవేశపెట్టి మహారాష్ట్రను వ్యవసాయికంగా ముందంజలో ఉండేట్టు చేశారు. ఆహారపు పంటలకు తోడుగా వాణిజ్యపంటల సాగుకు గాను ప్రోత్సాహాన్ని ఇచ్చారు. అందుకుగాను రుణాలు కూడా మంజూరు చేశారు. గిడ్డంగుల నిర్మాణం, మారెట్ల నిర్మాణం, గిట్టుబాటు ధరల్లో రైతుల పంటలను కొనుగోలు చేయడం వంటి కార్యక్రమాలకు బీజం వేశారు.

1మే, 1960 బొంబాయి రాష్ట్రంలోని గుజరాత్ ప్రాంతాలను విడదీసి మరాఠి మాట్లాడే ప్రాంతాలన్నింటినీ ఒకే గొడుగుగా మహారాష్ట్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి మారోత్ రావ్ కన్నంవార్ గారి ఆకస్మిక మృతితో తప్పనిసరి పరిస్థితుల్లో మహారాష్ట్ర రాష్ట్రానికి మూడవ ముఖ్యమంత్రిగా శ్రీ వసంత్ రావ్ నాయక్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అన్ని పార్టీల నాయకులని కలుపుకొని రాష్ట్ర వికాసానికి నడిచిన ఉత్తమ నాయకుడుగా అచిర కాలంలోనే గొప్ప ఖ్యాతిని అందుకున్నారు ఆయన. గెలిచేంతవరకే రాజకీయపోటి గాని అనంతరం నాయకులందరూ ప్రజల సేవకులే నన్న విశ్వాసం కలిగి ఉండాలనే అభిమతాన్ని కలిగి ఉండేవారాయన. అదే ఆయన్ని అందరి హృదయాలకు చేరువ చేసింది. ఎవరూ ఆయనకు ఆయన కార్యక్రమాలకు విఘాతం కలిగించేవారు కాదు.

ఆయన హయాంలో జాయక్వాడీ, ఉజ్నీ లాంటి డ్యాంల నిర్మాణం చేసి ఇటు వ్యవసాయం,అటు విద్యుత్ ఉత్పత్తికి తోడ్పడ్డారు. కోరాడి, పారస్, ఖాపర్ కేడా వంటి అనేక విద్యుత్ ప్లాంట్ లను నెలకొల్పి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడ్డారు. ఈ రెండు కార్యాల వల్ల వ్యవసాయదారులకు పంటల ఉత్పాదనకు కావాల్సిన నీరు, విద్యుత్ లభించాయి. బావుల నిర్మాణం చేయించడం వల్ల వ్యవసాయదారులు లాభపడ్డారు. అంతేకాదు రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పడ్డారు. తన పరిపాలనలో ఎవరు పస్తులుండకూడదు, నిరుద్యోగిత ఉండకూడదు అని అనుకునేవా రాయన. అందుకే వ్యవసాయంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేశారు. తద్వారా ఉద్యోగ కల్పన కలిగింది.

దళితులు, గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలను అమలుచేసి దళిత గిరిజన బిడ్డగా అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. తానూ పుట్టిన బంజారా జాతి ఉద్ధరణకు, వారికి విద్యా సదుపాయాలు కలిగించడం, పేదరిక నిర్మూలనకు ఉద్యోగ కల్పనను చేయడం, బంజరు భూముల పంపకం చేసి వారిని వృద్ధిలోకి తీసుకురావడానికి అహర్నిశలు శ్రమించారు. అందుకే ప్రజల బంధువుగా పిలవబడే ఆయన సుమారు పదకొండు ఏళ్ళపాటు ఏకధాటిగా ముఖ్యమంత్రిగా కొనసాగారు. కేంద్ర నాయకులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోనేవారంటే అతిశయోక్తి కాదు. ఇందిరాగాంధీ లాంటివాళ్ళు ఆయనను ఆయన పాలాన విధానాలను ఎంతో గౌరవించేవారు. అందుకే నేటికి మహారాష్ట్ర ప్రజలు ఆయనను 'మహానాయక్' అని ప్రేమగా పిలుచుకుంటారు.

దేశసేవలో జాతిసేవలో తన జీవితాన్ని అర్పణం చేసిన వసంత్ రావ్ నాయక్ 1979లో శాశ్వతంగా విశ్రాంతిలోకంలోకి వెళ్ళిపోయారు. ఆయన జీవితం, ఆయన ఆలోచనలు, పాటించిన విలువలు నేటి రాజకీయ నాయకులకు, పాలకులకు, యువతకు ఆదర్శనీయమని గర్వంగా చెప్పవచ్చు. ఆయన లేకున్నా ఆయన ఆలోచనలు బ్రతికే ఉన్నాయి. బంజారాల భవిష్యత్తుకు బాటలు వేస్తూనే ఉన్నాయి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10 (43) హైదరాబాద్ ఆగస్టు : 2023

# ముదిగొండ వీరభద్రయ్య కథలు : మురిపిస్తున్న జీవిత సత్యాలు

**డా. దార్ల వెంకటేశ్వర రావు,** అధ్యక్షులు, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం. ఫోన్ : 918 268 5231



ఆయనపాఠం చెప్తుంటే మాకళ్ళు కనురెప్పవెయ్యడం మర్చిపోయేవి. ఆయనపాఠం చెప్తుంటే మాచెవులు మరేదీ వినడానికి ఒప్పుకొనేవికాదు. పాఠంచెప్తే ఆయనలా ఉండాలనిపించేది. ఆయనపాఠం చెప్పేసి వెళ్ళిపోయిన తర్వాత కూడా మాచెవుల్లో ఆయన మాటలే వినిపిస్తున్నట్లనిపించేది. ఆయన ప్రొజెక్టర్స్ పై కవిత్వం విశ్లేషించి వెళ్ళిపోయిన తర్వాత కూడా ఆ దృశ్యమే కనిపిస్తున్న ట్లనిపించేది. ఆయనపేరు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు. ఆయన దగ్గర నేను ఎం.ఏ., తెలుగు పాఠాలనువినే అదృష్టం కలిగింది. సంప్రదాయకవిత్వం లోని సౌందర్యాన్నెంతలోతుగా వివరిస్తూ భారతీయ ఆలంకారికుల పట్లగౌరవాన్ని కలిగించేవారో, ఆధునిక వచనకవిత్వాన్ని విశ్లేషిస్తుంటే పాశ్చాత్య కవిత్వ నిర్మాణ పద్ధతుల పట్లా అంతే ఆసక్తిని పెంచేవారు. అందరికీ ఆయన ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారే కావచ్చు. కానీ, ఆయన దగ్గర చదువుకున్న మాకందరికీ ఎం.వీ.గారే. ఆయన కావ్యాల్నీ, కవిత్వాన్నీ, కథల్నీ, నవలల్నీ... ఏ ప్రక్రియ గురించి చెప్పినా ఆ ప్రక్రియలపట్ల మాకు గౌరవం కలిగేది. వాటినెలా అధ్యయనం చేయాలో ఎప్పటికప్పుడు కొత్త విధానాలు తెలిసేవి. సృజనసాహిత్యంలోని అనేక పార్శ్వాల్ని ఆయన మాకు పాఠ్యభాగంలో భాగంగా వివరిస్తుంటే, ఆయన కూడా ఆ ప్రక్రియలను రాస్తే ఎలా ఉండేదో కదా అనిపించేది.

అటువంటి మా ఎం.వీ.గారు కథలు రాశాననీ, వాటిలో ఆరుకథలు దొరికాయనీ, వాటిని పుస్తకంగా తీసుకొస్తున్నానని, ఒకఅభిప్రాయం రాసి పంపించమనిచెప్పారు. మా గురువు గారి రచనలపై నా అభిప్రాయమనేది నాజీవితంలో ఊహకైనా రాని ఆలోచన. వెంటనే **'ఇది నాకు కలిగిన అదృష్టం సర్. మీరు కథలు రాశారంటే నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది సర్. మీరు కవిత్వం రాశారని తెలుసు. కథలను అంతబాగా విశ్లేషిస్తుంటే, మాగురువుగారు కథలు రాసుంటే ఇంకెంత బాగుండేదనిపించేది. ఈ కథలు చదివితే మీసృజన సాహిత్యంలోని మరొకపార్శ్వం నాకు లాగే మాతరం, ఆ తర్వాత తరం వాళ్ళకి ఎంతోమందికి కొత్తగా తెలుస్తుంది. నాకెంతో సంతోషంగా ఉంది"**న్నాను. ఈ కథలన్నీ 1968–70 ప్రాంతాల్లో రాసినవి. వీటితో పాటు మరో నాలుగు కథలు కూడా రాశారు. అవిదొరకడం లేదని తెలిసింది. ఆయన ఏనాడూ తనకథలు లేదా తన వ్యక్తిగత రచనల వివరాల గురించి క్లాసులో చెప్పేవారు కాదు. కానీ, ఆయన వివిధ సందర్భాల్లో రాసిన విమర్శానాంశాలు మాత్రం చెప్పేవారు. అందువల్ల ఆయన ఒక విమర్శకుడుగా, ఒక పరిశోధకుడుగా, ఒక సంగీత విద్వాంసుడుగా, అన్నింటికీ మించి ఒక గొప్ప ప్రేమమూర్తిగానే ఆయన్ని మేము భావించేవాళ్ళం. అయినా, ఆయనతో నేటికీ మాట్లాడాలంటే ఏదో తెలియని భయం. ఆయన విమర్శ పుస్తకం వస్తుందంటే మాకు (నాకు ప్రత్యేకించి) ఒకపండుగే. అందులోని విశ్లేషణ, విషయగాఢత, నూతన విషయాల పరిచయం వంటివన్నీ ఆ పుస్తకాన్ని దాచుకొని పదేపదే చదువుకోవడానికి, పాఠం చెప్పడానికి మాత్రమే కాదు, నిత్యం ఉపయోగించుకోవడం కూడా నాకు అలవాటు.

అటువంటి మా సార్ కథలు రాశారని తెలిస్తే ఎలా ఉంటుంది? ఒక విమర్శకుడిగా ఎరిగినవారు నాకు తెలియని ఒక కథకుడిగా పరిచయమవుతుంటే సహజంగానే నాలోని ఆ విద్యార్థీ, ఒకపాఠకుడూ, ఒక విమర్శకుడూ సందర్భాన్ని బట్టి బయటకొస్తుంటాడు. ప్రతిపదాన్నీ, ప్రతివాక్యాన్నీ, ప్రతిపాత్రనీ, ప్రతివర్ణనలోని సందర్భోచిత ఔచిత్యాన్నీ, ఆ నెరేషన్నీ, దానికి ఉపయోగించుకున్న భాషనీ...ఇలా భిన్నపార్శ్వాల్లో చూడాలనిపిస్తుంది. సార్ రాసిన కథలు ఆరుదొరికాయి. వాటిని '***కెమొమిల్లా***' పేరుతో పుస్తకంగా ప్రచురిస్తున్నారు. ఈ ఆరు కథలూ వస్తువైవిధ్యంతో పాటు శిల్పసొగసుతో పాఠకుల్ని చదివిస్తాయి. ఆ కథలపై నా అభిప్రాయాన్ని రాసే ప్రయత్నిస్తాను.

కొన్ని సందర్భాల్లో మనుషుల రూపంలో ఉండే మృగాలకంటే, మమతానురాగాల్ని ప్రదర్శించే మృగాలేనయం అనిపించే వాస్తవాల్ని మనకు కళ్ళ ముందు కదిలాడేలా వర్ణించిన కథ ***ఏనిమల్ సైకాలజీ*** (1969). జీవితం ఒక సర్కస్ లాంటిది. దాన్ని జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకోకపోతే పతనం ఎన్ని రూపాల్లో ఉంటుందో ఎవరూ ఊహించలేరు. కథ అంతా ఏకబిగిని చదివించే ఉత్సుకతతో పాటు చివరికేమవుతందనేది ఊహ కలుగుతున్నట్లనిపిస్తూనే, పాఠకుని ఊహే నిజమవుతుందా? రచయిత ఏదైనా మలుపు తిప్పుతారా? అనుకుంటుండగానే కథ ముగుస్తుంది. మహాక్రూర జంతువుల మనస్తత్వాల్ని గుర్తించగలిగినవారికి మనుషుల

స్వభావాలు తెలియకుండా ఉంటాయా? సమాజంలో పెద్దమనుషుల్లా గౌరవ మర్యాదలు పొందే వారిలో పైకి కనిపించని దుర్మార్గ స్వభావాన్ని గుర్తించడమే కాకుండా సర్కస్ నిర్వాహకురాలు శాంతి టిట్ ఫర్ టాట్ అన్నట్లే ప్రవర్తించింది.

***తరంగాలూ, అంతరంగాలూ*** (1969) కథలో స్త్రీ–పురుషుల మధ్య, భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనుబంధాలు ఏయే అంశాలతో ముడిపడి ఉంటాయో పాఠకుల్లో శాశ్వతంగా ముద్రవేసే పోలికలతో కథకుడు చక్కగా నెరేట్ చేశారు. ఇండియాలో డాక్టర్‌గా పనిచేస్తున్న హరిప్రియకు ఒక ఉత్తరం వస్తుంది. ఆ ఉత్తరంలో తన భర్త అమెరికాలో ఉంటూ, అక్కడ ఉండే స్వేచ్ఛను వివరిస్తాడు. మరీ ముఖ్యంగా స్త్రీ, పురుషులు కలిసిమెలిసి ఉండే స్వేచ్ఛ గురించి రాశాడు. స్వేచ్ఛ గురించి తెలిసిన దగ్గర నుండీ ఆమె మనసులో ఏదో మూల తన భర్త పట్ల ప్రత్యేకించి ఆలోచించేలా చేస్తుంది.

డాక్టర్ హరిప్రియతో పాటు వరప్రసాద్ పనిచేస్తుంటాడు. అతడు తన పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపుతుంటాడు. ఇద్దరూ కలిసిమెలిసి తిరుగుతుంటారు. ఒకసారి అలా అలా తిరుగుతూ ఒక చెరువుగట్టు మీద కూర్చుంటారు. ఇద్దరూ సరదాగా సంభాషించుకుంటారు. ఆమెపై ఉన్న మోహంతో ఆ చెరువులోని నీటికి స్వేచ్ఛ ఉంటేనే సౌందర్య వంతంగా ఉంటుందని అంటాడు. ఏదొకలా ఆమెపై తనకున్న కోర్కెను తీర్చుకోవడానికి దొరికిన ప్రతి సందర్భానీ ఉపయోగించు కోవాలని ప్రయత్నిస్తుంటాడు.

భర్త యెడబాటు, తన ఒంటరితనం, తన వయసు... ఇవన్నీ ఆమెను కొంత తడబాటుకి గురిచేస్తాయి. ఒకసారి హరిప్రియ, వరప్రసాద్ ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్ళి, అయిపోయిన తర్వాత తమ ఇళ్ళకు వచ్చేటప్పుడు వరప్రసాద్ తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు. ఆమె సున్నితంగా తిరస్కరించినా బలవంతం మీద కాఫీ త్రాగి వెళ్ళవుగాని లోనికి రమ్మని తీసుకెళ్తాడు. ఇద్దరూ కాఫీ త్రాగే సమయంలో వాళ్ళు ఒకర్నొకర్ని గాఢంగా చూసుకొంటారు. దాన్ని ఆసరాగా తీసుకొని ఆమెను వరప్రసాద్ దగ్గరకు తీసుకుంటాడు. కానీ ఆమె అతడ్ని దూరంగా నెట్టేస్తుంది. ఇంటికొచ్చేసి, మరలా తనలో తాను అలా చేసినందుకు బాధపడుతుంది.

ఇక్కడ సౌందర్యానుభూతి కేవలం శరీరానికి మాత్రమే సంబంధించిందా? లేదా మనసుకి కూడా సంబంధించిందా? స్త్రీ–పురుషుల ప్రేమాస్వాదనలో నైతికవిలువల ప్రభావం ఉండదా? ఇటువంటివన్నీ ఈ కథలో చర్చనీయాంశాలవుతాయి. కథ జరుగుతున్న వర్తమానంలోనే చంద్రయ్య భార్య పరాయివ్యక్తి మోజులో ఉండడం, భర్తను పట్టించుకోకపోవడం, చివరికి పరాయి వ్యక్తి, చంద్రయ్య, భార్యల జీవితం ఎలా తయారయ్యిందనే భవిష్యత్తును దర్శింపజేయటం ఈ కథలోని శిల్పరహస్యం.

***కెమొమిల్లా*** (1970) పేరుతో ఒక కథ రాశారు. పేరే విచిత్రంగా ఉంది. కథ చివరిలో రచయిత దాని గుట్టు కొంత విప్పారు. నాలాయనీదేవి ధనవంతురాలు. ఆమె భర్త చనిపోయాడు. అతన్ని ఆమే చంపేసిందని అందరూ చెప్పుకుంటుంటారు. కానీ, నిజానికి భార్యాభర్తలిద్దరూ గొడవపడినప్పుడు, భర్త నీళ్ళ ఫౌంటెన్‌లో పడి చనిపోతాడు. ఆ విషయాన్ని డాక్టర్ శశిభూషణ్ ఆమెతో జరిపిన సంభాషణల ద్వారా తెలుసుకోగలుగుతాడు. ఆ విషయాన్ని సమాజానికి తెలియజేయడమెలాగో తెలియని నాలాయనీదేవి మానసికవ్యథకు గురవుతుంది. ఆమెకు తనచుట్టున్నవాళ్ళంతా తనకు శత్రువుల్లా అనిపిస్తారు. డాక్టర్ శశిభూషణ్‌ని కూడా మొదట ఆ దృష్టి తోటే చూస్తుంది. తెలివైన డాక్టర్ ఆమె మానసిక స్థితిని గుర్తిస్తూనే ఆమె ఒంటరితనంతో బాధపడుతుంది. ఆమె తన భర్తను చంపలేదనే విషయాన్ని తన చుట్టూ ఉన్నవాళ్ళు గుర్తించలేకపోవడంతో neuropsychiatric సమస్యతో బాధపడుతుందని తెలుసుకుంటాడు. ఆ మానసిక సమస్యవల్ల ఆమెను తన భర్తే దెయ్యమై రాత్రంతా నిద్రలేకుండా వేధిస్తున్నాడని భ్రమపడుతుంది. ఆ వ్యాధి తగ్గడానికి ఆమెను అనునయిస్తూ డాక్టర్ శశిభూషణ్ ఆమె ఎలాగోలా ఆ కెమొమిల్లా మెడిసిన్ తీసుకొనేలా చేయగలుగుతాడు.

వైద్యాన్ని ప్రేమతోను, స్నేహంతోను చేయాలి. అది ఆ డాక్టర్ శశిభూషణ్‌కి తెలుసు. ఎంత ధనవంతురాలైనా నాలాయనీదేవి ఒంటరితనంతో బాధపడింది. తనవారెవరూ లేనంత ఒంటరితనంతో గడిపింది. అలాంటి ఒంటరితనం ఎంత భయంకరంగా ఉంటుందో నాలాయనీదేవి పాత్ర ఒకసజీవ ఉదాహరణగా చూపారు రచయిత. డాక్టర్ శశిభూషణ్‌కి కూడా తన రక్తసంబంధీకులెవరూ లేరు. కానీ, ఆయన దగ్గరకు వచ్చిన వాళ్ళంతా తన బంధువులుగానే భావిస్తూ ఎంతో ప్రేమతో వైద్యం చేసేవాడు. ఆ ప్రేమ, ఆ మంచితనం, ఆ అర్థం చేసుకొనే మనస్తత్త్వమే తనకు వరమైంది. నాలాయనీదేవి తన భార్యగా మారింది. తనకొక కుటుంబం ఏర్పడింది. రచయిత ఈ కథ ఎక్కడో ఒక వాస్తవికమైన జీవితాన్ని గమనించి రాసినట్లనిపిస్తుంది.

ఇక, కెమొమిల్లా సంగతి చూద్దాం. ఇది ఒక హోమియో మందుపేరు. అది ఒక పువ్వు నుండి తయారు చేస్తారు. దీని శాస్త్రీయ నామం Matricaria chamomilla L. సంక్షిప్తంగా ChamoMilla అనిపిలుస్తారు. దీన్ని తెలుగులో సీమ చామంతి అనొచ్చు. సాధారణంగా దీన్ని neuropsychiatric సమస్యలకు ఉపయోగిస్తా రని హోమియో వైద్యశాస్త్రం వివరిస్తుంది.

***డామిట్ కథ అడ్డం తిరిగింది*** (1968)

ఒక పాడుబడిన మేడ ఉంది. దాని చుట్టూ నాలుగు వృత్తులకు చెందిన వాళ్ళు నివసిస్తున్నారు. ముగ్గురికి పెళ్ళైనా, వాళ్ళకు భార్యలు లేరు. వాళ్ళు చనిపోయారు. నాల్గవవాడు ఒక విద్యార్థి. అతనికి

ఇంకా పెళ్ళి కాలేదు. ఆ మేడనెవరో బాగు చేయించి, రంగులు వేయించారు. మేడలోకి ఒక అందమైన అమ్మాయి వచ్చింది. చూడ్డానికి విధవలా ఉంది. ఆమెను పొందాలని ఒకరు, భార్యగా చేసుకోవాలని మరొకరు, ఆమెను పెండ్లాడి ఆమెతోపాటు ఆ మేడను కూడా స్వంతం చేసుకోవాలని ఇంకొకరు రకరకాలుగా ఆలోచిస్తూ, ఆమెను ఆకర్షించాలని ప్రయత్నిస్తుంటారు. దాన్ని గమనించిన ఆమె వాళ్ళలో వాళ్ళకి ఒకరికి తెలియకుండా మరొకరితో రకరకాల పనుల కోసం మాట్లాడుతుంది.ఆమెతో మాట్లాడిన వాళ్ళంతా తమని ఆమె కోరుకుంటోందనే భావం వచ్చేటట్లే చెప్తుంటారు. ఆమె విద్యార్థితో కూడా మాట్లాడుతుంది. ఆమె ఏమి మాట్లాడిందో, ఆమె ఆ యువకుడితో మాట్లాడిన సాయంత్రానికే ఒక కారు రావడం, దానిలో నుండి హుందాగా ఒకరు దిగి మేడలోకి వెళ్ళడం కథ. ఒక పాడుబడిన ఇల్లు, దానిలో ఒక విధవ పాత్రను, ఆ ఇంటి చుట్టూ నలుగురు ఆమెపై మనసుపారేసుకోవడం...ఇవన్నీ గురజాడ వారి ***కన్యాశుల్కం*** నాటకంలో గిరీశం గారి విడో మ్యారేజ్ రిఫార్మ్ కోసం పడుతున్న పాట్లులా స్ఫురిస్తాయి. సమాజంలో భర్త చనిపోయిన స్త్రీ ఒంటరిగా ఉందని తెలిస్తే, ఆమెను వెంటాడే గిరీశాలెంతమంది ఉంటారో రచయిత ఈ కథలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ కథాకథనం ఆ నలుగుర్నీ, వాళ్ళ ఆలోచనల్నీ, వాళ్ళ అంతరంగాల్నీ ఒకదాని తర్వాత మరొకటి చెప్తున్నట్లు భిన్నమైన శిల్పంతో కథనీకరించారు. వాళ్ళ మనస్తత్వాలు తెలియాలన్నా, సమాజంలో అలాంటి గిరీశాల్ని గుర్తించాలన్నా, చివరికి ఆ మేడలోకి కారులో వచ్చిందెవరో తెలియాలన్నా ఈకథ చదివి తీరాల్సిందే. ఆమె చుట్టూ తిరిగిన వాళ్ళలో భిన్నమైన వృత్తుల వార్ని పాత్రలుగా ఎన్నుకోవడంలోనే కథారచయిత కెంతో సామాజిక వాస్తవికతను ప్రదర్శించే వ్యూహం కనిపిస్తుంది. తాము చేసే పనితో సంబంధం లేకుండా, వయసుని కూడా పట్టించుకోకుండా వాళ్ళెలా ప్రవర్తిస్తుంటారో ఈ కథలో వివరించారు.

***మళ్ళీ చిగిర్చిన వసంతం*** (1968) కథ చదువుతుంటే ఒక సినిమా చూస్తున్నట్లే ఉంది. వస్తువు అవయవదానం, దాని వల్ల వచ్చే పరిణామాల్లో కొన్నింటిని వివరించడం. ప్రపంచంలో తొలిసారిగా గుండె మార్పిడి 1967లో జరిగినట్లు చరిత్ర చెబుతుంది. ఇప్పటికీ గుండెమార్పిడి ఆపరేషన్‌కి సంబంధించి ప్రజల్లో ఎంతో ఆసక్తి నెలకొని ఉంది. ఒకరి గుండె మరొకరికి అమర్చడమనేది వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన మార్పు. ఇటువంటి వస్తువుతో ఈ మధ్య కాలంలో అనేక సినిమాలు కూడా వచ్చాయి. కానీ, 1968లోనే ఒక జీవన్మృతుడి గుండెను తీసి మరొకరికి అమర్చినట్లు కథ రాయడ మంటే సామాన్యమైన విషయం కాదు. ఆ మెడికల్ టెర్మినాలజీతో పాటు, ఆ గుండె మార్పిడి అనంతరం వచ్చే న్యాయపరమైన వివాదాలను కూడా వివరించాలంటే ఆ సృజనాత్మక రచయిత ఒక




విధంగా చిన్న పరిశోధనే చేయాలి. ఆ రోజుల్లో ఇప్పుడున్నంత సమాచారాన్ని వేగవంతంగా అందుకోగలిగే సాంకేతిక పరిజ్ఞానం లేదు. అయినా గాని ఈ కథను ఇన్ని వివరాలతో రాయగలిగారంటే రచయిత ముదిగొండ వీరభద్రయ్యగారు ఎంత ప్రతిభామూర్తో స్పష్టమవుతోంది. ఈ కథలో సుశీల భర్త కారు ఏక్సిడెంట్‌లో జీవన్మృతుడవుతాడు. అంటే కొన్ని అవయవాలు కొంతసేపు పనిచేస్తాయి. కానీ, వైద్యపరిభాషలో ఆ వ్యక్తి చనిపోయినట్లే పరిగణిస్తారు. ఇక్కడ జీవన్మృతుడంటే ఎవరో కొంత వివరణ అవసరం. వైద్యశాస్త్ర పరంగా వాడే ఈ మాటను ఆధ్యాత్మికరంగంలో మరొక అర్థంలో వ్యవహరిస్తారు.

పుట్టిన వానికి మరణం తప్పదు. మానవుడిగా జన్మించిన ప్రతి వాడికీ మరణం తప్పదు. కానీ, నిత్యం ఆ ఆలోచనతోనే తాను చనిపోతానేమో అనే మృత్యుభయంతో నిత్యం వణికిపోయేవాణ్ణి జీనన్మృతుడని అంటారనీ, మృత్యుభీతిని జయించినవాణ్ణి జీవన్ముక్తుడు అనీ మన ఆధ్యాత్మికవేత్తలు వివరిస్తుంటారు. **మృత్యువు 'చితి' వంటిది. అది ఒక్కసారే దహిస్తుంది. మృత్యుభయం 'చింత' వంటిది. అది నిత్యం దహిస్తూనే ఉంటుంది. చివరకు మరణం తప్పదనే పరమ సత్యాన్ని జీర్ణించుకుంటూనే– దానికి సంబంధించిన చింతను, భయాన్ని మనిషి జయించాలి. అలా మృత్యుభయాన్ని జయించినవాణ్ణి 'మృత్యుంజయుడు'గా చెబుతారు. మృత్యువును జయించడమంటే, మృత్యుభయాన్ని జయించడమే. దాన్ని 'ముక్తస్థితి'గా భావిస్తారు. ముక్తస్థితి– భారతీయతకు జీవనాడి. అది గొప్ప సంస్కార విశేషం'** గా భారతీయ ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు.

ఈ కథలో సుశీలకు పెండ్లయిన మూడు నెలలకే తన భర్త భాస్కరానికి కార్ యాక్సిడెంట్ జరగడంతో, గుండె మాత్రం జీవంతోనే ఉన్నా, దేహం మాత్రం చనిపోయింది. ఆ గుండెను హృద్రోగంతో బాధపడుతున్న రమాపతికి మార్చారు. అందువల్ల సుశీల తరఫు బంధువులు ఈ మరణాన్ని అనుమానాస్పదంగా భావించి పోలీసుకేసు పెట్టిస్తారు. అది కోర్టువరకు వెళ్తుంది. కోర్టులో భాస్కరం బ్రతికుండగానే అతని గుండెను డాక్టర్ సంజీవరావు తీసేశాడని ప్రతివాది తరఫు న్యాయవాది వాదిస్తాడు. ఆ కోర్టు వాదనలు ఎంతో

లాజికల్ గా రచయిత ప్రదర్శించారు. 'బ్రెయిన్‌డెడ్' అయినట్లు ప్రకటించిన వారికి కొన్ని అవయవాలు పని చేస్తున్నా, అవి మెదడుతో కనెక్టివిటీని కోల్పోతాయి. ఆ పరిస్థితుల్లో మరలా ఆ మనిషిని సాధారణ స్థాయికి తీసుకొనిరాలేనప్పుడు దాన్ని లీగల్ డెత్‌గానే వైద్యులు ప్రకటిస్తారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివాటిని మరణాలుగా నిర్వచించడంలో డాక్టర్ల మధ్యనే నేటికీ ఏకాభిప్రాయం లేదు. దీన్ని రచయిత ఆ రోజుల్లోనే ఇలా ఆ సాంకేతిక పరిభాషను సమర్థవంతంగా వాడుకొంటూ వాటిని సంభాషణాత్మకంగా వివరించారు.

*"ఆ మర్నాడు డాక్టర్ సంజీవరావుని క్రాస్ ఎక్సామిన్ చేయడం తిరిగిమొదలయింది.*

*"భాస్కరం గుండెని తీసికోవడానికి అతని అనుమతిని మీరు తీసికొన్నారా?"*

*'లేదు."*

*"ఎందుకు?" గర్జించి అడిగాడు ప్రాసిక్యూటర్.*

*"చచ్చినవాణ్ని ఎలా అనుమతి కోసం మాట్లాడించను" –*

*"అప్పటికే భాస్కరం చచ్చిపోయాడా?" జడ్జి గారడిగారు.*

*"మైలార్డ్! మృత్యువుకింకా నిర్వచనం పూర్తికాలేదు. మొన్ననే సిడ్నీలో ఇంటర్నేషనల్ ఫిజిషియన్స్ అంతా సమావేశమయి మృత్యువుని నిర్వచించడానికి ప్రయత్నం చేశారు." అన్నాడు డాక్టర్.*

*"పోతే మీరు చేసికొన్న నిర్వచనాన్ని బట్టి భాస్కరం మీ దగ్గరకు చచ్చిపోయాకే వచ్చాడంటారు?" ప్రాసిక్యూటర్ ఎంతో తెలివిగా అడిగాడు!*

*"అవును!" అన్నాడు డాక్టర్."*

ఈ సంభాషణ రాయాలంటే కథారచయిత బ్రెయిన్ డెత్ గురించిన సమాచారాన్ని ఎంతో సేకరించాలి. దాన్ని మరలా సులభంగా కథలో భాగం చేయగలగాలి. ఆ నైపుణ్యం ఇక్కడ చక్కగా కనిపిస్తుంది. శాస్త్ర విషయాల్ని సృజనాత్మకంగా చెప్పాలంటే ఆ విషయం పట్ల మంచి అవగాహన ఉండడంతో పాటు, భాషపై మంచి పట్టుండాలి. ఈ కథలు రాసేనాటికి రచయితకు ముప్పై సంవత్సరాలు కూడా రాలేదు. అయినా ఆ అవగాహన మనల్ని అబ్బురపరుస్తుంది.

ఈ సంభాషణనే ఒక కోస్తా రచయిత అయితే కొన్ని పదాల్ని మార్పు చేసి ప్రయోగించేవారనిపిస్తుంది. "చచ్చిన" పదానికి బదులు 'చనిపోయిన' అని ప్రయోగించేవారేమో. కానీ, ఈ సంభాషణలో మనం గమనించాల్సిన విషయం రచయితశైలిలో కనిపించే నేటివిటీ. ఈ నేటివిటీ వల్ల ఆ ప్రాంతానికి చెందినవాళ్ళు ఆ భాష, ఆ పలుకుబడుల వల్ల మరింత ఆత్మీయతను పెనవేసుకోగలుగుతారు. తెలుగు భాష కోస్తా, తెలంగాణ, రాయలసీమ, కళింగాంధ్రలతో పాటు, ఆ ప్రాంతాల్లో కూడా వైయక్తికత ఉంటుంది.

అవయవమార్పిడి, అవయవదానం గురించి ఈ రచయితే గనక నేడు మళ్ళీ ఒక కథ రాస్తే, జరిగే మంచినీ, దాని పేరుతో చేసే కార్పోరేట్ మాయాజాలాన్ని, ఆ బీభత్సాన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించేవారేమో అనిపిస్తుంది.

కథలో ముగింపు మాత్రం చర్చనీయాంశం. ఒకరి గుండెను మరెవరికో పెడితే, దాని వల్లనే ఆ గుండె గలవాని అలవాట్లన్నీ గుండె పెట్టిన వారికి వచ్చేస్తాయా అనేదొక ప్రధానమైన చర్చనీయాంశమే అయినా, కథ కళాత్మకం కావడానికి అది ఎంతో దోహదపడుతుంది. పాఠకుడ్ని ఆహ్లాదపరుస్తూనే, ఆలోచనలో పడేస్తుంది.

సుశీలకు వివాహమైన మూడునెలలకే భర్త చనిపోతే, ఆమె మిగతా జీవితమంతా భర్తను మాత్రమే తలచుకొంటూ శేషజీవితాన్నంతా ఆ వైధవ్యంతోనే రసహీనంగా బ్రతికవలసిందేనా! దీనికి రచయిత సూచించిన లేదా ఇచ్చిన సమాధానమే బహుశా, తన భర్త భాస్కరం అలవాట్లే రమాపతిలోనూ ప్రతిఫలించాయని గమనించడం, చివరికి ఆమె ఇంటికే రమాపతి కాస్తా 'భాస్కరం'గానే వెళ్ళడం! ఆ వెళ్ళడం కేవలం ఆమెను ఆ ఇంట్లో దింపి మరలా తన ఇంటికి వెళ్ళి పోవడానికేనా?

ముగింపుని పాఠకులే ఆలోచించుకునేలా ఒక సన్నని తెరని కట్టినట్లు కట్టి కథను ముగించేశారు. అలా ముగించడమే బాగుంది. ఇది కథను ముగించడంలో పాటించే గొప్ప శిల్పం. రచయిత ఆశించే దాంపత్య జీవనం, కుటుంబ వ్యవస్థ, మానసిక ప్రశాంతతలకు ఈ కథతో పాటు ***కెమొమిల్లా*** కథలోని ముగింపు కూడా శిల్ప ప్రాధానానికి నిదర్శనాలుగా నిలుస్తాయనుకుంటున్నాను.

***మూడు చక్రాల సైకిల్*** (1970)

స్వచ్ఛమైన ప్రేమకు, నిజాయితీకి ఎప్పుడూ విలువ పెరుగుతుందే తప్ప, విలువ తరగదు. నిజమైన ప్రేమ క్షమా గుణాన్నే కోరుతుంది. ఆస్తీ, అధికారం వంటివన్నీ ఉన్నా, ద్వేషం, పగ, ప్రతీకారాలతో రగిలిపోయే వాళ్ళ దగ్గర ఉండడం కష్టం. దీన్ని ఈ కథలో ఎంతో సమర్థవంతంగా హృద్యంగా నిరూపించారు. తానెంతో ప్రేమించిన భార్య సుశీల చనిపోతే, ఆ దుఃఖం నుండి సుధాకరం బయటపడ్డానికి, మరదలు సుజాత ఎంతో ప్రయత్నించింది. ఆ సందర్భంలో ఇద్దరి మధ్యా జీవితం గురించి కొన్ని తాత్త్విక సంభాషణలు జరుగుతాయి. అంతవరకు తన భార్యలేని లోకంలో కంటే, ఆమె తనతో జీవించిన క్షణాలతోనే సుధాకరం గడుపుతుండేవాడు. ఈ తాత్విక సంభాషణల తర్వాత తన మరదలు కన్నీరు పెట్టేసరికి, తన వల్ల మరొకరు బాధ పడ్డం తట్టుకోలేని సుధాకరం లౌకికప్రపంచంలోకి వస్తాడు. తన అక్క మరణం తర్వాత ఆ స్థితిలో ఉన్న బావను మరలా ఎలాగైనా మామూలు మనిషిని చెయ్యాలనుకుంది. అప్పటికే బి.ఏ.పూర్తి చేసిన ఆమె తన బావ దగ్గరే ఉంటూ ఎం.ఏ చదువుకోవాలనే నెపంతో

వస్తుంది. తాను అనుకున్నట్లే తన బావను మరలా ఈ లౌకిక ప్రపంచంలోకి తీసుకొని రాగలిగింది.దానితో పాటే ఎం.ఏ.కూడా పూర్తి చేసి లెక్చరర్ కూడా అయ్యింది. అంతే కాదు, అక్కలేని లోటుని తీరుస్తూ సుధాకరానికి భార్యగా మారింది. కానీ, ఇద్దరిలోనూ ఒకరి కొకరికి తెలియదనుకొనే ఒక రహస్యం మాత్రం అలాగే దాగి ఉంది.

తన బావకి పిల్లలు పుట్టరని సుజాతకు తెలుసు. అయినా దాన్ని తెలియనట్లే ఉంది. ఒకరోజు రహస్యాలు తెలియకుండా జీవించడంలో నిజమైన స్వచ్ఛత ఉండదనుకొందేమో... ఆమె ఒక రహస్యం గురించి ప్రస్తావించే సరికి, సుధాకరంలో తాను దాచాననుకున్న రహస్యం బయటపడిపోతుందేమోనని ఆందోళన మొదలవుతుంది. ఆ రహస్యం తెలిస్తే సుజాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వణికిపోతాడు. ఈ లోగా సుధాకరానికి ఓలేఖ వస్తుంది.దానితో పాటు జతచేసిన మరొక లేఖ కూడా ఉంటుంది. వాటిని చదివిన తర్వాత తన భార్యస్థానంలోకి వచ్చిన మరదలు సుజాతకు డిగ్రీలో ఆమె క్లాసుమేటుగా ఉండి, ఆమెను ప్రేమించి, ఆ ప్రేమ దక్కకపోవడంతో అది ద్వేషంగా మారి ఉత్తరాలుగా, హింసగా మారిందని సుధాకరం తెలుసుకుంటాడు.

పరస్పరం ప్రేమగా జీవించాలనుకున్న నిర్ణయంతో సుధాకరం, సుజాతల జీవితాల్లోని రహస్యాలు ఇద్దరికీ తెలిసిపోయాయి. తమ ఇద్దరినీ నడిపించే రెండు చక్రాల్లాంటి పిల్లలు లేకపోయినా, వాళ్ళు సంతోషంగా జీవించగలమనే దృఢనిశ్చయంతో రెండు హృదయాలు సంతోషంతో ఒక్కటవుతాయి.

ఎన్నో జీవన తాత్త్వికలోతులున్న ఈ కథలో సుజాత తన బావను ఈ లౌకిక ప్రపంచంలోకి తీసుకొని రావడానికి మాట్లాడిన మాటలు, నిజంగా ఆమె వయసుకి తగినవేనా అనిపిస్తుంది. అయితే కుటుంబాన్ని, ఈ లౌకిక ప్రపంచాన్నీ బాగా అవగాహన చేసుకోగలిగినప్పుడు, అనివార్యమైనప్పుడు ఆ అవగాహనను జీవితమే నేర్పుతుందేమో. సహజంగానే స్త్రీ, పురుషులు ఇరువురిలోను పురుషుని వయసుకంటే స్త్రీ వయసు చిన్నదైనా, కొంతమంది స్త్రీలలోని పరిపక్వత చూస్తే ఆశ్చర్యమేస్తుంది.

కథ చివరిలో ఒక సంభాషణ నన్ను కన్నీళ్ళు పెట్టించింది. దాంపత్యంలోని పవిత్రతను, నిష్కల్మషాన్నీ మనకు కన్నీళ్ళలోని స్వచ్ఛతలా బయటకు తన్నుకొచ్చేలాచేసింది.

*"అవును సుజా! జీవితంలో సుఖాన్ని పొందుదామని మీ అక్కని కష్టపెట్ట కూడదని శాశ్వతంగా నేనే నివారించుకొన్నాను,*

*ఈ జన్మకి మన ప్రతిబింబాలు అద్దంలో తప్ప మరెక్కడా కన్పించవు సుజాతా!'*

*'బావా! ఇంత పసిమనస్సు వున్న నువ్వే నా కొడుకువి!*
*ఇంత క్షమాహృదయమున్న నీవే నా తల్లివీ దండ్రివీ!*
*ఇంతటి అనురాగ హృదయమున్న నువ్వే నాభర్తవి!"*

ఈమాటలు చెప్పాలంటే వాళ్ళమధ్య ఎంతటి నిష్కల్మషత్వం ఉండాలి. మాకు పిల్లలు పుట్టనంత వరకు నేనూ, నా భార్యా ఒకరి కొకరం నిజంగానే మేము అలాగే అనుకున్నాం. ఒకరికొకరు పిల్లలమని కూడా అనుకున్నాం. అలా చెప్తే ఎవరైనా నవ్వొచ్చు. కానీ, ఈ కథ చదివాక మాలాగే ఆలోచించేవాళ్ళుంటారని పించింది.నా హృదయంలో పెద్దభారమేదో దిగిపోయినట్లనిపించింది.

ముదిగొండ వీరభద్రయ్యగారు కథారచయితగా ఉన్న కాలంలో రాసిన ఈ కథలు, కథలుగా కనిపిస్తున్న జీవన సత్యాలు. మా సార్ లోని అతి సుకుమారమైన హృదయాన్ని తెలిపే కథలు. వీరు దాంపత్యానికిచ్చే జీవనవ్యాఖ్యానాలు.

మనకే తెలియని మన జీవనసంఘర్షణలు మనకు తెలియాలంటే ఈ కథలు చదవాలి. జీవితంలో అసహనానికి, అశాంతికి, ఒంటరి తనానికి కారణాలు తెలియాలంటే ఈ కథలు చదవాలి. మనజీవితాల్ని చక్కబరుచుకోవడానికి ఇవి చాలావరకు ఉపయోగపడతాయి. నైతికతకూ, జీవితంలో అనివార్యమైన సామాజిక సర్దుబాట్లకు మధ్య గల వ్యత్యాసాల్ని తెలియజేస్తూనే, ఉత్తమ మూర్తిమత్వాన్ని పెంపొందిస్తాయి. వీటిలో యౌవనోద్రేకాలు, స్త్రీ వ్యామోహం, వాటిని నియంత్రించుకొంటూ సామాజిక విలువలను పాటించకపోతే వచ్చే పరిణామాల్ని హెచ్చరించే కథలు కూడా ఉన్నాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పొందడమెంత ముఖ్యమో, ఆ గౌరవమర్యాదలు మనిషి అంతరంగ సంఘర్షణకు గురికాకుండా కాపాడాలి. అలా కాపాడుకోవాలంటే అది మనిషి తనలో తాను చూసుకోగలిగినప్పుడే సాధ్యమవుతుంది. అది తెలిసినా గోముఖవ్యాఘ్రాల్లా ప్రవర్తిస్తుంటే, ఏదో ఒకనాడు ఆ నిజమైన ముఖం బయటపడక తప్పదని చెప్పేకథ కూడా ఉంది.

కథని ఎలా రాయాలో, ఎంత బిగువుగా రాయాలో తెలియాలంటే ఈ కథలు కొన్ని నమూనాలుగా ఉపయోగపడతాయి. కథకు శీర్షిక పెట్టడం, కథను ప్రారంభించడం, కథను ముగించటం, ఆ శీర్షిక కథకు ఎలా సరిపోతుందో తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న వాళ్ళు కూడా ఈ కథల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కొన్ని నిర్మాణ రహస్యాలు తెలుస్తాయి. వీటన్నింటితో పాటు కథ రాయడం వెనుక సృజనాత్మక రచయిత ఆ వస్తువుకి సంబంధించిన వివిధ విషయాలను సహజంగా కథలో అమరిపోవడానికీ ఆ నేటివిటీ తీసుకొని రావడం కోసం కథ వెనుక పాఠకులకు కనబడని రచయిత కథ ఎంతో ఉంటుందని తెలుస్తుంది. ఈ కథలకు పెట్టినపేర్లు, పాత్రల పేర్లు, సందర్భాన్ని బట్టి చేసిన వర్ణనలు, కథలోని ఎత్తుగడ, కథ నడిపించిన తీరుతెన్నులని వివరిస్తూ ప్రత్యేకించి ఒక పరిశోధన పత్రాన్నే రాసే అవకాశం ఉంది. ఈ పుస్తకంలో ***మూడు చక్రాల సైకిల్*** పేరుతో రాసిన కథ– భార్యాభర్త ఒక చక్రంగాను, వాళ్ళను, వాళ్ళ వంశాన్నీ ముందుకు తీసుకొని వెళ్ళే పిల్లలను మిగతా రెండు చక్రాలుగాను పోలుస్తూ కథకు ఒక

మంచి టైటిల్ పెట్టారు. కథలో మూడు చక్రాలు విడిపోయి, ఒక చక్రం మాత్రమే పెట్టడానికి వీలవుతుందని చెప్పడంలోని భావి కథాసూచనకు చక్కని ప్రతీక. ఇలా ప్రతి కథకు పెట్టిన టైటిల్స్ ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయి. ఎంతో ఔచిత్యంగా భాసిస్తున్నాయి.

సృజనాత్మక రచయిత కథగానీ, నవలగానీ రాసేటప్పుడు దానిలోని వస్తువునీ, దాని పూర్వాపరాల్ని సూక్ష్మంగా పరిశీలించి, ఒక అవగాహనకు రావాలి. ఒక సృజనాత్మక రచన చేయడానికి ఆ వస్తువు, దాన్నెలా పాఠకునికి అందించాలనే భావన రచయితను నిద్రపోనివ్వదు. అంతేకాదు, ఆ పారిభాషిక పదాలను కథకు అనుకూలంగా సులభంగా చెప్పాలి. పారిభాషిక పదాన్ని చెప్తున్నట్లు కాకుండా సంభాషణలోనో, వర్ణనలోనో అంతర్భాగం చేయగలగాలి. అటువంటి పరిశీలన, సృజనశీలత వంటివన్నీ ఈ రచయిత కథల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఈ కథల్లో డాక్టర్ కి సంబంధించిన వస్తువుతో కథలు చెప్తున్నప్పుడు ఆ వైద్యశాస్త్రానికి సంబంధించిన పరిభాషను వాడటంలో సన్నివేశానికి అనుగుణంగా సహజంగా అమరిపోయేటట్లు చిత్రించారు. మానవీయ సంబంధాల్లో శారీరకసంబంధాలు, వాటివల్ల వచ్చే మానసిక సంఘర్షణలు యువకుల్ని మాత్రమే కాదు, అన్ని వయసుల వాళ్ళనూ ఆలోచింపజేస్తాయి. వ్యక్తులు కొన్నిసార్లు తమలో ఎన్నో శక్తియుక్తులు ఉన్నా, చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం, ఆ మానవీయ సంబంధాల వల్ల తమ ఆలోచనా శక్తి నశించిపోతుంది. తమను అశాంతికి గురిచేసే అంశమేమిటో గుర్తించలేక తనపైనా, తన పనులపైనా, తన చుట్టూ ఉన్నవాళ్ళపైనా పరస్పరనిందారోపణలు చేసుకుంటారు. వాటికి దేవుడు, దెయ్యం వంటి వారిని కారణాలుగా కూడా చూపుతుంటారు. ఈ అంశాల్ని కూడా స్పృశిస్తూ మానవుడెంత విద్యావంతుడైనా సమస్యల్లో కూరుకుపోయినప్పుడు తనలోని హేతువుని కూడా మర్చిపోతాడు. ఆ సమయంలో వైద్యుడవసరం. ఆ వైద్యుడు స్నేహితుడు కావచ్చు, ఆ వైద్యుడు భర్త కావచ్చు, ఆ వైద్యుడు ఆ అంతరంగాన్ని పట్టుకోగలినవాడై, మానసిక సాంత్వన కలిగించగలిగినవాడై ఉండాలి. అప్పుడు మరలా కోల్పోయిన శక్తియంతా బయటకొస్తుంది. ఇటువంటి మానవీయ సంబంధాలు పెరగాలంటే పరస్పర అవగాహన ఎంతో ముఖ్యం. సమస్యను ఒకేకోణంలో నుండి మాత్రమే చూడకుండా, భిన్న పార్శ్వాలలో నుండి దర్శించగలగాలి. ఆ మార్గాల్ని సూచించే కథలు కూడా దీనిలో ఉన్నాయి.

## మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ఈ కథల్లోని ప్రతీకథానిర్మాణం ఎంతో పటిష్ఠంగా ఉంది. ఒక సంభాషణను గానీ, సన్నివేశాన్నిగానీ, ఒక పాత్రను గానీ, ఒక వర్ణనను గానీ చిన్నమార్పు చేయడానికి కూడా వీల్లేనంత పటిష్ఠంగా కొనసాగాయి. ముఖ్యంగా కథల్లో అక్కడక్కడా సందర్భోచితంగా చేసిన వర్ణనలు కథలకు ప్రాణాన్నిస్తున్నాయి.

ఈ కథలు ప్రచురించిన పత్రికల్లో ఎలా అచ్చయ్యాయో అలాగే యథాతథంగా ఈ పుస్తకంలోనూ ప్రచురిస్తున్నారు. ప్రతి కథకు ఎంతో అర్థవంతమైన చిత్రాలను వేశారు. చిత్రకారుడు ఆ కథను చదవకపోతే వాటిని అంత సజీవంగా వేయలేడు. అందువల్ల ఆ చిత్రాలను కూడా ఈ పుస్తకంలో వేయడం మంచి నిర్ణయం. ఆ చిత్రకళాకారుడు కూడా మరింతకాలం సజీవంగా ఉంటాడు. ఆనాడు ప్రచురించిన పత్రికలను చూశాను. ఆ ఫాంట్ కొంచెం చదవడానికి ఇబ్బంది. వాటినే స్కాన్ చేసి ప్రచురించకుండా కళ్ళకు ఇబ్బందిలేని మంచి ఆధునిక తెలుగు ఫాంట్ లో మళ్ళీ డిటిపీ చేయించి ప్రచురిస్తున్నారు. ఆ కథలో వాడిన భాషను నేటి భాషకు అనుగుణంగా మార్పులు, చేర్పులు ఏమైనా చేశారేమోనని పరిశీలించాను. కానీ, అదే భాషలో తీసుకొస్తున్నారు. కొన్నిచోట్ల సరళ గ్రాంథికాన్ని కొనసాగించినా, కొన్ని క్రియా పదాలురచయిత శైలిని ప్రత్యేకంగా గుర్తించేలా చేస్తాయి. ఆయన మాకు పాఠం చెప్తున్నప్పుడు కూడా ఆయన అలాగే మాట్లాడ్డాన్ని గుర్తుకు తెస్తూ ఒక ఆత్మీయ స్పర్శనిస్తున్నాయి. ఆయనతో సంభాషించిన వారికీ ఆయన భాషలోని సొంతదనం తెలుస్తుంది. ఆ భాషలోని మాధుర్యానికున్న రుచి తెలుస్తుంది.

ఈ కథలు చదవడం ద్వారా మా గురువుగారు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు ఆ యౌవనకాలంలో రాసిన కథలు అలాగే రాయడాన్ని కొనసాగించి ఉంటే బాగుండుననిపించింది. అదే కనక జరిగితే తెలుగు కల్పనా సాహిత్యంలో ఆయన గట్టి ముద్రే వేసుండేవారనిపిస్తుంది. అయినా, లభించిన ఈ కథల ద్వారా కూడా కథ రాయడంలోని బిగువునూ, ప్రారంభం, ముగింపులతో పాటు కథకవసరమయ్యే వర్ణనల్నీ, చదివించే ఉత్సుతనీ, కథ పూర్తయ్యాక కూడా వెంటాడే దృశ్యాల్నీ, వినిపించే సంభాషణల్నీ పాఠకులెవరూ మర్చిపోలేరు.

తమ కథలపై ఒక అభిప్రాయం రాయడానికి అవకాశం కలిగించినందుకు మా గురువుగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ISSN 2457-0796

UGC Care List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10 (49) హైదరాబాద్ ఆగస్టు : 2023

# కూచిమంచి తిమ్మకవి శతక సాహిత్యం – సమకాలీనత

**డా. మల్లిపూడి రవిచంద్ర,** ఫోన్ : 95734 449282



**సంకేతపదాలు : వివరణ**

కుక్కు. – కుక్కుటేశ్వరశతకము

చిర. – చిరవిభవశతకము

భర్గ. – భర్గశతకము

**సంక్షిప్తి :** ప్రాచీనసాహిత్యపు పరమ ప్రయోజనం ఉపదేశం. అలాంటి ప్రాచీన తెలుగు సాహిత్యంలో శతకాలకు ఒక విశిష్ట స్థానముంది. సర్వకాల సర్వావస్థలలోనూ అన్వయయోగ్యమైన మనిషి నైతికజీవనం, మానవత్వపువిలువలు వంటి అనేక విషయాలనే శతకకవులు ఎక్కువశాతం వర్ణించారు. అందుకే ఉపదేశాత్మక కవిత్వంలో శతకాలకు, అందునా నీతిశతకాలకు ఉన్నతపీఠం వేయబడింది. ఇటువంటి విషయాలను స్పృశిస్తూ, 17–18 శతాబ్దుల కాలానికి చెందిన కూచిమంచి తిమ్మకవి ఏ కాలంలోనైనా చెప్పుకోదగిన దురాశ, అవకాశవాదం, దోపిడి, మూర్ఖప్రవృత్తి, డాంబికం, లోభం, మోసం, క్రూరత్వం, కాపట్యం, సాంఘిక అసమానత ... మొదలైన సామాజిక విషయాలను తన శతకాలలో నీతి ఉపదేశంగా చెప్పిన తీరును ఈ వ్యాసం విశ్లేషిస్తుంది.

**ఉపోద్ఘాతం :** ఉపదేశాత్మక కవిత్వంగా చెప్పాల్సి వస్తే మొత్తం తెలుగుసాహిత్యంలో శతకసాహిత్యానిదే అగ్రతాంబూలం. శతకంలో ఉండే ముక్తకలక్షణం వల్ల అది మిగిలిన సాహిత్యం కంటే విశిష్టం గానూ, తెలుగుప్రజల విశేష ఆదరణ పొందిన, పొందుతున్న శక్తిమంతమైన ప్రక్రియగానూ పేరుకెక్కింది.

శతకాలలో భక్తి, స్తుతి, వేదాంత, తత్త్వ, శృంగార, వైరాగ్య, హాస్య, అధిక్షేప శతకాలుగా అనేక భేదాలున్నాయి. కానీ, శతకాలు అనగానే తెలుగువారికి వెంటనే స్ఫురించేవీ, వారి లోగిళ్ళను వరించేవీ నీతిశతకాలు మాత్రమే. అందుకు కారణం సమాజంలోని ఏ స్థితికైనా, ఏ సందర్భానికైనా అన్వయించుకుని, వక్రమార్గంలో నడుస్తున్న మనిషి జీవన స్థితిగతులను సన్మార్గంవైపు మళ్ళించేందుకు కారణభూతమైన ఉపదేశం నీతిశతకాలకు జీవం కావడమే. ఆ జీవ లక్షణమే నీతి శతకాలను నేటికీ సజీవంగా, సమకాలీనతకు దగ్గరగా నిలిపి ఉంచింది.

ఉపదేశం అంటే హితవచనం అని నైఘంటికార్థం. అంటే మంచిమాట. సమాజం (మనుషుల)లో విభిన్నరూపాలలో విజృంభిస్తున్న అధర్మాన్ని ఎత్తి చూపించి, ఆ సమాజం ధర్మానికి కట్టుబడి ఎలా నడుచుకోవాలో చెప్పడమే ఉపదేశం. అందుకు ద్రష్టలు, మునులు, ధర్మశాస్త్రజ్ఞులు, సూత్రకారులు, సంస్కర్తలు, కవులు మొదటి నుండీ సాహిత్యాన్ని వాహకంగా వాడుకున్నారు. ప్రభుసమ్మితంగా కొందరు, మిత్రసమ్మితంగా కొందరు, కాంతాసమ్మితంగా కొందరు ఉపదేశిస్తూ వచ్చారు.

తెలుగుసాహిత్యంలో తొలినాళ్ళలో జగద్ధితమైన భారత భాగవతాలు, కావ్యాదులు ఉపదేశానికి ఆలంబనమయ్యాయి. ఉపదేశమే వాటి పరమావధి అయ్యింది. కానీ పరిణామక్రమంలో మాత్రం శతకాలే దానికి ఎక్కువ ప్రాచుర్యాన్ని కల్పించాయి. 1600–1800 ప్రాంతంలో శతకాలు, అందునా నీతిశతకాలు విశిష్టస్థాయిలో వెలుగు చూశాయి. ఆ కాలం శతకసాహిత్యానికి ఒక స్వర్ణయుగంలాంటిది. ఆ కాలపు కవులు ఉపదేశానికి శతకాలను ఉపకరణంగా ఎన్నుకుని, అందులో నీతిని చొప్పించి, సమాజానికి అందించారు. అలాంటి మహాకవులలో కూచిమంచి తిమ్మకవి విశిష్టుడు.

కూచిమంచి తిమ్మకవి 17–18 శతాబ్దుల కాలానికి చెందిన కవి. ఈయన చిరవిభవ, భర్గ, కుక్కుటేశ్వరశతకాలను మూడింటిని రచించాడు. పరమ శివభక్తుడైన తిమ్మకవి శివుని పేరును మకుటాలుగా మార్చుకుని ఈ మూడు శతాకాలను కూర్చాడు. ఇవి నీతిశతకాలు. వీటిలో తిమ్మకవి భక్తిప్రపత్తులకు కూడా స్థానముంది. 'ఉత్తరోత్తర బలీయం' అన్నట్లుగా మొదటి శతకమైన చిరవిభవ శతకంలో నీతి చాలా తక్కువగానూ, భక్తి ఎక్కువగానూ, రెండవదైన భర్గశతకంలో నీతి, భక్తి రెండూ సమతూకంగానూ, కుక్కుటేశ్వర శతకంలో భక్తి సముచితరీతిలోనూ, నీతి చాలా ఎక్కువగానూ కనిపిస్తాయి. పాడైపోతున్న సమాజం(మనుషుల)లో మార్పు తీసుకు రావాలనే తిమ్మకవి కాంక్ష చిరవిభవశతకంలో బీజప్రాయంగా కనిపించి, భర్గశతకంలో కాండమై, ఆకులు తొడిగి, కుక్కుటేశ్వర శతకంలో చిలవలు పలవలువేసి పుష్ప ఫల శోభితమయ్యింది.

శతకకవులందరి మాదిరిగానే తిమ్మకవి కూడా తనకాలపు సమాజంలో తామరతంపరగా పెరిగిపోయిన దురాశ, అవకాశవాదం, దోపిడి, మూర్ఖప్రవృత్తి, డాంబికం, లోభం, మోసం, క్రూరత్వం, కాపట్యం, సాంఘిక అసమానత... వంటి

వాటిని సునిశితంగా పరిశీలించాడు. కానీ, వాటిని తెలియజెప్పే విషయంలో మాత్రం అందరూ ఎన్నుకునే సాధారణ నీతి మార్గాన్ని కాకుండా అధిక్షేపనీతి మార్గాన్ని ఎన్నుకుని తన ప్రత్యేకతను చాటుకున్నాడు. **'మన శాస్త్రాలలోని సామ దాన భేద దండోపాయాలలాగే ఈ అధిక్షేపనీతి కూడా ఒకటి. మంచిని సామాన్యరీతిలో చెప్పడం నీతి. విననివారికి అదే మంచిని మందలించి, పరిహసించి, ఎత్తిపొడిచి, విమర్శించి, ఎగతాళి చేసి, ఖండించి చెప్పడం అధిక్షేపం'** (గోపాలకృష్ణారావు, కె.1976:422 ). అదే తిమ్మకవి తన శతకాలలో పాటించాడు.

తిమ్మకవి శతకాలలో వర్ణించబడిన తన సమకాలీనాంశాలు నేటికీ మనకు అనేకం కనిపిస్తాయి. ఆయన శతకాలలో ప్రతిపద్యంలోనూ నేటిసమాజం ప్రతిబింబిస్తుంది. అయితే, వ్యాస పరిమితుల దృష్ట్యా వాటిలో కొన్నిటిని మాత్రమే ఇక్కడ చర్చిస్తున్నాను.

**దురాశ :** అవసరానికి మించిన ఆశ ఉండడమే దురాశ. ఆ ఒక్క కారణంగానే మనిషి సర్వభ్రష్టుడై, లోకంలో అనేక అనర్థాలను సృష్టిస్తున్నాడు. ఈ కాలపు మనిషికి అది మరీ మితిమీరిపోయింది. అటువంటి వారిని ఉద్దేశిస్తూ తిమ్మకవి ఆనాడే ఇలా–

**సీ. కొండంత విత్తంబు గూడఁ బెట్టిన నైనఁ,**
**బొదలు ధనాపేక్ష వదలిపోదు**
**స్వర్గాధిపత్యంబు సంభవించిన యేని,**
**బహురాజ్య కాంక్ష యెప్పటికిఁ జనదు.** (కుక్కు: 64)

అంటూ 'కొండంత ధనాన్ని సంపాదించినా, మనిషికి ఇంకా ధనం కావాలి అనే ఆశ చావదు. అతనికి ఇంద్రపదవిని కట్టబెట్టినా పదవీవ్యామోహం, రాజ్యాధికార కాంక్ష విడిచిపోవు.' అని అధిక్షేపించాడు. అలాంటి భావననే మరో రూపంలో కింది పద్యంలో పొందుపరిచాడు.

హరహర మేరు భూధరమునంత పదార్థము సంగ్రహించిన
స్సురనగరాధిపత్యము త్రిశుద్ధిగనబ్బిన రంభయంత సుం
దరి నిజభార్యయైన మది తార్కొను తృష్ణయడంగదేరికిన్
(చిర.:70).

మనిషికి కొండంత ఆశకు తగ్గట్టు పర్వతాలంత కలిమి కలిగినా, అతనిలో ఇంకా కావాలి అనే దురాశ మాత్రం పోదు. అది నిరంతరం జ్వలిస్తూనే ఉంటుంది. నేటి సమాజంలో ఆ దురాశ డబ్బుదస్కం పట్ల ఉండడం ఒక ఎత్తైతే, పరాకాష్ఠకు చేరిన ఆ దురాశ రంభలాంటి భార్య ఉన్నా పరస్త్రీలను, పసిపిల్లలను వాంఛించడం, తుంచడం వైపు మళ్ళడం మరో ఎత్తు. ఇలాంటి దుష్పరిణామాలకు కారణాన్ని కూడా చూపించాడు కవి.

సిరికిఁ దోఁ బుట్టువౌ జ్యేష్ఠామహాదేవి,
దీనతనింటింటఁ దిరుగఁ సాగె
హరికిఁ గూరిమి పట్టియగు మకరాంకుడు,
మెయిలేక సోఁకుదై మెలఁగుచుండె. (కుక్కు: 84)

అంటూ నేటి సమాజంలో విష్ణుమూర్తి కొడుకైన మన్మథుడు (కామం) తనకు శరీరం లేకపోయినా ఏదో ఒక శరీరాన్ని ఆశ్రయించి, దాదాపు ప్రతి ఇంటిలోనూ తిరుగుతుండడమే కారణం అన్నాడు. అలాగే లక్ష్మీదేవి అక్క జ్యేష్ఠామహాదేవి అంటే దరిద్రదేవత (పేదరికం) దీనంగా ప్రతి ఇంట్లోనూ తిరుగుతోందనీ పై పద్యంలో చెప్పాడు. భారతీయ సమాజాలలో కామవాంఛ, పేదరికం వంటివి పెను సమస్యలుగా పరిణమిస్తున్నాయనే ఎరుకను ఆనాడే తిమ్మకవి సమాజానికి తెలిపే ప్రయత్నం చేశాడు. అవి కాస్తా నేడు విపరీతరీతిలో పెరిగిపోయాయి. ముఖ్యంగా మన్మథుడిని జయించడంలో మనిషి పూర్తిగా విఫలమయ్యాడనడానికి నేటి సంఘటనలే ప్రత్యక్షసాక్ష్యాలు. పేదరికాన్ని ఇంట్లో నుండి, కామాన్ని ఒంట్లో నుండి పారదోలాల్సిన అవసరం నేడు చాలా ఉందని పై పద్యం నర్మగర్భంగా తెలియజేస్తోంది.

**దోపిడి :** సమాజంలో కేవలం అందరూ అనుకునే దొంగలు మాత్రమే దోపిడి చెయ్యడం లేదు. అమాయకులైన, చదువులేని పేదప్రజల దగ్గరనుండి అధర్మంగా పాలకులు, అధికారులు కూడా దోచుకుంటున్నారు. ఇది తిమ్మకవి కాలపు మాట మాత్రమే కాదు ఈ కాలపు మాట. సర్వకాలాలకూ సమకాలీనమైన మాట. కరణాలు ప్రజల దగ్గర ఎలా దోచుకొనేవారో! అలాంటివారి పట్ల ప్రజలభావాలు ఎలా ఉండేవో! అచ్చతెలుగులో వారి యాసలోనే వివరించాడు తిమ్మకవి.

**కరణాలటంటను కైలకట్టల యిప్పి,**
**పాతికలంటను పరిగలంట**
**కాన్లంట గీన్లంట కలయి లేనియి కొన్ని,**
**సెల్లులు బాకీలు సెప్పుకుంట**
**బిరబిర గంటాలు గిరగిర దిప్పుతా,**
**నాకులన్నియు నెదు గోకుకుంట**
**యెగరాసి దిగరాసి సగమేసి ఎగదొబ్బి,**
**కొంపలు పడదోసి సంపుతారు**
**దయ్యమా కాయ కసరైన దక్కనియ్య,**
**రేమి సేయుదు మను మోటులిలను గలరు...**(కుక్కు: 31)

'కరణాలమంటూ వచ్చి, లెక్కల పుస్తకం విప్పి, పాతికనీ పరిగనీ, ఉన్నవి లేనివి కల్పించి, తీర్చిన అప్పు, తీర్చాల్సిన బాకీ గురించి చెబుతూ, వెంటవెంట గంటం తిప్పుతూ, పైన, కింద ఏవేవో రాసి, తప్పుడు లెక్కలు చూపించి, కొంపలు కూలుస్తారు. చివరికి కాయలను, పిందెలను కూడా దక్కనీయరు. ఏం చేయగలం?' అంటూ కరణాల దోపిడి గురించి చదువులేనివారు (మోటులు) ఎలా చెప్పుకొనేవారో తాను ఒక కరణమై ఉండి కూడా నిర్భయంగా చెప్పాడు. వాళ్ళ మాటలకు అక్షర రూపమిచ్చి ప్రజల పక్షాన నిలిచాడు.

తెలుగు సాంఘికచరిత్రకు ముడిసరుకులాంటి ఎన్నో విషయాలను తన కవిత్వం ద్వారా అందించాడు.

అలాగే రైతులను దోచుకొనే విధానాన్ని కూడా పూసగుచ్చినట్లు కింది పద్యంలో వివరించాడు.

**ఎద్దుమందను గూర్చి యెగసాయమిడితేనిను,**
**తుదనది యధికారి దోసుకొనియె**
**దావుదప్పుల కంట ధర్మకర్చులకంట,**
**కాసువీసములాగె కరణపయ్య**
**సల్లమ్మి సవకమ్మి సిల్లర దాసితే**
**కోమటి నాబంటు కొడుకు దొబ్బె**
**కళ్ళము కంకులు గాలిc బట్టగc బోతె,**
**బట్టి బాపనవోళ్ళు బతకనీయ రహహ...** (కుక్కు.:32)

'ఎద్దులను జతచేసుకొని వ్యవసాయం చేస్తే పంట చేతికందే సమయానికి అధికారులు దోచుకుపోతున్నారు. ఆ ఖర్చులకనీ, ఈ ఖర్చులకనీ ఉన్న డబ్బులను కాస్తా కరణాలు లాక్కొంటున్నారు. చల్ల, సరుకులు అమ్మి చిల్లర కూడబెడితే వ్యాపారులు దోచుకొంటున్నారు. కళ్ళంలోని ధాన్యమైనా పోగుచేసుకొందామంటే బ్రాహ్మణులు బతకనీయడం లేదు' అంటూ రైతులు తమ గోడును విన్నవించుకొనే విధానాన్ని వారి మాటల్లోనే చెప్పాడు. చెడ్డవారివల్ల పేదరైతులు ఎన్ని రకాలుగా దోపిడీకి గురవుతున్నారో కూడా కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. ఇక్కడ కవి రైతుల మాటగా కులాల ప్రస్తావన చేశాడు. తద్వారా ఆయా కులాలకు కళంకం తెచ్చే దోపిడిదారులను నిరసించాడు తప్ప నేరుగా కులాలను నిరసించలేదు. అయితే, నేటి సమాజంలో ఇలా దోపిడీ చేసేవారి స్థానాలు మారాయి. దోపిడీ చేయడం మాత్రం మారలేదు. ప్రజాసంక్షేమాన్ని చూసుకోవలసిన పాలకులలో ఇప్పుడది మరీ విచ్చలవిడిగా తయారయింది. 'ఇంతింతై వటుడింతయై...' అన్నట్లుగా విస్తరించుకుపోయింది. చిరుతిళ్ళు తిన్నంత తేలికగా భూములను మింగే స్థాయికి ఎదిగిపోయింది. అలాంటి వారిని గూర్చి సుమారు 250 సంవత్సరాల క్రితమే వివరంగా వర్ణించాడు తిమ్మకవి. ఆయన ద్రష్ట అని చెప్పడానికి ఇదొక తార్కాణం.

**మన్నెల్లం దన సొమ్మటంచు వసుధా మర్త్యోత్తమ క్షేత్రముల్**
**కన్నారంగని యోర్వలేక దిగమ్రింగం జూతురల్పప్రభుల్**
**వెన్నప్పంబులో బూరెలో వడలో భావింపంగ బొబ్బట్లొకో**
**యన్నా! యెన్నగ వారి పాలికవి? భర్గా! పార్వతీవల్లభా!**

(భర్గ.: 71)

'ఈ మట్టంతా తన సొమ్ము అన్నట్టుగా సమస్త భూమండలంలోని విలువైన ప్రాంతాలను చూసి, కన్నుకుట్టి దిగమింగాలని అధికారులు చూస్తున్నారు. అలా మింగడానికి అవేమైనా అప్పాలా? బూరెలా? వడలా? బొబ్బట్లా?' అని నిలదీశాడు. ఆ కాలానికే కాదు ఈ కాలానికీ ఆ పద్యం సరిగా సరిపోతుంది. ఇంకా చెప్పాలంటే మైనింగ్, యురేనియం...వంటి భూగర్భ వనరుల కోసం విచ్చలవిడి ఆక్రమణలకు పాల్పడుతున్న ఈ కాలపు అధికారులకు, రాజకీయనాయకులకు వందశాతం అన్వయమవుతుంది. ఇలాంటి ఆక్రమణలకు 17- 18 శతాబ్దుల కాలంలోనే భూమిక ఏర్పడిందని చెప్పడానికి తిమ్మకవి శతకాలే సాక్ష్యాలు.

**డాంబికం :** ఉన్నదానికంటే ఎక్కువ చెప్పుకోవడం డాంబికం. కొంతమంది పొరుగువారికి సహాయం చేయరు. మరికొంతమంది చేసింది కొంచెమైనా దానికి రెండింతలు జోడించి, చాలా గొప్పగా చెప్పుకుంటారు. తమంతటి వారు లేరని వాపోతారు. అలాంటి వారు మన సమాజంలో కోకొల్లలు. కవి వారిని ఇలా అభివర్ణించాడు.

**అబ్బబ్బ కిందటే దప్పయ్య తీర్తాన,**
**జోలె జంగముకిస్తి సోలెcడుప్పు**
**సాతాని జియరయ్య సతికితే పోయిస్తి,**
**కొల్లఉగా గుల్లెcడు సల్లబొట్టు**
**లంక సత్తెల వాcడు పొంకాన పొగిడితే,**
**మాలదాసరికిస్తి మానెఉడూద**
**వేదాలు వాగితే యెల్లు బొట్టయ్యకు,**
**కొలకుండ దోసెఉడు కొఱ్ఱలిస్తి**
**నౌర తమకన్న కూసుగాc దవల నింకc,**
**గలcడె యను మూర్ఖుcడిద్ధరc గామవైరి.** (కుక్కు.: 25)

'అబ్బబ్బ! కిందటి ఏడాది అప్పయ్య తిరునాళ్ళలో జంగమయ్యకు సోలెడు ఉప్పు ఇచ్చాను. సాతాని జియ్యరుకు గుల్లెడు చల్లబొట్లు పోయించాను. మాలదాసరికి మానెడు ఊద ఇచ్చాను. వేదాలు చదివిన బొట్టయ్యకు దోసెడు కొఱ్ఱలిచ్చాను. అలాంటి నాకంటే దానం చేసే గొప్పవాడు ఎవడున్నాడు?' అనే వాళ్ళను నిరసించాడు కవి. అయితే, కాలం మారింది. ఆ కాలానికి, ఈ కాలానికి చేసే పనులలో మార్పు వచ్చింది. కానీ గప్పాలు చెప్పుకోవడంలో ఎటువంటి మార్పూ లేదు. అలాంటి వారు ఈ కాలంలో ఇంకా ఎక్కువే కనిపిస్తారు. చేసింది కొంచెమైనా వాళ్ళ గొప్పకోసం మరికొంత జోడించి ప్రచారం చేసుకొంటూ ఉంటారు. అలాంటివారికి తిమ్మకవి పద్యాలు గట్టి చురకలు. పై పద్యంలో తెలుగువాళ్ళు ఆ కాలంలో ఉపయోగించిన కొలమానాలను, ధాన్యవిశేషాలను కూడా గమనించవచ్చు.

**సమానత్వం :** సమాజంలో అంటరానితనం అనేది ఒక మహమ్మారిగా మారి నిమ్నకులాల వారిని ఒకప్పుడు ఎంత పీడించిందో అందరికీ తెలిసిన విషయమే. అప్పట్లో సమసమాజ స్థాపన కోసం సంస్కర్తలే కాదు కవులు కూడా చాలా కృషి చేశారు. సమాజంలో అందరూ సమానులేననీ, నిమ్నకులాలవారు కూడా మనుషులేనని కవులు తమ రచనల ద్వారా చాటి చెప్పారు. తిమ్మకవి కూడా ఆ కాలంలోనే దళితులను అస్పృశ్యులుగా ఎంచిన వారికి

తన కవిత్వం ద్వారా గుణపాఠం నేర్పాడు.

మెరమరలేక నీవు మును మేదరి సెట్టియు బోయలెంకయున్
బెరసు కులంపు చాకలియు బెట్టిన యోగిర మారగించి తౌ
సరిసరి నిన్ను నర్చనలు సల్పెడుచో నియమంబులేలయా
చిరవిభవా భవా విజిత చిత్తభవా యభవా మహాభవా!
(చిర.: 39)

'నిష్ఠతో, నియమంతో పెట్టిన ఆహారం తినాల్సిన నీవు ఎటువంటి అనుమానం లేకుండా నియమాలను ఉల్లంఘించి పూర్వం మేదరి, బోయ, చాకలి... మొదలైన వెనుకబడిన తరగతులవారు పెట్టిన ఆహారాన్ని ఆరగించావు. నిన్ను పూజించడమనే నియమం కలిగినవారికి బాహ్య నియమాలెందుకు?' అంటూ దేవుడికి విన్నవించుకొన్నాడు. భగవంతుని ఆరాధన అనే నియమం ఉన్న వారికి మిగిలిన నియమాలు అవసరం లేదనీ, దేవుడి ముందు అందరూ సమానులే అని తేల్చి చెప్పాడు. ఒక కులంవారే దేవుని పూజించడానికి అర్హులు, మిగిలిన కులాలవారు అర్హులు కాదు అనే నియమాలు లేవనీ, ఆత్మశుద్ధి కలిగి పరమేశ్వరుడిని పూజిస్తే చాలని నిర్ధారించి, సమానత్వాన్ని చాటాడు. అంతేకాదు దళితులను సమానభావనతో చూడాలని చెప్పడం కింది పద్యంలో కనిపిస్తుంది.

డాయన్రాద యటంఠ్రు మాదృశులు చండాలాదులన్దాసినన్
బాయుం బుణ్యచయంబు లంచుఁ జదువుల్పల్కంగనీ వయ్యయో
బోయండెంగిలి మాంసమిచ్చుటకు లోబుల్పాని చేకొంటి వే
ప్రాయశ్చిత్తము కద్దు దీనికిక? భర్గా! పార్వతీవల్లభా!
(భర్గ.: 41)

'నాలాంటివారు (అగ్రకులస్థులు) దళితులను తాకరాదనీ, తాకితే అగ్రకులస్థల సంచిత పుణ్యఫలం పోతుందనీ శాస్త్రాలు చెబుతున్నాయి. అయినా నీవేమో బోయవాడు పెట్టిన ఎంగిలి మాంసాన్ని ఇష్టంగా స్వీకరించావు. నువ్వు చేసిన పనికి ఏ ప్రాయశ్చిత్త ముంది? (లేదని భావం)' అని శివుడిని నేరుగా ప్రశ్నించాడు. అంటే శివుడు చేసిన పనికి ప్రాయశ్చిత్తం లేదంటే ఆ పని అసలు పాపమే కాదు. మరి పాపం కానప్పుడు తనబోటి వాళ్ళకు ఈ అంటరానితనం ఎందుకు? అనే గూఢమైన భావాన్ని చొప్పించాడు. నేటికీ అసమానతను, అంటరానితనాన్ని పాటిస్తున్నవారు ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి ఇంతకు మించి ప్రేరేపించే ఉపమానం వేరే ఉండదని నిర్ద్వంద్వంగా ఆనాడే చెప్పాడు. ఆ రోజుల్లోనే తిమ్మకవికి సమసమాజ కాంక్ష ఎంత గాఢంగా ఉండేదో పై పద్యం సాక్ష్యమిస్తుంది.

**లోభం** : లోభి గురించి కవులు అనేకరకాలుగా వర్ణించారు. తిమ్మకవి కూడా ఆ తరహాలోనే అనేకపద్యాలు చెప్పాడు. వాటిలో ఈ కింది పద్యం లోభి వ్యక్తిత్వాన్ని స్థాలీపులాకంగా పట్టి చూపిస్తుంది.

కలుముల్నిక్కమటంచు నమ్మి తులవల్గర్వాంధులై యెన్నఁడున్
బలి భిక్షంబులు పెట్టకుంఠ్రు పిదపం ప్రాణంబులంబాసి యా
ఖలులేమౌదురొ? వాంఠ్రు గూరిచిన రొక్కంబెల్ల నే మౌనొకో?
కలుషోద్గాఢ తమస్సహస్రకర! భర్గా! పార్వతీ వల్లభా!
(భర్గ.: 88)

'లోభులు ధనమే శాశ్వతమని భావిస్తూ, పిల్లికి కూడా భిక్షం పెట్టకుండా కూడబెడతారు. ఆ సంపదవల్ల కలిగిన గర్వంచేత విర్రవీగుతారు. కానీ చనిపోయిన తర్వాత ఆ గర్వాంధులు ఏమవుతారు? వాళ్ళు కూడబెట్టిన ధనం ఏమవుతుంది?' అని కవి పరిహసించాడు. ఏదీ శాశ్వతం కాదనే విషయాన్ని ఎరిగి ఉంటే మనుషులు లోభులు, అహంకారులు కారనే విషయాన్ని నిక్షిప్త పరిచాడు.

కలియుగ సమాజంలో సంపద ఎటువంటి స్థానాన్ని ఏర్పరచు కొందో వివరించే ఈ కింది పద్యం తిమ్మకవి నిశిత పరిశీలనకు ప్రబల ఉదాహరణ.

కులమునకెల్ల మిక్కిలితనం బొనఁగూడు,
నాడిన మాటయే పాడి యెసఁగు
నిఖిల విద్యాభ్యాస నిపుణత లభియించుఁ,
జేసిన పనులెల్ల వాసికెక్కు
మనుజేశ్వరాస్థాన మాన్యత సమకూఱుఁ,
గడ లేని తేజంబు గలిగి యుండు
కవి బుధ వంది మాగధులు చెల్మి ఘటించుఁ,
బగర యైనను వెంటఁ బడి చరించుఁ
గలియుగంబున నబ్బబ్బ కలిమి వంటి,
మంచి వస్తువు కలదె యోచించి చూడ. (కుక్కు.: 51)

అంటూ 'డబ్బు వల్ల మొత్తం వంశానికే గొప్పతనం ఒనగూరు తుంది. డబ్బున్నవారు ఆడిన మాటే చెల్లుబాటు అవుతుంది. అన్ని విద్యలను నేర్చుకొన్నంత నైపుణ్యం వస్తుంది. ఏ పనిచేసినా తేలికగా ప్రాచుర్యం లభిస్తుంది. ఎక్కడికి వెళ్ళినా గౌరవం దక్కుతుంది. కవులు, మేధావులు డబ్బున్నవారిని ఎల్లప్పుడు పొగుడుతూ ఉంటారు. శత్రువులు కూడా చెలిమి చేసుకోవడానికి వెంట తిరుగుతూ ఉంటారు. అలాంటి డబ్బువంటి గొప్ప వస్తువు కలియుగంలో మరొకటి ఉన్నదా?' అని సర్వకాల సర్వావస్థలలోనూ సంపదకున్న గొప్పతనాన్ని, దాని వల్ల కలిగే ప్రయోజనాలను అద్భుతంగా వర్ణించాడు.

నిజానికి పై పద్యంలో సంపదకు సంబంధించిన ప్రయోజనాలను అనుకూలంగా చెప్పినట్టు కనిపించినా అందులో దెప్పిపొడుపు ఉంది. మనుషులు డబ్బు మాత్రమే సంపాదించి సమాజంలో ఎలా చక్రం తిప్పుతున్నారో? సమాజాన్ని వాళ్ళ చుట్టూ ఎలా తిప్పు కొంటున్నారో వ్యంగ్యంగా చెప్పాడు. ఎన్ని సుగుణాలున్నా, ఎంత విద్య ఉన్నా దక్కని గౌరవం డబ్బు అనే ఒక వస్తువు వల్ల కలుగుతోంది కదా! అనే బాధనూ వెళ్ళబుచ్చాడు. అప్పటి సమాజం సంగతి పక్కన పెడితే నేటి సమాజానికి మాత్రం పై పద్యం చక్కగా

అన్వయించబడుతుంది. నేటి సమాజంలో డబ్బుకి, డబ్బున్నవారికీ ఉన్న గౌరవం మరెవ్వరికీ లేవనడం అతిశయోక్తి కానేకాదు.

అయితే, ఎప్పటికైనా మంచితనమే గెలుస్తుంది, నిలుస్తుంది అన్నట్టుగా సంపన్నుడి కంటే సత్సంపన్నుడే పది కాలాలు, పదుగురి హృదయాలు గెలిచి నిలచి ఉంటాడు. అతనే సజ్జనుడు. సజ్జనుడు మంచితనంతోపాటు ధనం కూడా సంపాదిస్తే దాని వల్ల సమాజానికి కలిగే మేలే వేరు. ధనం సంపాదించినంత మాత్రాన, దానివల్ల సమాజంలో గౌరవం దక్కినంత మాత్రాన అందరూ సజ్జనులు కాబోరని తెలియజేశాడు తిమ్మకవి. ఎంత సంపాదించినా శాశ్వతం కాదనీ, మనిషి మరణానంతరం ఏమీ తీసుకుపోడనే నగ్నసత్యాన్ని కింది పద్యంలో వివరించాడు.

"మొదవుల బదివేలు కదుపులు గూర్చిన,
దూడ యొక్కటి యైనఁ దోడ రాదు
మాడలసంఖ్యముల్ మాటుగా నించినఁ,
బసిఁడి వీసమును వెంబడిని రాదు" (కుక్కు.: 63)

'పశువులు పదివేలు సంపాదించినా చనిపోయినప్పుడు ఒక్క దూడైనా తన తోడరాదు. లెక్కలేనన్ని మాడలు సంపాదించినా వీసమెత్తు బంగారమైనా వెంటరాదు' అనే ఎరుక కలిగి, న్యాయంగా సంపాదించిన దానిలో కొంత ఇతరులకు దానం చేసే వారే సజ్జనులనీ స్పష్టం చేశాడు.

మనిషి లోభాన్ని విడిచిపెట్టి, మూర్ఖత్వాన్ని వదిలిపెట్టి, గొప్పలు చెప్పుకోవడం కట్టిపెట్టి, ఉన్నదానిలో కొంత పంచిపెట్టి, లోకంలో అందరూ సమానమే అనే భావానికి పట్టంగట్టి వర్తించాలని తిమ్మకవి తన శతకాల ద్వారా ఉపదేశించాడు. కరుడు గట్టిన సమాజాన్ని తన పద్యాలతో అధిక్షేపించాడు. మనిషిలో మార్పు రావాలని నిండుగా ఆకాంక్షించాడు. అలాంటి గొప్ప లక్షణాలు కలిగిన తిమ్మకవి పద్యాలు మాత్రమే రాచపుళ్ళవంటి నేటి సమాజ రుగ్మతలకు చికిత్స చేయగలవు. ఆయన పద్యాలు మాత్రమే కాలం తీరిపోని (expiry లేని) ఔషధమై ప్రతి కాలానికీ సమకాలీనమై, స్వీకరణ యోగ్యమై మనగలవు.

**ఉపయుక్తగ్రంథాలు**

1. ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (సంపుటం-3). హైదరాబాదు: తెలుగు అకాడమి.
2. గోపాలకృష్ణారావు, కె. 1976. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.
3. తిమ్మకవి, కూచిమంచి. 1993. చిరవిభవశతకము. హైదరాబాదు: రమాప్రచురణలు.
4. ......... 1982. భర్గశతకము (అధిక్షేపశతకములు). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
5. ......... 1968. కుక్కుటేశ్వరశతకము (శతకసంపుటము- 2). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
6. నాగయ్య, జి. 2009. తెలుగుసాహిత్యసమీక్ష(సంపుటం-2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.

## పాడు పల్లె

పాడు పల్లె
ఒక అనాసక్త సహచరుడిలా
ఎప్పుడూ నా పక్కన నిలబడి
నన్నూ నగరవాసినీ ఎగాదిగా చూస్తుంది

ఉదయం మధ్యాహ్నం
సాయంత్రం రాత్రి
ఎప్పుడూ ప్రశాంతంగా
నిశ్శబ్ద సంగీతాన్ని వింటూ
నాతో గుసగుసలాడుతుంది
తన ఒంటరి తనపు గాయాలను
కడగమంటుంది

నిశిరాతిరి రోడ్డు మీదకొస్తే
కరెంటు స్తంభాల కింద
జీబుగా వేలాడే కాంతిలో
పక్క తిరగెయ్యని కుక్కలా
ఆదమరచి పడుకొనుంటుంది

గాలి మోసుకొచ్చే ఊరి దుమ్ము
ఉబుసుపోని నాలుకల మీదుగా
గడ్డికుప్పల మీద పశువుల పాకల మీద
ఇళ్ల మీద పడి పేరుకుపోతుంటే
తట్టి పార గునపం సజ్జలన్నీ ముందేసుకొని
సుమ్మ చుట్టి నెత్తిమీద పెట్టి
చెరువు పనికి సిద్ధమౌతుంది

పాడు పల్లె
నన్ను బందీ చేసిన దారుల్లో
ఆకలిదప్పుల్నీ అవమానాలనూ
వేడినీ చలినీ వరదనూ బురదనూ
యొగల్నీ పాముల్నీ భరించడం
నేర్పుతుంది
నన్ను గొర్రెను చేసే కసాయిల వెంట
తల వాల్చుకు నడవడాన్ని కూడా..

మంచి పల్లెలు
ఎక్కడన్నా మిగిలి ఉన్నాయో
లేదో తెలియదు గానీ
పాడు పల్లె
మూసిన తలుపుల వెనుక
కూలిన గోడల మీదున్న కుల కుడ్యాల వెనుక
నోటిమీద సీళ్ళు వేసుకున్న ద్వారాల వెనుక
కుక్కిన శవాల్లా పడి ఉండలేక
నగరానికి మనసిచ్చుకోక తప్పడం లేదు

**కంచరాన భుజంగరావు**
ఫోన్ : 9441 589 602

# మాదిరెడ్డి సులోచన నవలల్లో 'హైదరాబాద్'

**స్వప్న భువకర్**, తెలుగు అధ్యాపకురాలు, ఫోన్ : 9490 235 017

తెలుగు నవలా సాహిత్యంలో సముచిత స్థానాన్ని సంపాదించుకొని, తెలంగాణా నవలకు ఎనలేని విశిష్టతను సంపాదించిపెట్టిన రచయిత్రి మాదిరెడ్డి సులోచన. జీవితం ముడిసరుకుగా నడిచే నవల, కథానికలకు ఉత్తమ చిరునామా ఆమె. పరిధి తక్కువైన కథను, ప్రపంచమంత విశాలమై, జీవితాన్ని నిర్వచించే నవలను సమర్థవంతంగా రచించగలిగిన ప్రతిభాశాలి.

1962లో రచన మొదలుపెట్టి 1965లో వెలువరించిన 'జీవనయాత్ర' తన మొట్టమొదటి నవలగా ఆమె ధ్రువీకరించింది. సులోచన 150 కథలు, 72 నవలలు, 2 నాటికలు, 10 ఏకాంకికలు రాసింది. పది నవలలు (సాంఘిక నవలలు) తెలుగు వెండి తెరపైకి ఎక్కి సినిమాలుగా ప్రజా బాహుళ్యంలోకి పోయాయి.

**"తెలంగాణ మలితరం తొలి రచయిత్రి ఆచార్య పాకాల యశోదారెడ్డి తర్వాత ఒక కుటుంబ దృక్పథంతో తెలంగాణ జీవన సంస్కృతిని, స్థానికతను ప్రతిబింబించిన నవలలు మాదిరెడ్డి సులోచనవి"** అన్న కె. విద్యావతి మాటలు అక్షరసత్యాలు. అగ్రశ్రేణి నవలా రచయిత్రిగా పేరొందిన ఆమె తన నవలల్లో తెలంగాణ జీవన సంస్కృతిని, స్థానికతను ప్రతిబింబించింది. తెలంగాణా ప్రాంతంలోని, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రదేశాలను, దర్శనీయ స్థలాలను తన నవలలలో లెక్కకు మిక్కిలిగా పేర్కొన్నది. ఆమె నవలలు చదువుతుంటే హైదరాబాద్ నగరంలో విహరిస్తున్నట్టే ఉంటుంది. మాదిరెడ్డి సులోచన తన నవలల్లో పేర్కొన్న ఆ ప్రదేశాల గురించి పరిశీలిద్దాం.

**ఖైరతాబాద్ హనుమాన్ మందిరం :**

హైదరాబాద్లోని అత్యంత పురాతన దేవాలయాలలో ఇది ఒకటి. ఇది హైదరాబాదులో హనుమంతుని రెండవ పెద్ద దేవాలయం. హనుమంతుడు దక్షిణముఖంగా ఉన్న ఆలయం. ఇది ఖైరతాబాద్ వాలే హనుమాన్ మందిర్ పేరుతో ప్రసిద్ధి చెందింది. నగరం నడిబొడ్డున చాలా సంవత్సరాలుగా ఒకే కుటుంబం నిర్వహిస్తున్న గొప్ప ప్రార్థనాస్థలం. సీతాదేవిని వెతుక్కుంటూ శ్రీలంక వెళ్లే సమయంలో హనుమంతుడు ఇక్కడ విశ్రాంతి తీసుకున్నాడని చెబుతారు. ఈ ఆలయంలో కూడా వివాహాలు జరిగినట్టు రాసింది.

ఇద్దరూ స్కూటర్పై ఖైరతాబాద్ లో వున్న హనుమాన్ టెంపులు వెళ్ళారు. క్లుప్తంగా వివాహం తంతు ముగిసింది.(మాదిరెడ్డి సులోచన, నెలవంక (నవల) పుట 232)

**కాచీగూడా హనుమాన్ మందిరం :**

ఈ ఆలయం కాచిగూడ రైల్వే స్టేషనుకు ఎదురుగా ఉంది. ఇది వీరన్నగుట్ట అనే ఒక చిన్న కొండపై ఉంది. వాస్తవానికి, ఈ ఆలయంలో హనుమంతుడు ప్రధాన దైవం. అయితే, తరువాత శివుని కోసం ఒక ఆలయం నిర్మించబడింది. తరువాత నిర్మించిన కృష్ణుని గుడి వల్ల వీరన్నగుట్టకు శ్యామ్ మందిర్ అని కొత్తపేరు వచ్చింది. ఆలయ సముదాయం లోపల గణపతి, నవగ్రహ, వీరభద్రుని దేవాలయాలు కూడా ఉన్నాయి. ఇవి శృంగేరిమఠం ద్వారా నడపబడుతున్నాయి. కాచీగూడా హనుమాన్ గుడిలో కూడా వివాహాలు జరిగినట్టు రాసింది మాదిరెడ్డి సులోచన.

చక్రధరరావు ఫోన్లు చేస్తే అన్ని హాల్లు బుక్ అయిపోయాయట. కాచీగూడా హనుమాన్ మందిరంలో మాత్రం దొరికింది. (మాదిరెడ్డి సులోచన, చిగురాకులలో చిలకమ్మ (నవల), పుట 178)

**బిర్లామందిర్ :**

హైదరాబాద్ లోని ప్రసిద్ధ బిర్లామందిర్ ఆలయాన్ని రామకృష్ణ మిషన్‌కు చెందిన స్వామి రంగనాథానంద సారథ్యంలో 1976లో బిర్లా ఫౌండేషన్ నిర్మించింది. ఇది నౌబత్ పహాడ్ యొక్క జంటకొండ, 280 అడుగుల ఎత్తైన కళాపహాడ్ పైన 13 అడుగుల ఎత్తులో ఉంది. ఈ ఆలయాన్ని రాజస్థాన్ నుండి దిగుమతి చేసుకున్న తెల్లని పాలరాయితో ద్రావిడ, రాజస్థానీ మరియు ఉత్కళ శైలులు మిళితం చేసి నిర్మించారు. స్వామి రంగనాథానంద ఈ ఆలయం ధ్యానానికి అనుకూలంగా ఉండాలని గంటలు ఏర్పాటు చేయలేదు. ఈ మందిర్లో వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు శివుడు, శక్తి, బ్రహ్మ, గణేష్, సరస్వతి, హనుమంతుడు, లక్ష్మి మరియు సాయిబాబాతో సహా వివిధ హిందూ దేవతలు మరియు బౌద్ధ దేవతల మందిరాలు కూడా ఉన్నాయి. ఆలయం లోపల, రామాయణం మరియు మహాభారతం వంటి గొప్ప ఇతిహాసాలను తెలిపే అనేక ఘట్టాలను పాలరాతిపై చెక్కారు. ఈ బిర్లామందిర్ పైనుండి చూస్తే హైదరాబాద్ నగరమంతా అందంగా కనిపిస్తుందని చెబుతుంది రచయిత్రి.

"నేను. పల్లవి బిర్లా టెంపుల్ చూచి వస్తాం అన్నయ్యా! మీరు వెళ్ళండి."......

ఇద్దరూ కారు దిగి, పైకి ఎక్కారు. దాదాపు పట్నమంతా కనిపిస్తుంది.(మాదిరెడ్డి సులోచన, లాహిరి (నవల), పుట 227)

**పబ్లిక్ గార్డెన్స్ :**

హైదరాబాదులోని నాంపల్లిలో ఉన్న పురాతన ఉద్యానవనం పబ్లిక్ గార్డెన్స్. ఈ గార్డెన్స్ 1846లో నిజాం నవాబు నిర్మించాడు. నిజాం పాలనలో దీనిని 'బాగ్-ఎ-ఆమ్' లేదా 'బాగం' అని పిలిచేవారు. ఉర్దూలో 'బాగ్' అంటే ఉద్యానవనం మరియు ఆమ్ లేదా ఆమ్

జనా అంటే పబ్లిక్. 1980 నుండి దీనిని పబ్లిక్ గార్డెన్స్ అని పిలుస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, లలితకళాతోరణం, జవహర్ బాలభవన్, తెలంగాణ రాష్ట్ర శాసనసభ, తెలంగాణ శాసనమండలి, జూబ్లీహాల్, ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం వంటి భవనాలు ఇక్కడ ఉన్నాయి. స్మారకభవనాలతో పాటు పచ్చిక బయళ్ళు, సరస్సు, విశాలమైన మైదానాలతో ఈ పార్కు ఆహ్లాదకరంగా ఉంటుంది. సంతోషంగా గడపడం కోసం పబ్లిక్ గార్డెన్స్ కు వెళ్ళినట్లు రాసింది మాదిరెడ్డి సులోచన.

"పిల్లలను తయారుచేసి నువ్వు తయారుగా వుండు. పబ్లిక్ గార్డెన్స్ కు వెళ్దాము. ........"

పబ్లిక్ గార్డెన్స్ పరవశంతో తిలకిస్తోంది అనూరాధ. (మాదిరెడ్డి సులోచన, ప్రేమలూ – పెళ్ళిళ్ళూ (నవల), పుట 117)

**రవీంద్రభారతి :**

రవీంద్రనాథ్ ఠాగూర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ నగరంలో రవీంద్రభారతిని నిర్మించారు. భారత ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ 1961, మే 11న ప్రారంభించారు. ముందు వైపు హాలులో రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహము ఉంది. ఒకేసారిగా వెయ్యి మంది కూర్చుని చూసే వీలు కల అతి పెద్ద ఆడిటోరియం, సమావేశాలకోసం 150 మంది కూర్చోగల సమావేశ మందిరం, సినిమా ప్రదర్శనల కోసం 112 సీట్లతో పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్ ఉన్నాయి. రవీంద్రభారతి మినీహాల్ అనేక సాహిత్య, సాంస్కృతిక ప్రదర్శనలకు, పుస్తకావిష్కరణలకు వేదికగా నిలుస్తున్నది. మాదిరెడ్డి సులోచన చాలా నవలల్లో పాత్రలు రవీంద్రభారతికి వెళ్లినట్టు రాసింది.

"అన్నయ్యా! రేపు రవీంద్ర భారతిలో దీపిక అన్నగారి మాజిక్ షో వుంది. ఆ తరువాత ఏమో కల్చరల్ షోస్ వున్నాయి రాకూడదూ?" (మాదిరెడ్డి సులోచన, యిల్లు కట్టి చూడు పెళ్ళి చేసి చూడు (నవల), పుట 181)

**హుస్సేన్ సాగర్ :**

హైదరాబాదు నగరపు నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ జలాశయాన్ని నగరం యొక్క మంచినీటి, సాగునీటి అవసరాలను తీర్చటానికి క్రీ.శ.1563లో ఇబ్రహీం కులీ కుతుబ్ షా, హుస్సేన్ షా వలీ పర్యవేక్షణలో నిర్మించాడు. హుస్సేన్ పేరు మీదుగా ప్రజలు హుస్సేన్ సాగర్ అని పిలవటం ప్రారంభించారు. 24 చదరపు కిలోమీటర్ల వైశాల్యం, 32 అడుగుల లోతు ఉన్న ఈ సరస్సు తవ్వకం పూర్తయినా నీరు నిండకపోవటంతో మూసీనదికి అనుసంధానం చేశారు.

జనాభా పెరిగి ఇప్పుడు పట్నం ఇరుకైపోయింది గాని ఒకప్పుడు హుస్సేన్ సాగర్ కింది బస్తీలో పది పన్నెండు ఇళ్ళే ఉన్నాయంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

రిక్షాదిగి, వీధిలో వున్న ఇళ్ళన్నీ వరుసగా చూస్తోంది. హుస్సేన్ సాగర్ చెరువుక్రింద వున్న ఆ బస్తీలో అన్నీ క్రొత్తయిళ్ళే కడుతున్నారు. పూర్తిగా కట్టిన యిళ్ళు, పది పన్నెండు వున్నాయేమో! (మాదిరెడ్డి సులోచన, సజీవ స్మృతులు (నవల), పుట 133)



**టాంక్ బండ్ :**

1568లో హుస్సేన్ సాగర్ చుట్టూ గట్టుగా నిర్మించబడిన రోడ్డును టాంక్‌బండ్ అంటారు. ఈ రోడ్డు హైదరాబాదు, సికింద్రాబాదు జంటనగరాలను కలుపుతుంది. నిజాం పాలనలో ఉన్న హైదరాబాదు నగరానికి, బ్రిటిష్ వారి అధీనంలో ఉన్న కంటోన్మెంటుకు మధ్య రాకపోకలకు ఈ కట్ట ఒక మార్గమయ్యింది. చెరువుగట్టుమీద మార్గంలో పూర్వము చెరువు కనిపించకుండా ఎత్తైన ప్రహరీ గోడలు ఉండేవి. 1946లో అప్పటి హైదరాబాదు దీవాను సర్ మీర్జా ఇస్మాయిల్ గోడలను కూల్చివేయించి వాటి స్థానంలో ఇనుప కడ్డీలతో కూడిన ప్రాకారాన్ని (రెయిలింగు) ను కట్టించాడు. ఈ విధంగా చెరువు కట్టమీద నడిచే వారికి చెరువు యొక్క దృశ్యాన్ని ఆస్వాదించే విధంగా మార్పులు చేశాడు. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఈ రోడ్డుపై 33 విగ్రహాలు నెలకొల్పబడ్డాయి. ప్రయాణికులతో, పర్యాటకులతో టాంక్‌బండ్ ఎప్పుడూ సందడిగా ఉంటుంది.

టాంకుబందుపై పెద్ద జాతరలా ఉంది. (మాదిరెడ్డి సులోచన, జీవనయాత్ర (నవల), పుట 179)

**ఇందిరా పార్క్ :**

ఇందిరా పార్కు హైదరాబాదు నగరంలోనే ఒక అతిపెద్ద ఉద్యానవనం. ఇది 76 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది దోమలగూడకు సమీపంలో, హుస్సేన్‌సాగర్ చెరువుకు దిగువన ఉంది. ఇది హైదరాబాద్లో ఉన్న పురాతన పార్కులలో ఒకటి. 1975లో అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ఈ పార్కుకు శంకుస్థాపన చేసాడు. 1978లో ఇది పూర్తై ప్రజల వినియోగంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ



పార్క్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీచే నిర్వహించబడుతుంది. 1994 సంవత్సరంలో ఏర్పాటు చేయబడ్డ మ్యూజికల్ డ్యాన్స్ ఫౌంటెన్ మరియు వాటర్ ఫాల్స్ వంటి అంశాలు ఈ పార్కుకు మరింత అందాన్ని తెచ్చాయి. ఆహ్లాదంగా కూర్చోవడానికి, చిన్నచిన్న పిక్నిక్లు మరియు స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఇందిరా పార్క్ ఎంతో అనువైనది.

సంజయ్ నిలబడి దూరంగా వచ్చేపోయేవారిని చూస్తున్నాడు. హైద్రాబాద్లో ఇన్ని రోజులనుండి ఉన్నా ఇందిరాపార్కును యెప్పుడూ చూడలేదు. చంద్రశేఖరం పోరుపడలేక పూర్ణిమను తీసుకువచ్చాడు. (మాదిరెడ్డి సులోచన, ప్రేమపంజరం (నవల), పుట 126)

**కింగ్ కోఠి :**

ఏడవ నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-48) నివసించిన ప్రాంతం – కింగ్ కోఠి. కింగ్ కోఠి అంటే కింగ్స్ ప్యాలెస్ అని అర్థం. ఈ నివాసంలోనే ఏడవ నిజాం 1967 ఫిబ్రవరి 24న తుదిశ్వాస విడిచాడు. కింగ్ కోఠి ప్యాలెస్ బాగా ధనవంతుడైన కమల్ ఖాన్ కు చెందింది. నిజాం నవాబు ముచ్చటపడితే కమల్ ఖాన్ నిజాంకు ఈ ప్యాలెస్ను బహుమతిగా అందజేశాడు. కమల్ ఖాన్ ఆ భవనములోని అన్ని తలుపులకు, కిటికీలకు, ఆర్చీలకు తన పేరున 'K' అనే ఆంగ్ల అక్షరాన్ని చెక్కించుకున్నాడు. తర్వాత నిజాం ఆ గుర్తును 'KK' అనగా కింగ్ కోఠిగా మార్పించాడు. అందుకే దాని పేరు కింగ్ కోఠి అని స్థిరపడింది. సుమారు 21 ఎకరాల్లో విస్తరించిన విశాలమైన కింగ్ కోఠి ప్యాలెస్లో అనేక భవనాలున్నాయి. ఈ కింగ్ కోఠిని కూడా మాదిరెడ్డి సులోచన తన నవలల్లో ప్రస్తావించింది.

అతని భార్యమణి అందుకుంది. "అవునండీ, కింగ్ కోఠీనుండి కారు వస్తుందట ఈయనను పిలువడానికి!" (మాదిరెడ్డి సులోచన, నాతోపాటు నల్గురం (నవల), పుట 118)

**సుల్తాన్ బజార్ :**

సుల్తాన్ బజార్ హైదరాబాదులోని ప్రసిద్ధ వాణిజ్య ప్రాంతం. అబిడ్స్, కోఠి వాణిజ్య ప్రాంతాల మధ్య ఈ సుల్తాన్ బజార్ ఉంది. గతంలో దీనిని రెసిడెన్సీ బజార్ అని పిలిచేవారు. తరువాత, సయ్యద్ సుల్తానుద్దీన్ నవాబ్ పేరుమీదుగా సుల్తాన్ బజార్ అని మార్చబడింది. నిజాం బంధువులు, కుటుంబసభ్యులు కూడా అప్పుడప్పుడు ఇక్కడికి షాపింగ్కు వస్తుండేవారట. ఈ ప్రాంతంలో ప్రధానంగా మహిళల బట్టలు, ఫ్యాషన్ వస్తువులు, వెండి సామాగ్రి అమ్మే దుకాణాలు 100కి పైగా ఇక్కడ ఉన్నాయి. మాదిరెడ్డి సులోచన కూడా సుల్తాన్ బజార్ లో షాపింగ్ చేసినట్టు రాసింది.

"అన్యమనస్కంగా తయారయి రాధ వెంట నడిచాను. సుల్తాన్ బజార్లో ఏదో కొట్టుదగ్గర ఆపి రాధ ఏదో స్టీలు గ్లాసులు కొన్నది." (మాదిరెడ్డి సులోచన, నాతోపాటు నల్గురం (నవల), పుట 141)

**నిజాం కళాశాల :**

బషీర్బాగలో ఉన్న నిజాం కళాశాల హైదరాబాదు మహానగరంలో ప్రఖ్యాతి గాంచిన ఉన్నత విద్యాసంస్థ. దీన్ని 1887లో రెండు విద్యా సంస్థలు – హైదరాబాద్ కాలేజి, మరియు మద్రసా-ఇ-ఆలియాలని విలీనం చేసి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన కళాశాల భవనం హైదరాబాదు నగర ప్రముఖులలో ఒకడైన ఫక్రుల్-ఉల్-ముల్క్ II యొక్క రాజభవనం. కళాశాల స్థాపకుడు నవాబ్ ఇమాదుల్ ముల్క్ సయ్యద్ హుస్సేన్ బిల్గ్రామీ, సరోజినీ నాయుడు తండ్రి అయిన డా.అఘోరనాథ్ ఛటోపాధ్యాయను కళాశాల తొలి ప్రిన్సిపాలుగా నియమించాడు. ప్రారంభంలో ఇది మద్రాస్ విశ్వవిద్యాలయానికి 60 సంవత్సరాలు అనుబంధంగా ఉంది. 1947 ఫిబ్రవరి 19న, ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలగా మారింది. ఈ చారిత్రక కళాశాల నుండి రెండు తెలుగు రాష్ట్రాలలో, దేశంలోని ఇతర ప్రాంతాలలో నేటి రాజకీయ నాయకులు, వైద్యులు చాలా మంది వచ్చారు. ప్రఖ్యాతి గాంచిన ఈ కళాశాల గురించి మాదిరెడ్డి సులోచన పలు నవలలలో ప్రస్తావించింది.

"నేను, శరత్ అనే స్నేహితుడు నిజామ్ కాలేజి స్టూడెంటు దగ్గరకు కంబైన్డ్ స్టడీస్ కని వెళ్ళివస్తున్నాను" అన్నాడు. (మాదిరెడ్డి సులోచన, నెలవంక (నవల), పుట 92)

నిజామ్ కాలేజీలో అప్లికేషన్ పెట్టడానికి వెళ్ళిన కూతురు నాలుగు గంటలయినా రాలేదంటే ఆశ్చర్యంగా ఉంది. (మాదిరెడ్డి సులోచన, లాహిరి (నవల), పుట 19)

**ఉస్మానియా విశ్వవిద్యాలయం :**

ఎందరో విద్యావేత్తలను, శాస్త్రవేత్తలను, మేధావులను రూపొందించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగునాట ఏర్పాటుచేసిన ప్రప్రథమ విశ్వవిద్యాలయం. దీనిని 1917లో 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హైదరాబాదు నగరంలో స్థాపించాడు. మొదట ఆబిడ్స్ దగ్గర గన్ఫౌండ్రి ప్రాంతంలో ఒక అద్దె భవనంలో

25 మంది సిబ్బంది, 225 విద్యార్థులతో ఇంటర్మీడియట్ సాయంకాలం కోర్సులతో ప్రారంభించి క్రమంగా 1921లో బి.ఏ., 1923లో ఎం.ఎ., ఎల్.ఎల్.బి., 1927లో మెడిసిన్, 1929లో ఇంజనీరింగు కోర్సులనూ ప్రవేశ పెట్టారు. అయితే నగరంలో వివిధ ప్రాంతాలలో వున్న కళాశాలలను పరిపాలనా సౌలభ్యం కొరకు ఒకే ప్రాంతంలో వుంటే బాగుంటుందని సంకల్పించి, తార్నాక ప్రాంతంలో 1400 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుత కాంపస్ ను ఏర్పాటు చేసారు. ప్రారంభ సమయంలో ఉర్దూ బోధనాభాషగా ఉండగా, స్వాతంత్ర్యానంతరం 1948 నుంచి ఆంగ్లం బోధనాభాషగా మారింది. భారతదేశంలో ఉన్నత విద్యాసంస్థలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం 7వ ప్రాచీన సంస్థగా, దక్షిణ భారతదేశంలో 3వ సంస్థగా పేరు గాంచింది. అత్యున్నత నైపుణ్యం కలవారికే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అవకాశం ఉంటుందని రాసింది మాదిరెడ్డి సులోచన.

"ప్రతి క్లాస్లో టాప్ చేశారు. ఈ కాలేజీ కెందుకు వచ్చారు?" చిన్నగా నవ్వాడు శ్రీకాంత్.

"అభ్యంతరమా?"

"అది కాదయ్యా, ప్రయత్నంచేస్తే ఉస్మానియా యూనివర్సిటీలో దొరికేది కదా?" అన్నాడు. (మాదిరెడ్డి సులోచన, శ్రీనిలయం (నవల), పుట 176)

అనుపమ ఉండేది హైద్రాబాద్ అయినా, ఉస్మానియా యూనివర్శిటీలో ఆమెకు ఎమ్.ఎస్సీ చదవటానికి సీటు దొరకలేదు. (మాదిరెడ్డి సులోచన, లాహిరి (నవల), పుట 10)

**శంకర మఠము :**

శృంగేరి మఠ శాఖలలో హైదరాబాద్లోని నల్లకుంటలోని శాఖామఠం ఒకటి. ప్రస్తుత మఠం మరియు ఆలయ సముదాయం ఉన్న భూమిని స్వర్గీయ శ్రీ రాజా వెంకటరావు లింబేకర్ విరాళంగా ఇచ్చాడు. 35వ జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామీజీ 1960–ఏప్రిల్ 26, అక్షయ తృతీయ రోజున ఆలయ ప్రతిష్ఠా కుంభాభిషేకం నిర్వహించారు. అప్పటి నుండి ఆలయం మరియు మఠం హైదరాబాద్ నగరంలోని సనాతనధర్మ అనుచరులకు, ఆధ్యాత్మిక కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా పనిచేస్తుంది. ప్రశాంతత కోసం శంకరమఠానికి వెళ్ళినట్లు రాసింది మాదిరెడ్డి సులోచన.

ఒకసారి శంకర మఠము చూద్దామని వెళ్ళింది. (మాదిరెడ్డి సులోచన, సంధ్యారాగం (నవల), పుట 57)

**రామకృష్ణ మఠం / రామకృష్ణ మిషన్ :**

రామకృష్ణ పరమహంస పురుషుల కోసం ఏర్పాటు చేసిన సన్యాసాశ్రమం రామకృష్ణ మఠం. స్వామీ వివేకానంద ఆయన



తత్వాలను వ్యాప్తి చేయడానికి స్థాపించిన ఆధ్యాత్మిక సంస్థ రామకృష్ణ మిషన్. ఈ రెండు సంస్థల ప్రధాన కార్యాలయాలు పశ్చిమ బెంగాల్ లోని బేలూర్ మఠం దగ్గర ఉన్నాయి. ఇవి రెండూ న్యాయపరంగా, ఆర్థికపరంగా రెండు ప్రత్యేక సంస్థలైనప్పటికీ, చాలా కార్యక్రమాలను కలిసే చేస్తాయి.

హైదరాబాద్ రామకృష్ణమఠం 1922లో బేగంపేట ప్రాంతంలో స్వతంత్ర ఆశ్రమంగా ప్రారంభమైంది. 1959లో సికింద్రాబాద్లోని మార్కెట్ స్ట్రీట్లో ఉన్న రామకృష్ణ–వివేకానంద సమితి రామకృష్ణమఠం లో విలీనమైంది. ఈ ఏకీకృత సంస్థ 1973లో రామకృష్ణమఠం, బేలూరు యొక్క శాఖాకేంద్రంగా మారింది. ఈ కేంద్రం 1979లో ప్రస్తుత ప్రాంగణానికి మారింది. దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 99 సంవత్సరాల పాటు మఠానికి లీజుకు ఇచ్చింది. రామకృష్ణ మఠం మరియు రామకృష్ణ మిషన్ ల గురించి రచయిత్రి తన వివిధ నవలలలో ప్రస్తావించింది.

మమ్మీ రామకృష్ణ మఠానికి వెళ్ళింది అంకుల్. చిన్మయానందగారి ఉపన్యాసముందట డాలీ చెప్పింది. (మాదిరెడ్డి సులోచన, మిస్టర్ సంపత్ M.A. (నవల), పుట 214)

శ్రీపతి రామకృష్ణా మిషన్ కు వెళ్లి తొమ్మిది దాటాక వస్తాడు. తాళం ఇంట్లో అద్దెకున్నవారికిచ్చింది. (మాదిరెడ్డి సులోచన, పుణ్య పురుషులు (నవల), పుట 176)

**బేగంపేట విమానాశ్రయం :**

బేగంపేట అంతర్జాతీయ విమానాశ్రయం 1930లలో హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హైదరాబాదు ఎయిర్ క్లబ్ స్థాపించడంతో ప్రారంభించబడింది. ఇది బ్రిటిష్ ఇండియాలో తొలి విమానయాన సంస్థ. మొదట దీనిని నిజాం ఉపయోగించాడు. బేగంపేట పాత ఎయిర్ పోర్టును హైదరాబాదు ఓల్డ్ ఎయిర్ పోర్టుగా కూడా పిలుస్తారు. పూర్వపు ఆంధ్రప్రదేశ్ లో ఈ విమానాశ్రయం అంతర్జాతీయ, వాణిజ్య సేవలందించేది. 2008 మార్చి 23న రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభ

మయ్యాక ఈ విమానాశ్రయం మూసివేయబడింది. బేగంపేట విమానాశ్రయం ప్రస్తుతం మిలిటరీ ఏవియేషన్ ట్రైనింగు, వి.ఐ.పిల విమానాల కొరకు ఉపయోగపడుతుంది.

బేగంపేట విమానాశ్రయం తిరునాళ్ళలా సందడిగా వుంది. (మాదిరెడ్డి సులోచన, సంధ్యారాగం (నవల), పుట 5)

**పురానాపూల్ :**

క్రీ.శ.1578లో ఇబ్రహీం కులీ కుతుబ్ షా నిర్మించిన పురానా పూల్ హైదరాబాద్ లోని అద్భుత కట్టడాల్లో ఒకటి. హైదరాబాద్ నగరంలో నిర్మించిన తొలి వంతెన కూడా ఇదే. గోల్కొండ కోట నుంచి కార్వాన్ వెళ్లేందుకు వీలుగా ఈ బ్రిడ్జీని నిర్మించారు. మరో కథనం ప్రకారంగా సుల్తాన్ ముహమ్మద్ కులీ కుతుబ్ షా భార్య భాగమతితో ప్రేమలో ఉన్నప్పుడు ఆమెను క్రమం తప్పకుండా కలవడానికి పురానాపూల్ నిర్మించాడు. ఈ పూల్ నిర్మాణంలో 22 ఆర్చ్ లు ఉన్నాయి. ఎత్తు 54 అడుగులు, పొడవు 600 అడుగులు, వెడల్పు 35 అడుగులు. 400 ఏళ్లనాటి ఈ కట్టడం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. 1820లో కొద్దిగా దెబ్బ తింటే నవాబ్ సికిందర్ షా మరమ్మతులు చేయించాడు. 1908లో మూసీనది వరదల తర్వాత దెబ్బతిన్న కొద్దిభాగాన్ని మరమ్మతు చేశారు. ఈ పురానాపూల్ దగ్గర శ్మశానవాటిక ఉండేదని రచయిత్రి తెలియజేస్తుంది.

అందరం పురానాపూల్ మీద దిగాకగాని నాకు తెలిసిరాలేదు లక్ష్మి అంతిమయాత్రని. ఆమె పోయిందంటే నమ్మలేకుండా ఉన్నాను. (మాదిరెడ్డి సులోచన, ఆశయాల ఆఖరిమెట్టు (నవల), పుట 49)

పురానాపూల్ పాత హైద్రాబాద్లో పురాతనమైన కట్టడం. అక్కడొక స్మశానవాటిక ఉంది. అక్కడక్కడ చిన్న మండపాలు ఉన్నాయి. (మాదిరెడ్డి సులోచన, ఋతుచక్రం (నవల), పుట 53)

**కిద్వాయ్ గార్డెన్ :**

హైదరాబాద్లోని హిమాయత్ నగర్లో ఉన్న కిద్వాయ్ గార్డెన్ ఒక ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం. ఇది 1974లో ప్రజల కోసం ప్రారంభించారు. ఈ గార్డెన్ పచ్చని చెట్లు, వికసించే పువ్వులతో అందంగా ఉంటుంది. సవారీలు, సీ-సాలు, స్లయిడ్లు మరియు అన్ని ఇతర ఆటలు ఆడడానికి అనువుగా పిల్లల కోసం రూపొందించ బడింది.

కిద్వాయి గార్డెన్స్‌లో ప్రశాంతముగా ఉన్న వాతావరణం. ఒక మూల చెట్టు క్రింద విజయ ఒడిలో తలపెట్టి పడుకున్నాడు శ్రీకాంత్. (మాదిరెడ్డి సులోచన, శ్రీనిలయం (నవల), పుట 152)

**జూ పార్క్ :**

హైదరాబాద్ లోని మీర్ ఆలమ్ చెరువు సమీపంలో బహదూర్ పూర్‌లో ఉన్న నెహ్రూ జంతుప్రదర్శనశాలను జూపార్క్ అని కూడా పిలుస్తారు. ఇది భారతదేశంలోని అతి పెద్ద జంతుప్రదర్శనశాలలలో ఒకటి. దీనిని 1963 అక్టోబరు 6న ప్రధానమంత్రి నెహ్రూ పేరుమీద స్థాపించారు. ఇది 380 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. సింహం, పెద్దపులి, తెల్లపులి, తెల్లనెమళ్ళు, ఆఫ్రికన్ ఏనుగులు, చింపాంజీలు మరియు ఖడ్గమృగాల వంటి దాదాపు 1,500 జాతుల జంతువులు, పక్షులు మొదలైన వాటిని రక్షిస్తున్నది.

"అన్నయ్యా! నాకు జూ చూడాలని ఉందిరా." అన్నాడు. (మాదిరెడ్డి సులోచన, నవతరం (నవల), పుట 98)

**సారథి స్టూడియోస్ :**

సారథి స్టూడియోస్ లేదా సారథి పిక్చర్స్ సినిమా నిర్మాణ సంస్థ. తెలుగు సినిమా తొలిరోజుల్లో ఉన్నత ఆదర్శభావాలతో, సామాజిక చైతన్యానికి విలువనిచ్చి చిత్రనిర్మాణం సాగించిన సంస్థ. ఇది ముందు మద్రాసులో ఉండి తర్వాత కాలంలో హైదరాబాదులో స్టుడియో నిర్మాణం చేసింది. ఇది హైదరాబాదులో నిర్మించబడిన తొలి స్టూడియో. గుత్తా రామినీడు దర్శకత్వంలో వచ్చిన మా ఇంటి మహాలక్ష్మీ సినిమా ఇందులో చిత్రీకరణ జరుపుకున్న తొలిచిత్రం. ప్రస్తుతం ఇక్కడ సినిమాలు, సీరియళ్ళు, షార్ట్ ఫిల్మ్స్, యాడ్ ఫిల్మ్స్ షూటింగ్ జరుపుకుంటున్నాయి.

"డార్లింగ్! నాకు ఈ రోజు కారు కావాలి. సారథిలో ఏదో షూటింగ్ ఉందట." (మాదిరెడ్డి సులోచన, పుణ్య పురుషులు (నవల), పుట 94)

మాదిరెడ్డి సులోచన తన నవలల్లో కీసరగుట్ట, ఎగ్జిబిషన్ గ్రౌండ్, ఉమెన్స్ కాలేజి, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, సీతాఫల్‌మండి, బొల్లారం, శంషాబాద్ వంటి అనేక ప్రాంతాలను గురించి సందర్భోచితంగా ప్రస్తావించింది. ఆమె నవలలు సుమారుగా వ్యావహారికంలో నడిచినా, అవిభక్త ఆంధ్రప్రదేశ్ లోని సంస్కృతినే ప్రతిబింబించినా అవసరమైన చోటల్లా ఆమె తెలంగాణ ఆచారవ్యవహారాలను, సంస్కృతిని చొప్పించడానికి పూనుకుంది. ఆమె నవలల ద్వారా ఒకనాటి హైదరాబాద్ పట్టణ సౌందర్యాన్ని అంచనా వేయవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1.మాదిరెడ్డి సులోచన నవలలు

2. మాదిరెడ్డిసులోచన మోనోగ్రాఫ్, విద్యావతి

3. ఆదాబ్ హైదరాబాద్, మల్లాది కృష్ణానంద్

4. వికీపీడియా(తెలుగు)

# విరాజిల్లిన తెలంగాణ అవధాన వైభవం

సాగర్ల సత్తయ్య, ఫోన్ : 7989 11 7415




**అవధాన తెలంగాణ (వ్యాసావళి)**
అవుసుల భాను ప్రకాశ్
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత,
11-10/జి2, సెవెన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్, కె.యస్.నగర్, పోతిరెడ్డిపల్లి, సంగారెడ్డి - 502 001. ఫోన్ : 96032 04507

సంస్కృతాంధ్ర భాషల్లో విలసిల్లిన విశిష్ట కళ అవధానం. ఇది మనోహరమైన పాండితీ ప్రదర్శన కళ. విద్వత్తు, ఏకాగ్రత, సమయస్ఫూర్తి కలిగిన పండితులు మాత్రమే ప్రదర్శించగలిగిన కళ. చారిత్రకంగా సాంస్కృతికంగా సాహిత్య పరంగా వైభవోపేతంగా వెలుగొందిన తెలంగాణ నేల అవధాన విద్యకు ఆటపట్టయి విరాజిల్లింది అనడానికి అవుసుల భాను ప్రకాశ్ రాసిన అవధాన తెలంగాణ వ్యాసాలు ప్రబల సాక్ష్యం.

అవధాన విద్యపై తెలుగు సాహిత్యంలో పరిశోధనా గ్రంధాలు ఇతర ప్రక్రియలతో పోల్చినప్పుడు కాస్త తక్కువే అని చెప్పాలి. విశేషించి తెలంగాణ అవధాన సాహిత్యం పై ఒక ప్రామాణిక గ్రంథం లేకపోవడం పెద్ద లోటే. ఆ లోటును పూరిస్తూ సాధికారికమైన పరిశోధనా వ్యాసాలను భాను ప్రకాశ్ అందించగలిగారు. భాను ప్రకాశ్ స్వతహాగా అష్టావధాని. అవధాన విద్యలో మర్మమెరిగిన వాడు. కనుకనే సాధికారికమైన వ్యాసాలను వెలువరించగలిగారు.

అవధాన తెలంగాణ గ్రంథంలో వ్యాసాల వింగడింపు రచయిత పరిశోధనా పటిమను, సూక్ష్మ పరిశీలనా శక్తిని చాటి చెబుతుంది. మొదటి అధ్యాయంగా 'అవధానం' పేరుతో నేటి తరానికి అవధానాన్ని చక్కగా పరిచయం చేయగలిగారు. సమాంతరంగా సాహిత్య విద్యార్థులకు పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తమైన పాఠ్యాంశంగా ఈ అధ్యాయం సాగింది. రెండవ అధ్యాయం 'అవధానం తెలంగాణం'. తెలంగాణ నేలపై విలసిల్లిన అవధాన వైభవాన్ని చాటి చెప్పిన సంక్షిప్త పరిచయం ఇది. ఇక అసలు పరిశోధన మూడవ అధ్యాయం నుంచి ప్రారంభమైంది.తెలంగాణ నేలపై అవధానాలు చేసిన మొత్తం 81మంది అవధానులను మూడు భాగాలుగా వింగడించుకొని వారి సంక్షిప్త పరిచయాన్ని సోదాహరణంగా వివరించారు.

'ప్రాచీనావధానులు' అధ్యాయంలో కొలిచెలమ మల్లినాథుడు మొదలు శాస్త్రుల విఠాల శర్మ వరకు 13వ శతాబ్దము నుంచి 19వ శతాబ్దం మధ్యకాలపు అవధానులను పరిచయం చేశారు. ఈ అవధానులలో అనేక మంది పేర్లు సాహిత్య విద్యార్థులకు పరిచయం అయినప్పటికీ వారు కవులుగా మాత్రమే పరిచయం కానీ అవధానులుగా బహుశా కొద్దిమందికి మాత్రమే పరిచయం. ఉదాహరణకు చిత్రభారతం రాసిన చరికొండ ధర్మన్న కవిగా సుప్రసిద్ధులు. కానీ అవధానిగా ఈ గ్రంథం ధర్మన్నను పాఠకుల ముందు నిలుపుతుంది. ఈ విధంగా కవుల లోని మరొక కోణాన్ని భాను ప్రకాశ్ లోకానికి ఎరుకపరిచారు.

నాలుగవ అధ్యాయం 'దివ్యమూర్తులు' లో ఆధునిక కాలంలో అవధానాలు చేసి గతించిన వారి పరిచయ వ్యాసాలను పొందుపరిచారు. ఈ విభాగంలో నైజాం రాష్ట్ర తొలి శతావధాని శ్రీ శిరశినహల్ కృష్ణమాచార్యులు మొదలు అవధాన విద్యపై పరిశోధన చేసిన ద్విశతావధాని రాళ్ల బండి కవితా ప్రసాద్ వరకు 18 మంది అవధానులను గురించిన వ్యాసాలు ఉన్నాయి. ఈ అధ్యాయంలోని వ్యాసాలలో ఆయా అవధానులు చెప్పిన ఆశు పద్యాలతో పాటు ఆ అవధానుల గురించి ప్రముఖులు చెప్పిన పద్యాలను సైతం సేకరించి ఉదహరించడం భాను ప్రకాశ్ పరిశోధనా కృషిని చాటి చెబుతున్నది.

ఐదవ అధ్యాయం నడయాడే సారస్వతమూర్తులు. ఈ అధ్యాయం లో కోవెల సుప్రసన్నాచార్య మొదలు ఇటీవల నవ యువకుడు నల్లాన్ చక్రవర్తుల సాహిత్ వరకు నలభై మూడు మంది అష్టావధానుల సాహితీ విన్యాసాలను సోదాహరణంగా రమణీయమైన పద్యాలతో పాటు పరిచయం చేశారు.

అవధానులకు మెట్టినిల్లు తెలంగాణ అనే అధ్యాయంలో అనేకమంది అవధానులకు తెలంగాణ నేల ఆశ్రయమిచ్చిన వైనాన్ని పరిశోధనాత్మకంగా వివరించారు నాటి గద్వాల సంస్థానం మొదలు నేటి వరకు ఇతర ప్రాంతాలకు చెందిన అనేకమంది అవధానులను ఆదరించి సమున్నతంగా గౌరవించిన విధానాన్ని తెలియజేశారు.

ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపిన మహమ్మారి కరోనా. గడప దాటలేని స్థితిలో సాంకేతికత ఆధారంగా ఆ కాలాన్ని అవధానాలు సమస్యా పూరణ, మొదలైన సాహిత్య క్రీడలను కాలక్షేపంగా మలుచుకున్న వైనాన్ని ఈ అధ్యాయంలో చర్చించారు. ఈ కాలంలోనే పద్య విద్య సాధన చేస్తున్న అనేకులు అవధానులయ్యే దక్షతను సంపాదించుకున్నారనడానికి ఉదాహరణలు చూపారు.

అవధాన వికాసం సంస్థలు సమూహాలు అనే అధ్యాయంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పద్య సేద్యాన్ని ప్రోత్సహిస్తున్న సంస్థలు వాట్సప్ సమూహాలను గురించి చర్చించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక తెలంగాణ సాహిత్య అకాడమీ మొదలు వివిధ జిల్లాల సాంస్కృతిక మండళ్లు పద్యానికి అవధానానికి ఏ విధంగా సేవలు అందిస్తున్నాయో తెలియజేశారు. ఆయా సాహిత్య సంస్థల నిర్వాహకులను ప్రస్తావించారు.

ఇట్లా ఈ అవగాహన తెలంగాణ గ్రంథం తెలంగాణ పద్య వైభవాన్ని, అవధాన వికాసాన్ని పరిశోధనాత్మక దృక్పథంతో చాటి చెప్పింది అనడంలో సందేహం లేదు.ఇది చాలా గొప్ప ప్రయత్నం. భావి పరిశోధకులకు ఈ గ్రంథం ఓ దిక్సూచి కాగలదు.తెలంగాణ వైభవాన్ని ప్రపంచానికి చాటడానికి ఈ గ్రంథం ఒక ఆకర గ్రంథం గా ఉపయుక్తమవుతుందని భావిస్తున్నాను.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2023

# అరుదైన యాత్రా కథనం

శ్రీనివాస్ బందా, న్యూఢిల్లీ, ఫోన్ : 9910 120 391




**అనగనగా ఒక రాజ్యం (థాయ్‌లాండ్ యాత్రాగాథ)**
దాసరి అమరేంద్ర, ఫోన్ : 98189 82614
వెల : 140 /-
**ప్రతులకు :** నవోదయ, తెలుగు బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్.

నాకు తెలిసినంతవరకూ దాసరి అమరేంద్ర ఒక పరిణతి చెందిన యాత్రికుడు. కొద్దిగా వివరిస్తాను. పర్యాటకులకీ, యాత్రికులకీ తేడా వుంది. తాము ఎంచుకున్న ప్రదేశాలని సందర్శిస్తారు పర్యాటకులు. అనేక రకాల సామాజిక, కుల, మత, సాంఘిక, రాజకీయ కారణాలు వారి పర్యటనలకు ఆధారాలవుతాయి. ఆ సందర్భాల్లో కొన్ని ఫోటోల సృష్టి జరుగుతుంది. కొన్ని పారివారిక, స్నేహ, వృత్తిపరమైన బృందాలలో ఆయా పర్యటనల వివరాలు నమోదవుతాయి. ఆ ఫోటోలు సాంఘిక మాధ్యమాలలోకి కూడా చేరే అవకాశముంది. కొందరి యాత్రా కథనాలు, వారు ఏ వూళ్ళో, ఏ హోటల్లో దిగారు, ఏం ఆర్డర్ చేసారు, ఏం తిన్నారు, ఎంత అరిగించుకున్నారువంటి వివరాలతో సహా, రాశిలో మిన్నలుగా వాసిలో సున్నలుగా పరిణమించి మిగులుతాయి. అలాంటి వాటిని కూడా చదివిన అనుభవం, ఈ మాటలకి పృష్ఠభూమి. ఎట్టి సంబంధమూ లేకపోయినా, కేవలం పక్క సీట్లో కూర్చున్నానన్న చిన్న అవకాశాన్ని పురస్కరించుకుని, తమ పర్యటన వివరాలను అడగకుండానే తెలియజెప్పే ఆత్రపరులు కూడా కద్దు. ఇది నాకు నిజంగా అనుభవం లోకి వచ్చిందే.

“యాత్రికులు” దీనికి భిన్నమైన పద్ధతిని పాటిస్తారు. అమరేంద్ర గారూ అంతే. ఆ ప్రయాణాలు ఏ విధమైన లాభాపేక్షకైనా అతీతాలు. అమరేంద్రగారికి అలాంటి యాత్రలు చేయడమే ఇష్టం. అలా చేపట్టిన ఒక యాత్రని మనందరి చేతా కూడా చేయించే ఒక పుస్తకం – “అనగనగా ఒక రాజ్యం”. ఇది, అమరేంద్ర గారు థాయ్‌లాండ్ లో జరిపిన యాత్రాకథనం. అమరేంద్రగారు థాయ్ లాండ్ లో పర్యటించి, అక్కడి వాతావరణాన్ని, సంస్కృతిని, సాంఘిక జీవనాన్నీ అనుభవించి, ఆస్వాదించి, తాదాత్మ్యతని, స్వీయ దర్శనాన్ని పొంది వ్రాసిన పుస్తకమిది.

ఈ పుస్తకమే కాదు. వారు వెలువరించిన యే యాత్రాకథనంలోనైనా, ఒక గాఢమైన జిజ్ఞాస స్ఫురిస్తుంది. ఆ జిజ్ఞాస ఒక కొత్త ప్రాంతాన్ని చూడటానికి మాత్రమే పరిమితం కాదు. ఆయన్ని ఆ జిజ్ఞాస ఆ ప్రాంతంలోకి, వీలైనంత మేరకు సమ్మిళితం చేస్తుంది. ఆ ప్రాంతాన్ని, దాని శోభను, అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని, తనలోకి మిళితం చేసుకోవాలన్న తపనని ఆయనలో నింపుతుంది. ఆ తపనను ఆచరణ లోకి అనువదింపజేస్తుంది. అటు పిమ్మట ఆ అనుభవాన్ని ఆయన మనకు అందజేసినగానీ ఆ జిజ్ఞాస విరామం తీసుకోదు.

ఈ బృహత్కార్యాన్ని బహుపసందుగా మార్చడానికి, ఆయన వద్ద కొన్ని ముఖ్యమైన పరికరాలు – టూల్స్ ఉన్నాయి. అవి – ఒకటి – నిష్కల్మషమైన చిరునవ్వు, రెండోది – నిజాయితీ నిండిన ఆసక్తి, మూడోది – ఆ ప్రాంతపు మనుషుల మీదనే కాక, మనుషులందరి మీదా – వ్యత్యాసరహితమైన – కాలుష్యాలేవీ సోకని ఆపేక్ష అని నాకు తోస్తుంది.

ఇది ఎలా సాధ్యం అన్న ప్రశ్నకి, నాకు అర్థమైన సమాధానం – ఊహ తెలిసినప్పటినుంచీ జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఎదిగి, ప్రభుత్వంలో ఒక ఉన్నతాధికారిగా వ్యవహరించి, ఎన్నో క్లిష్టతరమైన విజయాలను ప్రయత్నపూర్వకంగా పొంది, తను నమ్మిన మానవత్వపు విలువలతోబాటు, పరిస్థితుల పట్ల సునిశితమైన అవగాహనే కాక, స్పష్టతను, అదుపునూ కూడా సాధించిన వ్యక్తి కాబట్టి, విద్యాధికుడు కాబట్టి, తనమీద, తన చుట్టూ ఉన్న ప్రపంచం మీద చక్కటి స్పష్టమైన అవగాహనని ఏర్పరచుకున్న వారు కాబట్టి, సాహిత్యమే జీవితమనీ జీవితమే సాహిత్యమనీ మనసా వాచా కర్మణా నమ్మేవారు కాబట్టి, సాటి మనుషుల మీద ఆప్యాయత పెల్లుబకడం అనేది ఆయనకు అప్రయత్నంగా పట్టుబడింది.

అందుకనే వారి యాత్రా కథనాల్లో అవసరమైన మేరకు వివరాలతోబాటు, ఉపయోగకరమైన గమనింపుల చేర్పు, స్థాయీ భేదం లేకుండా వీలైనంతమంది మనుషులతో ఇంటరాక్షన్ వంటి విశేషాలు కనబడతాయి. ఇంటరాక్షన్ అంటే, అది ‘మూడు నదులు’ అన్న వ్యాసంలో, రోడ్డు పక్కన బడ్డీ కొట్లో టీ తాగుతూ, ఆ కొట్టు తాలూకు ఏడెనిమిదేళ్ళ పాపతో మాట్లాడడం కావచ్చు, ఇంకేదో పరాయి దేశంలో ఒక సహయాత్రికుడితో impromptu గా జరిపిన సంభాషణ కావచ్చు – ఇలా ఎన్నో ఉదాహరణలు వారి యాత్రల్లో గమనింపుకు వస్తాయి. ఈ ఇంటరాక్షన్ అంటే యథాలాపంగా పలకరించడం కాక, మనస్ఫూర్తిగా కలుసుకోవడం అని మనం చూడవచ్చు. అటువంటి సంఘటనలని సృష్టించుకోవడానికి, ఒక వ్యక్తిలో ఎంత మేరకు సకారాత్మక ధోరణి ఉండాలో ఆలోచించండి.

అమరేంద్ర గారి రచనల్లో సున్నితమైన హాస్యం కనిపిస్తుంది. థాయ్ లాండ్ యాత్రలో, రెండు భారతీయ యాత్రికుల కుటుంబాల అభ్యర్థన మేరకు వీరు ఫోటోలు తీసిపెట్టి, వాళ్ళతో ఇలా అన్నారట – “ఫోటోలు బాగా వచ్చాయి. తీసిందెవరూ అని మిమ్మల్ని అడక్కపోరు. ‘అమరేంద్ర’ అని చెప్పండి.” మళ్ళీ క్షణం ఆగి, “అమరేంద్ర బాహుబలి అని చెప్పండి” అని జోడించారట! అలాగే, ఆ దేశపు కొత్త రాజుగారి పట్టాభిషేకం జరగబోతున్న సందర్భంలో, “కొత్త రాజుగారి పట్టాభిషేకానికి మీరు వెళ్ళరా?” అని తమని తామే ప్రశ్న వేసుకుని, “లేదు, అంత తీరిక లేదు మాకు” అని తామే సరదా సమాధానాలు చెప్పుకున్నారట!

ఇవన్నీ ఒకెత్తు. చూసి అనుభవంలోకి తెచ్చుకున్న వాస్తవాలను ప్రపంచంతో పంచుకునేటప్పుడు, అంతకు ముందర తనలో చోటు చేసుకున్న అపోహలను తొలగించుకోగలగడం, అలా తొలగించుకుంటున్న విషయాన్ని నిర్మొహమాటంగా ఒప్పుకోగలగడం. అలా ఒప్పుకోగలగడానికి చాలా కన్విక్షన్ కావాలి నా ఉద్దేశంలో.

అమరేంద్రగారు మరిన్ని యాత్రలు చేయాలి – చేస్తారు. వారి యాత్రానుభవాలు వారితోబాటు మనల్ని కూడా అలరిస్తాయి, కొత్త ఎరుకలను కలుగజేస్తాయి అన్న ఆకాంక్షతో, వారికి అభినందనలు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 10 హైదరాబాద్ ఆగస్టు : 2023


## స్వీకృతి




**కాల పదాలు**
డా. మల్లెగోడ గంగాప్రసాద్
వెల : 220 /-
**ప్రతులకు :** వారధి పబ్లికేషన్స్, 2-2-185/56/2/3, సోమసుందర్ నగర్, డి.డి. కాలనీ, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013. ఫోన్ : 7386387249



**పోతన గజేంద్రమోక్షం - వ్యక్తిత్వ వికాసం**
డా. మల్లెగోడ గంగాప్రసాద్
వెల : 100 /-
**ప్రతులకు :** వారధి పబ్లికేషన్స్, 2-2-185/56/2/3, సోమసుందర్ నగర్, డి.డి. కాలనీ, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 7386387249




**శ్రీపదార్చన**
హరి వేంకట లక్ష్మీప్రసాదు బాబు
వెల : 50 /-
**ప్రతులకు :** రచయిత,
ఇం.నెం. 6-2-122/ఎ/1, జమ్మిబండ పార్కు దగ్గర, ఖమ్మం - 507 002.
ఫోన్ : 94400 83119.




**శ్రీ నారసింహ ద్విశతి**
హరి వేంకట లక్ష్మీప్రసాదు బాబు
వెల : 100 /-
**ప్రతులకు :** రచయిత,
ఇం.నెం. 6-2-122/ఎ/1, జమ్మిబండ పార్కు దగ్గర, ఖమ్మం - 507 002.
ఫోన్ : 94400 83119.




**ప్రసాద రాఘవమ్**
హరి వేంకట లక్ష్మీప్రసాదు బాబు
వెల : 60 /-
**ప్రతులకు :** రచయిత,
ఇం.నెం. 6-2-122/ఎ/1, జమ్మిబండ పార్కు దగ్గర, ఖమ్మం - 507 002.
ఫోన్ : 94400 83119.

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్‌అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# ప్రశ్నగా మారిన చిరునామా

జీవితాల్ని ఛిద్రం చేస్తున్న స్వార్థం
అర్థం లేని జీవన పరమార్థం
ప్రాణికోటికి ఆధారమైన భూమి
ప్రాణాల్ని హరీ మనిపిస్తుంది.

పేగు బంధాన్ని తెంచేసి
అనుబంధాల్ని మంట కలుపుతుంది
ఊహల లోకంలో అందాల స్వప్నాల్ని
ఆవిష్కరించే హృదయం
విలవిల్లాడిపోతుంది.

ఎగిరే శాంతికపోతాల మాటున
విశృంఖలంగా సాగుతున్న ధ్వంసరచన
వైజ్ఞానిక శిఖరాలను
అధిరోహించినా
పాతాళంలోకి పడిపోతున్న మంచితనం
పచ్చదనాన్ని చూసి కళ్ళల్లో నిప్పులు
పోసుకునే వైనం
పరుగెత్తే వారిని సైతం
అడ్డుకునే కుటిలత్వం
అనుబంధాలను
వెక్కిరిస్తూ
మన అను పదం జీవన నిఘంటువులో
లేకుండా చేస్తున్న దుస్థితి

రెప్పపాటు జీవిత కాలానికి
ఎంతటి ఘోరాలు మరెంతటి
అవమానాలు
తీయని మాటల వెనుక
దాగిన కాలకూట విషం
పడిన బంతి పైకి లేచినట్లే
కష్టాలను సహించినోడో

డా. తండు కృష్ణ కౌండిన్య
అధ్యక్షులు, తెలుగుశాఖ, నాగార్జున ప్రభుత్వ
కళాశాల, నల్గొండ. ఫోన్ : 97047 31346







సుఖాల శిఖరాల్ని చేరాలి కదా!

గాఢాంధకారం అలముకున్నా
ఆశల చిరు జ్యోతిని వెలిగించి
బతుకంతా వెన్నెలమయం కావాలని
కోరుకునే త్యాగమయ జీవనం ఎక్కడ?

ఎంతటి అమానవీయత
కట్టుబాట్ల సాలెగూళ్ళ మధ్యన
తనకు తానే చిక్కుకొని విలవిల్లాడే దీనత్వం
మనిషి మనిషిలా లేకుండ పోతున్నడు
ఎంతటి స్థానంలో ఉన్నా
ప్రశ్నగా మారిన చిరునామా..



LEARN
PLAY
EXPLORE
30 YEARS
Glorious Service to Social Progress.
UPGRADED TO
CBSE
Senior Secondary School
Pre-Primary, Primary School
• Optimum class strength
• Child-friendly teaching by skilled teachers
• Safe educational toys to stimulate learning
• Activities include vocabulary enrichment, life skills, storytelling and acting.
• One-to-one attention
• Physical exercises, dance, singing, aerobics & field trips
• Regular Parent - Teacher interaction
Middle & High School
• Optimum class strength
• Well-qualified and trained teachers
• State-of-the-art AV hall and labs
• Visual and Performing arts
• Well stacked Library
• Monthly Parent-Teacher interaction
• A good ground preparation of competitive & common entrance exams
• Yoga and Meditation for Physical & Mental balance
We impart education by integrating proven, world-class teaching methods with modern infrastructure and technology.
AI
The latest pedagogy in classroom teaching
Estd-1989
SISTER NIVEDITA SCHOOL
CBSE - Senior Secondary School
Class I to XII
THE PLAY SCHOOL
Kindergarten Wing of SNS
Nursery, LKG & UKG
CBSE Affiliation Code: 36300400
# D.K.Road, AMEERPET, Hyderabad-500 016. Ph.: 040-2373 1518, 4230 1518,
Mobile: +91 80967 38855, E-mail:snschoolamp@gmail.com
For Your Child's Bright Future...
www.snschool.com